
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ  మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !  సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్ పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 09
**ఫిబ్రవరి 2017**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**94407 69798**
**99491 11175**


## నవయుగము యొక్క వసంతము

మంచి ఆలోచనలు, చక్కని సంకల్పములు అనే నిప్పురవ్వలు మన మనస్సు (భావన)లో అగ్నిజ్వాలల రూపం దాల్చితే అప్పుడు నవయుగంలో వసంతము యొక్క అనుభూతి కలుగుతుంది. పూర్వం వసంతము యొక్క అనుభూతి వేరుగా ఉండి ఉండవచ్చుగాక! అది నిన్నటి యుగం సంగతి. నవయుగ వసంతము యొక్క అనుభవము తీరు కూడా క్రొత్తగా ఉండాల్సిందే! పనిలో, ఆటలో-పాటలో, విలాసాలలో పాడే వసంతగానం ఇప్పుడు పాతదైపోయింది. ఇప్పుడు మానవుల బాధ, పీడనము, పరాభవము యొక్క భావముతో ఈ గీతాన్ని పాడాలి.

శృంగారభరితమైన వినసొంపగు సంగీతములోని వసంతము తాలూకు అనుభూతిని ఇప్పుడు అణచివెయ్యాలి. సంఘర్షణలకు సమాధానము భైరవరాగంలో వెతకాలి. సుగంధమును వెదజల్లే విరబూసిన రంగురంగుల పువ్వులు, పాటలు పాడుతున్న పక్షులు కాలుష్య ప్రభావము వల్ల మసకబారి, రంగు వెలసిపోయాయి. ఇప్పుడు వసంతపు పరిమళము మరియు స్వరాలు ఈ కాలుష్యముతో సతమతమవ్వకుండా విజయము సాధించాలి. ఉదయించే సూర్యుడు కాలుష్యము వల్ల నల్లగా మారిపోయాడు. రాత్రిపూట వచ్చే చంద్రుడు ఎర్రగా అయిపోయాడు. ఈ సూర్య-చంద్రుల సహజ సౌందర్యమును తిరిగి తీసుకునిరావటానికి నవయుగము యొక్క వసంతానికి క్రొత్త రంగులు వెతకాలి.

ప్రకృతిని సింగారించే వసంతము ఇప్పుడు అదే ప్రకృతిని మోదువారుస్తోంది, ప్రళయమును సృష్టిస్తోంది. కొమ్మలు ఎండిపోయాయి. పండ్లలో రసం ఇంకిపోయింది. వీటిని మళ్ళీ తిరిగి నింపటానికి ఈ నవయుగములోని వసంతమును అలంకరణకు ప్రాధాన్యత ఇచ్చేదిగా కాకుండా సాధనకు ప్రాముఖ్యతను ఇచ్చేదిగా తీర్చిదిద్దాలి. నవయుగము యొక్క క్రొత్త వసంతము నవ్వులు-కేరింతలు కాదు బలిదానము కోరుకుంటున్నది. క్రొత్త జీవితము యొక్క మంచి కోసము పాత చెత్తాచెదారాన్ని వదిలించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. యువతరములోని క్రాంతిని జాగరణ చేయటం అనివార్యమయ్యింది.

దీనికోసము మహాసరస్వతి వీణావాదిగా కాకుండా శుంభ-నిశుంభులనే రాక్షసులను సంహరించిన సంహారిణి రూపములో అవతరించవలసిన ఆవశ్యకత ఏర్పడినది. అప్పుడే క్రొత్త యుగము యొక్క వసంతము నూతన సృష్టికి మంచిని చేయగలుగుతుంది. మాత సరస్వతి సంతానమునకు వారి ప్రాణములలో వసంతము యొక్క ఈ క్రొత్త అనుభూతిని జాగృతము చేయాలి.

ఈ ప్రళయకాలపు వేదనే క్రొత్త సృష్టికి మధురగానం అవుతుంది. ఈ వెలుగే - చీకటిపై యుగసూర్యుని వరదానము అవుతుంది.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2016*
*అనువాదం: శ్రీమతి స్వప్న*

# విషయసూచిక


1. **సంపాదకీయం:** నవయుగము యొక్క వసంతము 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-22:** బాపు కస్తూర్బాల ఆదర్శం 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-56:** స్పష్టమైన కొత్త సంకల్పాలు 6
5. **సూక్ష్మీకరణ సాధన-15:** ఆత్మబలము శాశ్వతము - ఫలహితము కూడా 9
6. **వసంత పంచమి ప్రత్యేకం:** జ్ఞానము, తపస్సు, ప్రేమల కలయికే - ఈ వసంతపర్వము 13
7. **వసంత పంచమి ప్రత్యేకం:** ఖాళీ అవడానికి సిద్ధపడ్డవాడికి భగవంతుని ద్వారం తెరచుకుంటుంది 16
8. **21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 3:** నిరాశలో ఆశాకిరణాలు 18
9. **అంతర్యాత్ర-3:** మనస్సు తొలగిపోతేనే చిత్తవృత్త యోగం యొక్క సత్యము తెలుస్తుంది 22
10. **జీవనయాగం-2:** ఐదు 'వకారములు' విద్యార్థిని తీర్చిదిద్దుతాయి 25
11. **సమాజ నిర్మాణం:** సామూహిక కర్మఫల వ్యవస్థ 28
12. **కుటుంబ నిర్మాణము:** ప్రేమతోనే కుటుంబములో సంతోషం వెల్లివిరుస్తుంది 30
13. **సత్యయుగం సునిశ్చితముగా వచ్చి తీరుతుంది** 32
14. **బోధ కథ:** అల్లాకి విలువైన కానుక - రాబియా 35
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** భారతీయ సంస్కృతి నిర్మాణక్రమంలో యజ్ఞం తండ్రియైతే - తల్లి గాయత్రీమాత 38
16. **నా వారితో నా మాట:** మహాక్రాంతి ప్రారంభమయింది - ఆధ్యాత్మిక సామ్యవాదం వచ్చి తీరుతుంది 42
17. **ఆయుర్వేద వైద్యం-23:** ఔషధ గుణాలతో నిండియున్న వెల్లుల్లి 45
18. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-11) 47
19. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49



## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**ఫిబ్రవరి 2017**

| | |
|---|---|
| 01-02-2017 | వసంత పంచమి |
| 03-02-2017 | రథ సప్తమి |
| 24-02-2017 | మహాశివరాత్రి |
| 28-02-2017 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |


**మార్చి 2017**

| | |
|---|---|
| 12-03-2017 | హోలి పూర్ణిమ |
| 29-03-2017 | ఉగాది |
| 30-03-2017 | మత్స్య జయంతి |

**విజయం సాధించాలంటే కష్టపడవలసినదే, ఓర్పుతో ఉండవలసినదే**

యుగనిర్మాణ చిత్రావళి-22

# బాపూజీ, కస్తూర్బాల ఆదర్శం



బాపు యొక్క ఆజ్ఞానుసారం వారి ధర్మపత్ని కస్తూర్బాగాంధీ దగ్గరగా ఉన్న గ్రామాలలోని మహిళలకు స్వచ్ఛత నేర్పేందుకు వెళ్తుండేది, భర్త యొక్క భుజంతో భుజం కలిపి సమాజ సేవలలో పాలుపంచుకునేది.

ఒకసారి బీదవారు ఉన్న ఒక గ్రామానికి వెళ్ళింది. అక్కడి మహిళలకు శుభ్రత గురించి పాఠాలు చెప్తుంటే ఆ స్త్రీలు ఇలా అన్నారు – "మీరు వస్త్రములు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్తున్నారు. మా దగ్గర ఒక్కొక్క చీర మాత్రమే ఉన్నది. చెప్పండి ఎలా ఉతకాలో, ఎలా ఆరబెట్టాలో. ఈ చీరని రెండు ముక్కలు చేసి ఒక ముక్క కట్టుకుంటాము, ఒక ముక్క ఆరబెడ్తాము. ఇది మా పరిస్థితి"

వారి దయనీయ పరిస్థితి విని కస్తూర్బా కంటిలో నీరు ఉబికాయి. ఆమె ఇంటికి వెళ్ళి విషయమంతా బాపుకి వివరించింది. గాంధీజీ ఈ వృత్తాంతం అంతా విని చాలా దుఃఖించారు. ఈ దేశంలో ప్రజలు ఇంత బీదవారిగా ఉంటే ఇతరులు సంపన్నవంతులుగా ఉండే అధికారం లేదు అని తలచారు. న్యాయవ్యవస్థ దృష్టిలో అది అపరాధం కాక పోవచ్చు. కానీ మానవీయ దృష్టిలో అది పాపమే. తాము సంపాయించిన ధనములో జీవనయానం కొరకు ఎంత అవసరమయితే అంతవరకే ఖర్చు చేయాలి, మిగిలిన ధనం లోకమంగళం కొరకు ఖర్చు చేయాలి.

బాపూజీ దగ్గర అనేక ధోవతులు ఉండేవి. వాటిని మార్చి మార్చి ధరించేవారు. కానీ ఇప్పుడు కొన్ని వస్త్రాలతోనే కాలం గడపాలని నిశ్చయించుకున్నారు. గాంధీగారు ఒక ధోవతిని కస్తూర్బాకు ఇచ్చి దానిని రెండుగా చించమన్నారు. ధోవతి యొక్క రెండు ముక్కలను తీసుకుని ఒకటి నడుము క్రింద కట్టుకుని, ఒకటి వంటిపైకి కప్పుకున్నారు. ఆరోజు నుండి బాపూజీ వస్త్రములే కాక జీవితం యొక్క అవసరాలలో "నియమిత" అనే నియమం పెట్టుకున్నారు. అలా ఆదా చేసిన ధనమును బీదవారికి, ఇతర అవసరమైన పనులలో ఉపయోగించే వారు. కస్తూర్బా కూడా ఆనాటి నుండి వీలయినంత తక్కువగా మామూలు వస్త్రములతో కాలం గడపాలనే నియమం పెట్టుకున్నారు. ఆభరణాలను త్యాగం చేశారు. కొంత మంది యొక్క ప్రాథమిక అవసరాలు కూడా తీరనప్పుడు మరి కొంతమంది ధనాన్ని వ్యర్థం చేస్తుంటే అది సామాజిక అపరాధము, ఈ అపరాధంలో నేను ఎందుకు పాలుపంచుకోవాలి? అని అన్నది.

బాపు, కస్తూర్బాల ఈ ఉదారత, మానవీయ భావన వలననే వారికి జనుల ప్రేమ, స్నేహం లభించాయి. సమాజమునకు, దేశవాసులకు ఈ నొప్పి తెలియాలని, ఉదార భావన అవసరం తెలియచెప్పకపోతే ప్రజలను తన అనుయాయులుగా చేసుకోలేకపోయేవారు.


కొందరు పేరాశతో విలాసంగా జీవించాలని అనుచితంగా ధనం కూడబెడుతుంటారు. కానీ శ్రద్ధ, ఆత్మశాంతి ఫ్యాషన్‌తో, ధనంతో రాదని నిజమైన ఉదారత వర్షిస్తేనే లభిస్తుందని బాపు కస్తూర్బాల జీవితం చెప్తుంది.

– *అనువాదం : ముక్కామల రత్నాకర్*

**అనుకున్నది సాధించాలంటే పట్టుదల ఉండాలి**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-56

# స్పష్టమైన కొత్త సంకల్పాలు



ఆదిశంకరాచార్యులవారు స్థాపించిన మఠాలలో కంచి కామకోటి మఠం ఎక్కువ ప్రసిద్ధి చెందింది. ఇక్కడి వైభవం, పరంపర చాలామటుకు చెదర లేదు. ఇక్కడి ఆచార్యుల విద్వత్తు, తపస్సు అద్వితీయమైనవి. మిగిలిన మఠాలలోని ఆచార్యుల విద్వత్తు, తపస్సు కూడా సామాన్యమైనవి కావు. కానీ అవన్నీ ధర్మాంధ శాసకుల అత్యాచారాలకు గురి అయ్యాయి. ఉన్మాదులు వాటిని కొల్లగొట్టారు. ఆదిశంకరాచార్యులవారు కూడా అప్పటికి దేహం చాలించారు. కంచి మఠానికి ఆ దుస్థితి పట్టలేదు.

చాలామంది విద్వాంసులు అసలు కంచి మఠాన్ని శంకరాచార్యులవారు స్థాపించనే లేదు అని అంటారు. ఆయన స్థాపించిన నాలుగు మఠాలు బద్రినాథ్, ద్వారక, పూరి, శృంగేరి. ఈ నాలుగు మఠాలలో వారి నలుగురు ముఖ్య శిష్యులను నియమించి, ధర్మ సంస్కృతి పతాకాన్ని ఎగురవేసే బాధ్యతను అప్పగించారు. ఈ నాలుగింటినీ తప్ప వేరే మఠాలను కొందరు విద్వాంసులు స్వీకరించరు కూడా. కానీ కంచిమఠం అంతకు ముందు ఉన్నది, ఇప్పటికీ ఉన్నది. ముఖ్య శిష్యులకు ఆ నాలుగు మఠాలు అప్పగించి, ఆచార్యులవారు స్వయంగా కంచిలో ఉండిపోయారు అని అనుచరులు నమ్ముతారు. తమ అంత్యకాలం ఇక్కడే గడిపారని అంటారు.

కంచికి వెళ్ళకముందే శ్రీరామ్‌కు ఈ విషయాలన్నీ తెలిశాయి. తిరుపతి నుండి వచ్చే దారిలో ఈ క్షేత్రం గురించి కొన్ని విలక్షణమైన విషయాలు తెలిశాయి. ఉత్తర భారతదేశంలో వీటి గురించి పెద్దగా తెలియదు. కంచి నగర నిర్మాణం ఆధ్యాత్మిక దృష్టితో జరిగిందని చెప్తుంటారు. తిరుపతి నుండి, తనతో కూడా ప్రయాణించిన శివానందస్వాములవారు కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలు చెప్పారు. వారు గొప్ప కామాక్షీ ఉపాసకులు. దక్షిణ భారతంలో ఏదో అరణ్య ప్రదేశంలో ఉంటూ తపోసాధన చేస్తుంటారు. పౌర్ణమి రోజున కంచిలో కామాక్షీదేవి దర్శనం చేసుకోవాలని సంకల్పించుకున్నారు. అందుకే బయలుదేరారు. ఆదిశంకరాచార్యులవారు నిర్దేశించిన ప్రకారమే నగర నిర్మాణం జరిగిందని ఆయన చెప్పారు. ఆ వాస్తువిద్య గురించి ఏ పుస్తకాల్లోను కనిపించదు. ఆచార్యులవారు తమ అంతర్దృష్టితోనే ఆ స్వరూపాన్ని నిర్ధారించారు. దాని వల్లనే నగరంలోని ధార్మిక, ఆధ్యాత్మిక వాతావరణం నిలిచి ఉంటుంది. అందుకే అక్కడికి వెళ్ళే భక్తుల మనస్సులలో సాత్విక భావాలు ఉదయిస్తుంటాయి. యాత్రికుల చిత్తం అనాయాసంగా ధర్మకార్యాలలో ప్రవృత్తమవు తుంది.

కంచి నగరానికి కేంద్రం కామాక్షి ఆలయం. దానిని ఆధారంగా తీసుకుని ఆచార్యులవారు శ్రీచక్ర యంత్ర ఆకారంలో నగరాన్ని రూపొందించారు. ఆధ్యాత్మిక దృష్టి ఎప్పటికీ ఆ క్షేత్రంలో సక్రియంగా ఉండడం కోసం ఎన్నో స్థాపనలు చేశారు. ఆదిశక్తి పార్వతి స్వరూపమే కామాక్షి. అమ్మవారిని పూజించటం వల్ల కోరికలు తీరి ఆత్మిక లక్ష్యం వైపు ప్రేరితులవుతారు. కైలాస మానస సరోవరం నుంచి తెచ్చిన విగ్రహాన్ని, 'యోగ లింగాన్ని' ఆదిశంకరాచార్యులవారు ఇక్కడే స్థాపించారు. నైష్ఠిక బ్రహ్మచారి మాత్రమే ఈ విగ్రహాన్ని పూజించాలని నిర్ణయించారు. ఆ బాధ్యతను అప్పగిస్తూ వారు తమ క్రొత్త శిష్యుడిని మఠానికి అధ్యక్షుడిగా చేశారు. ఆయన ప్రధాన శిష్యుడైన సురేశ్వరాచార్యుడిని అధిపతిని చేస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ ఆయన గృహస్థాశ్రమం నుండి సన్యాసం తీసుకున్నారు. బాల బ్రహ్మచారి కాదు. అందుకే ఆయనను ఆచార్యులవారు ఇక్కడ అధిపతిగా నియమించలేదు.

ఏడు మోక్షతీర్థాలలో కంచి ఒకటి. ఇక్కడ ఆది శంకరాచార్యులవారు వెయ్యి మందిరాలను నిర్మించారని ప్రతీతి. వాటిల్లో పది వేలకు పైగా శివలింగాలను స్థాపించారు. ఇప్పుడు మహా అయితే రెండు వందల మందిరాలు ఉంటాయి. కాలక్రమేణ అంతరించిపోయినవి కొన్ని, విధ్వంసానికి గురైనవి

**పట్టుదల, నిష్ఠ ఉంటే ఎన్నడు ఓటమి ఉండదు**

కొన్ని. ఈ దేవస్థాపనల దగ్గర శ్రీరామ్ ఎక్కువ సేపు లేరు. వారు కైలాశనాధుని గుడికి వెళ్ళారు. ఇది చాలా పురాతనమైన ఆలయం. 8వ శతాబ్దంలో పల్లవ రాజులు కట్టించిన ఈ గుడిలో మనోహరమైన శివపార్వతుల విగ్రహం ఉంటుంది. నాట్యం చేస్తున్న గౌరీశంకరులను బ్రహ్మ, విష్ణువులు చూస్తుంటారు. అక్కడేదో పోటీ జరుగుతున్నట్టు, ఆ ఇద్దరు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆలయ శిల్పకళ దృష్టిని కట్టిపడేస్తుంది.

## ప్రపంచం ఈశ్వరుని నాట్యవిన్యాసం

కైలాశనాధుని దర్శించి శ్రీరామ్ కామాక్షి ఆలయానికి వెళ్ళారు. దారిలో ఒక భక్తుడు మధురంగా ఏదో స్తోత్రం ఆలపిస్తున్నాడు. దాని భావం, ప్రపంచం ఈశ్వరుని కృతి కాదు రచన, నాట్యం. ఆయన నాట్యం చేసినప్పుడు ఆట కనిపిస్తుంది. ఆగినప్పుడు స్థిరంగా ఉంటుంది. సృష్టిని సృష్టికర్త నుంచి వేరు చేయవచ్చు, శిల్పి నుండి విగ్రహాన్ని వేరు చేసినట్టు. కానీ సృష్టి ఈశ్వరుడి నుండి వేరు కాదు, నర్తకుడి నుండి నాట్యం లాగా. స్తోత్రంలోని భావం నిగూఢమైనది, గంభీర మైనది. ఆలపిస్తున్న ఆ కంఠం, మధుర స్వరాలు మనస్సుకు హత్తుకున్నాయి.

కామాక్షి ఆలయంలో పార్వతీదేవి ముందు నిలబడి ఆ స్తోత్రంలోని భావాలనే శ్రీరామ్ వల్లెవేశారు. అక్కడి నుంచి మఠానికి వెళ్ళారు. మఠాధిపతి, చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారికి సందేశం పంపారు. కొద్ది సేపట్లోనే పిలుపు వచ్చింది. అక్కడ అందరు దూరం నుండే నమస్కరించుకుంటున్నారు. వారంతా ఆయనను స్వామిగల్ అని సంబోధిస్తున్నారు. స్వామిగల్ ఎవరిని పాదాలను తాకనిచ్చేవారు కాదు. భక్తులను దగ్గరగా రానిచ్చేవారు కాదు. వారు సన్నగా, పొడుగ్గా, తపస్సుతో ప్రకాశిస్తూ దర్శనమిచ్చారు. అందరిలాగానే శ్రీరామ్ నమస్కరించారు. కూర్చోమంటూ స్వామిగల్ సైగ చేశారు. సంస్కృతంలోనే క్షేమ సమాచారం కనుక్కున్నారు. ఆయనకి హిందీ వచ్చినా, సంస్కృతంలోనే భావాన్ని స్పష్టంగా వ్యక్తపరచ గలరు. కుశల ప్రశ్నలయ్యాక స్వామిగల్ శ్రీరామ్ వేషభాషలను పరిశీలించి, "మీరు కూడా మోహన్‌దాస్ అనుయాయులా?" అని అడిగారు.

మోహన్‌దాస్ అంటే ఆయన ఉద్దేశం మహాత్మాగాంధీగారు అని. దేశ స్వాతంత్ర్య ఆందోళన మొదలుపెట్టే ముందు బాపు స్వామిగల్‌ను కలిశారు. దేశాన్ని అర్థం చేసుకోవడం కోసం మూలమూలలకి వెళ్ళారు. భారతదేశం తిరిగొచ్చిన మొదటి రోజులలోనే గాంధీగారు స్వామిగల్‌ను కలిశారు. స్వామిగల్‌తో చర్చిస్తూ బాపు తన ఆలోచన గురించి చెప్పారు. ఆందోళన కేవలం ప్రభుత్వాన్ని చేతులోకి తీసుకోవడం కోసం జరగ కూడదని హెచ్చరించారు. స్వతంత్రం అంటే దేశము మరియ ధర్మాల గౌరవం నిలబెట్టడం. అప్పుడు వారు మోహన్‌దాస్‌గానే అందరికీ తెలుసు. ఆ పేరుతోనే స్వామిగల్ ఆయనను గుర్తుపడతారు. గాంధీగారి ఆందోళనలో తరువాత స్వదేశీ, భారతీయత, స్వధర్మం వంటి భావాలు కలిశాయి. వారి ఆత్మీయ ప్రేరణ వల్లనే అది కుదిరింది, ఇందులో ఏ సందేహము లేదు. కానీ వారి ఆత్మను తాకిన విభూతులలో చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి కూడా ఉన్నారు. గాంధీగారు స్వయంగా తన ఆత్మకథలో ఈ విషయాన్ని పరోక్షంగా ఉల్లేఖించారు. గాంధీగారి అనుయాయివా అని స్వామిగల్ అడిగిన ప్రశ్నకి శ్రీరామ్ 'అవును' లేదా 'కాదు' అనే జవాబు చెప్పలేకపోయారు. సామాజిక, రాజకీయ కర్మల వెనక వారి తపస్సు, సాధనల ప్రబల ధారలు కూడా చిత్తంలో ప్రవహిస్తున్నాయి. ఇలా ఆలోచిస్తూ వారు మాట్లాడకుండా ఉండిపోయారు.

స్వామిగల్ శ్రీరామ్ సంకోచాన్ని అర్థం చేసుకున్నారు. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఆయనే ఇలా అన్నారు – "మోహన్‌దాస్‌కు రాజనైతిక కర్మ ప్రధానం. ధర్మము, సాధన అనేవి వారికి వ్యక్తిగతమైన, ఆంతరిక పక్షం. మీకు అలా కాదు కాబోలు. లోపల, బయట, సామాజికంగా, వ్యక్తిగతంగా అన్ని క్షేత్రాల్లో ధర్మధారణకే ప్రాధాన్యతనిచ్చింది మీ నియతి.

స్వామిగల్ కనబరిచిన పరిగణన శ్రీరామ్‌ను పులకింప చేసింది. తను చేసే సాధన, భవిష్యత్తులో మహత్కార్యాలకు సిద్ధయోగుల ఆశీర్వాదం ఉన్నట్టు ఆయనకు తెలుసు. సూక్ష్మ జగత్తులో దీని కోసం సహకారం, సమర్థన వర్షిస్తోంది. ఎన్నో విషయాల గురించి స్వామిగల్‌తో చర్చించారు. పరంపర, శాస్త్ర మీమాంస, ఆధునిక పరిస్థితులు మొదలైన అనేక విషయాలు చర్చించారు. గాంధీగారి హరిజనులు, అంటరానివారి ఉద్ధరణ కార్యక్రమాలు ఆ రోజుల్లో వివాదాలను లేవనెత్తాయి. ఈ

**కార్యదీక్షతో చేసే ఏ పని అయినా నెరవేరకుండా ఉండదు**

విషయమై స్వామిగల్ ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవాలని, "ఒక ప్రత్యేకమైన కులం లేదా వర్గంలో జన్మ మనిషి ఔన్నత్యానికి కారణం కాగలదా?"

## సాంప్రదాయక దృష్టి

స్వామిగల్ ఉన్నత స్థాయి సాధువు, తపస్సంపన్నులు. ఈ సామాజిక విషయాలలో వారి అభిప్రాయానికి విలువ ఉంటుంది. ఆయన ఇలా సమాధానమిచ్చారు – "మనిషిలో ఔన్నత్యాన్ని గానీ, హీనత్వాన్ని గానీ పరిగణించే కారణాలలో వంశం, జాతి కూడా ఒకటి."

"నేటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే ఈ మర్మం అర్థం కాదు. మన ఋషులు, మునులు ఆత్మిక ఉన్నతి కోసం రకరకాల ప్రయోగాలు చేసే రోజులలో చైతన్యాన్ని నిరంతరం లేదా జన్మాంతరాల వరకు సంస్కరించి ఉంచడానికి కులము, జాతుల కఠోర నియమాలు ఏర్పరిచారు. ఒకప్పుడు వాటి అవసరం ఉండేది. ఇప్పుడు కాదు."

"ఏ సమాజంలో నైనా మనిషి ఔన్నత్యాన్ని కులముతో పరిగణించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉంటుంది?"

"గొప్పతనం, హీనత్వం పట్టించుకుంటూ ఒకరికి మాన్యత నిచ్చి, మరొకరిని అవమానించడం వలన ఏ సమాజానికి ఎన్నడూ ఉపయోగం లేదు. ఆరోగ్యకరమైన సామాజిక వాతావరణం ఉన్నంత కాలం ఆధ్యాత్మికంగానే వీటి ప్రాముఖ్యత ఉండేది. ఒకే రకమైన స్వభావము, సంస్కృతి, ప్రవృత్తులు కలిగినవారు ఒకే వాతావరణాన్ని ఏర్పాటు చేసుకుని ఉండేవారు. కుటుంబం నుంచిగాని, జాతి సమూహాలలో గాని మనం ఆశించేది సంరక్షణ, అనుకూల వాతావరణం, అంతేగా... కానీ ఇదంతా గడిచిపోయిన యుగం విషయాలు. ఇప్పుడు కొత్త విద్యా విధానం, పరిపాలనా పద్ధతి వలన పరిస్థితులు బాగా మారిపోయాయి. ఆ పాత విషయాలను వల్లెవేయడానికి లేదు."

గాయత్రీ ఉపాసన, వేదాల అధ్యయన అధికారం, కర్మ కాండలకు సంబంధించి స్వామిగల్‌కు వ్యక్తిగత అభిప్రాయాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటి గురించి మాత్రమే శ్రీరామ్ చర్చించారు. స్వామిగల్ అభిప్రాయాలు సాంప్రదాయికంగా ఉన్నా, నిరాధారమైనవి మాత్రం కాదని తెలుసుకున్నారు. గాయత్రీ ఉపాసన గురించి మాట్లాడినప్పుడు, అది బ్రాహ్మణులకు మాత్రమే అని అన్నారు ఆయన. అయితే ఒక జాతిలో పుట్టడం వల్ల బ్రాహ్మణుడు కాడు అని కూడా తెలిపారు. బ్రాహ్మణత్వం అనేది ఒక ప్రవృత్తి. దానిని సంపాదించవచ్చు కూడా. పుట్టుకతో రాకపోతే సంపాదించాల్సిందే. సాత్విక ప్రవృత్తి, జిజ్ఞాస ఉంటేనే అధ్యయనం వల్ల ఉపయోగం ఉంటుంది. అది లేకపోతే మనిషి వాటిని వినాశనానికే ఉపయోగిస్తాడు. అసురుల వలె అతను తనను ఉద్ధరించుకోలేడు, ఇతరులకు ఉపయోగపడడు. ఆలయాలలో పూజలు, హారతులు నియమ నిష్ఠలతో చేయవలసి ఉంటుంది. ఆ పనిలో జీవాన్ని, శక్తిని నింపడమే నియమాల ఉద్దేశ్యం.

కొత్త నియమాలను కూడా తయారుచేయవచ్చు. 'పరంపర, వ్యవస్థలలో సవరణలు కూడా చేయవచ్చు. కానీ దానికి అధికారం ఉండాలి. ఆ అధికారం ఋషిసత్తాల నుండే లభిస్తుంది. ఎవరుపడితే వారు మార్పులు, చేర్పులు నిర్ధారిస్తే అస్తవ్యస్తంగా మారుతుంది.'

దీనికి ఉదాహరణ ఇస్తూ, 'పాలనకు సంబంధించిన నియమాలు పాలకులే తయారుచేస్తారు. వాటిని అమలు చేయడం వారికే సాధ్యం. వేరెవరు అది చేయలేరు. ధార్మిక క్షేత్రంలో కొత్త పరంపరలు రూపొందించడం, సవరణలు చేయడం అనేది ఋషుల చేతిలోనే ఉన్నది.'

'ఆ అధికారం సంపాదించుకోవచ్చునా, లేదా లభిస్తుందా?'

'సమయము, సమాజముల అవసరాన్ని బట్టి పరమాత్మ సత్తా ఆ అధికారాన్ని ఇస్తుంది. కొత్త పరంపర లేదా నియమాల నిర్వహణ చేయగల సామర్థ్యమే అందుకు గీటురాయి. ఒక నియమాన్ని ఏర్పరిచాక, దానిని పాటించడం వల్ల ఎలాంటి ఉపయోగము లేకపోతే ఇక నియమం ఎందుకు? బొమ్మలాట అవుతుంది. శంకరాచార్యులవారు ఎన్నోరకాల పూజ అనుష్ఠానాలను కూర్చారు. అవి చేయడం వల్ల పరిణామాలు ఉత్పన్నమయ్యే సామర్థ్యం కూడా ఆయనే వాటికి కల్పించారు. ఆ తరువాత పరంపర వాటిని పోషించింది. ఇప్పుడు కూడా కొత్త విధానాల సంరచన చేయవచ్చు. ఎప్పుడైనా చేయవచ్చు. అందుకు కావలసిందల్లా అధికారమే' అని స్వామిగల్ సమాధానమిచ్చారు.

– *అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**పట్టుదలతో అనుకున్నది సాధించిన వారే విజేతలవుతారు**

సూక్ష్మీకరణ సాధన - 15

# ఆత్మబలము శాశ్వతము - ఫలహితము కూడా

శక్తులన్నింటిలోకి గొప్పది ఆత్మబలము. ప్రకృతి శక్తులన్నీ అశాశ్వతములు. అంతేగాక స్వల్పమైన లోపాలు ఉపయోగించుటలో జరిగితే ప్రయోగకర్తకు ఇతరులకు కూడా ప్రమాదములు జరుగుతాయి. ధనం, రూపం, యవ్వనం, జ్ఞానం మొదలైనవి అన్నీ అశాశ్వతములే. వీటివల్ల తాత్కాలికమైన సుఖసంపత్తిని పొందగలము. అదే వీటి ఆకర్షణకు కారణము కూడా. అందరు వీనిని ఆర్జించుకొనుటకు, పొందుటకు ఉత్కంఠ చూపిస్తారు. కానీ దానిని సదుపయోగము చేసుకొనుట చేతకాక చిక్కులలో పడుతూ ఉంటారు. దుర్వ్యసనపరులు, కుకర్ములు, దుర్గుణములు ఉన్న వ్యక్తులు సాధారణంగా సంపన్నులలో ఎక్కువగా ఉంటారు. ఈర్ష్య కూడా వీరిలోనే ఎక్కువగా ఉంటుంది. అయినా వీటిలో దేనికీ స్థిరత్వము ఉండదు. నిరంతరము కదలికగల ఈ విశ్వంలో ప్రతి వస్తువు క్షణంక్షణం మారుతూ ఉంటుంది. మన మనస్సుకు కూడా ఇలాంటి పరిస్థితులలో ఎప్పుడు ఏ వస్తువు ఎంతవరకు ప్రియంగా ఉంటుందో చెప్పలేము.

ఈ తథ్యమును గుర్తించి విజ్ఞులు ఎప్పుడు ఆత్మబల సంచయమునే బలపరిచారు. దీనికి స్థిరత్వము కూడా ఉన్నది. చేతనత్వము, వ్యక్తిత్వము ప్రఖరమై, భౌతిక-ఆత్మిక రెండు క్షేత్రాలలో సఫలత పొందగలుగుతారు.

ఆత్మబలసంపన్నులు నిజమైన సంపదగలవారు. వారు లౌకిక దృష్టిలో నిర్ధనులైనా నిజంగా ధనహీనులు కారు. తినడం కంటే తినిపించుటలో వీరికి ఆనందము ఎక్కువ. అందువల్ల అపవ్యయము చేయుట, విలాసవస్తువులను సేకరించుటకు బదులు వీరు అవసరమున్నవారికి పంచుతూ ఉంటారు. అందువల్ల వ్యక్తిగత జీవితంలో సాదాజీవనసరళి అభ్యసించడం వలన ఆధ్యాత్మవాదులు బీదవారిగా కనిపించినా వారి భౌతిక సంపద కూడా అసాధారణంగా ఉంటుంది. వారికి ముఖ్య కార్యక్రమాలకు అనంత జన సహాయం లభించినప్పుడు వారి ధనము ఎంతమంది దగ్గిర సురక్షితంగా ఉన్నదో తెలుస్తుంది. వీరి ఒక్క పిలుపుతో అది ఆకర్షింపబడుతుంది.

గాంధీగారు నిర్ధనులే. కానీ గాంధీస్మారకనిధిలో కోట్ల రూపాయలు ఏకత్రితమైనాయి. ఆయన ధర్మపత్ని స్మారక నిధికి కూడా 60 కోట్ల రూపాయలు ఏకత్రితమయ్యాయి. ఏ మహా మానవునికి కూడా ధనలేమి వల్ల తన కార్యక్రమములను ఆపవలసిన అవసరము రాలేదు. సుగ్రీవ, విభీషణ, సుదామ, మొదలగువారికి ఎప్పుడు ధనము లేకపోవుట లేదు. వీరు ఆదర్శములకు దూరంగా కేవలము ఉదరపోషణ, ప్రజననకు మాత్రమే పరిమితులై ఉంటే అందరివలే అనామకులై జీవించి ఉండేవారు.

ఆత్మబలము సర్వశ్రేష్ఠబలము. దానిని సంగ్రహించుకోమని విజ్ఞులు ప్రతి శ్రేయార్థిని ఉద్బోధిస్తారు. దీనిని అనుసరించేవాడు మొదట వెక్కిరించబడినా కొంతకాలానికి ఈ మార్గాన్ని అనుసరించేవారు ఏమీ పోగొట్టుకొనరని, ఇంకా చెప్పాలంటే చాలా లబ్ధి పొందుతారని తెలుస్తుంది. బూటకపు ఆధ్యాత్మికతను పాటించేవారు మాత్రమే అపహాస్యం పాలవుతారు. ధూపదీపముల ఖర్చుతో దేవతల జేబులు కొట్టాలనుకునేవారు మాత్రమే నష్టపోతారు. నిజమైన ఆధ్యాత్మికతలో పెట్టుబడి నష్టపోవుట అనేది జరుగదు. పెట్టింది వేయిరెట్లు అయ్యి తిరిగి లభిస్తుంది. ఆత్మవైభవ సంపదయే జీవిత సార్ధకత. నేను నా ప్రియజను లందరికీ ఈ సలహాను ఇచ్చి ప్రోత్సహిస్తాను. ఇప్పుడుకూడా నా అనుభవాలు ఉదాహరణగా ఇచ్చి, నాతో తిన్నగా సంపర్కము లేకపోయినను వారు నాకుగాని నా సలహాకుగాని ఏవిధమైన ప్రాముఖ్యత నివ్వదలచినా, తమ జీవిత విధానానికి ఆత్మిక ప్రగతి సాధనను కూడా తప్పనిసరిగా కలుపుకోండి. దీనివల్ల వారు ఏమీ నష్టపోరు. ఇంకా చాలా లాభంలో ఉంటారు.

మూడు ముఖ్యమైన రంగములలో (Fronts) మనము పనిచేయవలసి ఉంటుంది. రామ-రావణ యుద్ధము సుమారు 2 నెలలు నడిచింది. దీని తరువాత ఋష్యమూకపర్వతంనుండి సమీకరించబడిన కోతులు, ఎలుగుబంట్లు ఏమి అయ్యాయో తెలుపబడలేదు. నలనీలులు ఒక వంతెన నిర్మించిన తర్వాత పెన్షన్ తీసుకున్నారా? లక్ష్మణ-భరతులు చామరాలు మాత్రమే వీస్తూ ఉన్నారా! కాదు. వీరందరు సృజనాత్మకకార్యాలలో సంలగ్నమయ్యారు. సత్యయుగ పునరాగమనము కొరకు యోజనాబద్ధ ప్రణాళికలు నిర్వహిస్తూనే ఉన్నారు. కృష్ణ కాలీన గోపాలకులు, గోవర్ధనము నెత్తిన తరువాత సెలవుపెట్టి వెళ్ళిపోలేదు. మహాభారతయుద్ధము కూడా సుమారు 2 నెలలపాటు

**చేస్తున్న పనిని ఆస్వాదించాలి**

జరిగింది. దానితర్వాత వీరందరు ఏమి చేశారు? దీనికి కూడా జవాబు లేదు. వీరందరు పరీక్షిత్తు యొక్క తత్త్వావధానంలో వ్యవస్థపూర్ణ సమాజ నిర్మాణమునకు విశాల ప్రయత్నాలు చేశారు. ఇదే పని ఎలుగుబంట్లు, వానరులు కూడా చేశాయి.

బుద్ధుని యొక్క పరివ్రాజక దీక్ష, సంఘారామముల నిర్మాణ వర్ణన యొక్క చరిత్ర సుమారు 3000 సంవత్సరాల కాలానివి. దానితర్వాత లక్షల బౌద్ధభిక్షువుల సంఖ్య తగ్గలేదు కదా! కారాగారం నుండి విడుదలైన తర్వాత కూడా సత్యాగ్రహి స్వయంసేవకులు సర్వోదయం లాంటి రచనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఇతిహాసకారుల శైలి అలాంటిది. వివాహం యొక్క ఆర్భాటం వర్ణిస్తారు. దానితర్వాత ఆ రెండు కుటుంబాలు ఎలా జీవించాయో వర్ణించుటలో దానికి రుచి లేదు. అందువల్ల ముందు వర్ణించిన ఘటనా క్రమములు మాత్రమే జరిగాయి అని అనుకోకూడదు. అసలు సృజనాత్మకమైన దీర్ఘకాలీన కార్యక్రమాలే ఎక్కువ ముఖ్యమైనవి. విత్తనము ఒకరోజులో నాటివేయబడుతుంది. దానికి మాత్రమే ముహూర్త నిర్ణయము జరుగుతుంది. కానీ తర్వాత పంట చేతికి వచ్చేవరకు చాలా కాలము పట్టే వ్యవస్థ చేపట్టవలసి వస్తుంది. దాని గురించి చర్చించడము మనుష్యులు మరచిపోతారు. కానీ తథ్యములు (facts) అక్కడే ఉంటాయికదా! చెప్పినా, చెప్పకపోయినా శస్త్రచికిత్స (operation) చాలా తక్కువ వ్యవధిలో జరుగుతుంది. కానీ బాధ నయమయ్యేంతవరకు కట్లు, పట్టీలు (bandages) రోజుల, నెలల తరబడి వెయ్యాలికదా!

ఇదంతా సూక్ష్మీకరణ సందర్భంగా చెప్తున్నాను, దానియొక్క ఒక పక్షమే నా బాధ్యత. బండిని ఊబినుండి తీసి తిరిగి రహదారి మీద నిలబెట్టే సామర్థ్యము, అవధి మాత్రమే నా వద్ద ఉన్నది. కానీ దాని తర్వాత చేయవలసిందేది లేదని అనుకోవద్దు. చెయ్యవలసినది ఎంత ఉన్నదంటే కొద్ది నిమిషముల (operation) తర్వాత నెలల సంరక్షణ ఎలా అవసరము అవుతుందో నవసృజనకు కూడా అంత ఎక్కువ కాలము కష్టపడవలసి ఉన్నది. పాడుచేయటం కంటే బహుముఖ నిర్మాణము చాలా కష్టసాధ్యము. వ్యక్తిని పదభ్రష్టులను చేయుటకు, సమాజమును పెడత్రోవ పట్టించటానికి అమిత ఖర్చుతో కూడిన, శ్రమతో కూడిన ప్రయత్నాలు చేయబడు తున్నాయి. చాలా కాలం నుండి దుర్వ్యసనాలకు బానిసలవ్వడం మానవుల స్వభావమైపోయింది. వాటిని వదిలించుటయే గాక దానికి బదులు క్రొత్తవ్యవస్థను నిర్మించి క్రొత్త సభ్యతను స్థాపించవలసి ఉన్నది.

నా కార్యపద్ధతి రెండు రకాలు. ఒకటి డాలు, కత్తి. ఒక దానితో రక్షణచేస్తూ రెండవదానితో తరిమికొట్టాలి. ఈరోజులలో తరిమికొట్టే కార్యక్రమము పెద్దదిగా కనిపిస్తున్నది. ఇప్పుడది జీవన్మరణ సమస్యగా తయారైనది. వినాశకరశక్తులు తమ చరమసీమలో ఉన్నాయి.

ఇంకొన్నాళ్ళు దానిని స్వైరవిహారం చేయనిస్తే లక్షల సంవత్సరముల నుండి సంచితమైన సభ్యత, సంస్కారములు ఎక్కడికి పోయాయో కూడా తెలియదు. పృథ్వి శ్మశానంగా మారి అక్కడక్కడ ఎముకలు, కంకాళాలు కనిపిస్తూ ప్రేత పిశాచముల, భూతముల నాట్యము మాత్రమే మిగులుతుంది. ఈ భయంకర విభీషికను సృష్టించే కేంద్రాల మీద సమయము ఉండగానే బాంబులు కురిపించాలి. తద్వారా మహాప్రళయము రాకుండా, దాని గురించే గొప్పలు చెప్పుకునేవానికి చేతులు, కాళ్ళు విరిగి ఏమి చేయలేని నిస్సహాయస్థితిని కలుగజేయాలి. ఇది ఒక పని. ఈ పని చేసే బాధ్యత నామీద ఉన్నది. సూక్ష్మీకరణ తర్వాత 'దధీచి' ద్వారా నిర్మించబడిన ఇంద్రుని వజ్రాయుధము తయారై తీరుతుందని నా నమ్మకము. దీని ద్వారా వృత్రాసురుని అహంకారమును చూర్ణము చేయగలుగుతాను. ఏ శాంతి ప్రగతియొక్క దాహములో పృథ్వి మొత్తము మండిపోతున్నదో దానికి చల్లదనమును ఇవ్వటానికి యోగ్యమైన గంగావతరణ జరిగితీరుతుంది. దీనికొరకు ఒక భగీరథుని తపస్సు ఉపయోగపడుతుంది.

రెండవపక్షము ఒక నర్సరీ (Nursery)ని పెంచే విధానము లాంటిది. రాబోయేరోజులలో ఈ పృథ్విని స్వర్గము వలె తీర్చిదిద్దవలసి ఉన్నది. మానవజీవిత గరిమను తిరిగి ప్రతిష్ఠించవలసి ఉన్నది. పోగొట్టుకున్న దానిని తిరిగి పొందవలసి ఉన్నది. అందుకొరకు మనం ఈ భూమిమీదే నందనవనము, కల్పవృక్ష ఉద్యానమును పెంచవలసి ఉన్నది. దీని కొరకు ఇప్పుడే మొదటి ప్రయత్నము చేయవలసి ఉన్నది. ఒకవైపు ఆయుధ నిర్మాణము యుద్ధానికి కావలసినరీతిలో తయారవుతుంటే, రెండవవైపు ఒకవిశాలమైన వ్యవసాయ క్షేత్రము (Agricultural Farm)లో అవసరమైనప్పుడు లభ్యమయ్యే నర్సరీ (Nursery)ని తయారుచేసుకుంటూ ఉండాలి. పరశురామ పరంపర ఇలాగే ఏర్పడింది. ఆయన ఒక్కసారిగా ఆతతాయిల శిరస్సులను ఛేదించి, సంపూర్ణ పృథ్వి మీదనుండి దురాలోచనాపరులను ఏరివేశారు. ఆలోచనాక్రాంతి (Brainwashing) యొక్క ఉద్దేశ్యము పూర్తిచేశాడు. దీని తరువాత తన ఆయుధాన్ని, గంగాసాగరము వద్ద సముద్రంలోకి

**కష్టపడేవారినే ప్రపంచం ఇష్టపడుతుంది**

విసిరేశాడు. ఆ తరువాత ఒక క్రొత్త అస్త్రము-పారను చేతిలోకి తీసికున్నాడు. దీని ఆధారంగా ఫలమునిచ్చే ఉద్యానవనాలను, నవ సృజనము యొక్క క్రొత్త ఉల్లాసముతో ఏర్పరచాడు. ఆయన అన్ని దిశలను పచ్చదనంతో నింపాడు. ఆయనయొక్క ఈ పరస్పర విరోధి కార్యక్రమాలను చూసి ప్రజలు ఆశ్చర్యచకితులు అయ్యారు. యుద్ధములో శౌర్యము, పరాక్రమము ఆయుధ సాధనలు అవసరమవుతాయి. కానీ సృజనాత్మక కార్యక్రమాలలో ఇంతకంటే వేయిరెట్లు తెలివి తేటలు తత్పరత, సాధనా సామగ్రి కావాలి. పెద్ద పెద్ద అక్షరాలతో నాయకుల పేర్లు వేయబడి నప్పటికి, నిజమైన శ్రేయాధికారులు అతి పెద్ద నిర్మాణాత్మక కార్యక్రమాలు తయారుజేసి తమ శాయశక్తులా దానికొరకు కాలము వెచ్చించినది ఇంజనీర్లు. హాస్పిటల్స్‌లో, ఆపరేషన్ థియేటర్స్‌లో ఏ బల్లమీద కత్తులు-కటార్లు ఒక క్రమపద్ధతిలో పెట్టబడి ఉంటాయో, ఆ ప్రక్కనే కుట్లు వేయటానికి అవసర మయ్యే సామాగ్రి, బాధను తగ్గించటానికి అవసరమైన ఆయింట్ మెంట్లు, దూది, గాజుగుడ్డ మొదలైనవి కూడా పెట్టబడి ఉంటాయి. కేవలము కోసి పారవేయడంవలన రోగనివారణ జరుగదు. ఆ తరువాత చేయవల్సిన రక్షణాత్మక, సృజనాత్మక విధులు నిర్వర్తించకపోతే ఇంకా ఎక్కువ ప్రమాదము ఏర్పడు తుంది.

నేను ఈవిధమైన రెండిటిని గురించి ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. దేవశక్తులతో సంబంధము స్థాపించుకొని, ఈనాడు ఉన్న విషమపరిస్థితులను వెనుకకు నెట్టివేయగలిగే సామర్థ్యమును సమకూర్చుకుంటున్నాను. దానికొరకు పెద్దవాళ్ళ, సమర్థవంతుల సహాయము అవసరమవుతుంది. అది ఏకత్రితమవుతుంది. మిగిలినది త్వరలోనే పూర్తవుతుంది అన్న నమ్మకం ఉన్నది. అన్ని క్షేత్రాలనుండి మహావినాశనము జరిగితీరుతుంది అనే ఘోషణ వినిపిస్తున్నది. పరిస్థితులను చూస్తున్నవారు ఒకే మాట అంటున్నారు సర్వనాశనము ఏ క్షణములోనైనా జరుగవచ్చు.

ఇంతమంది భవిష్యత్ వేత్తల కథనానికి విరుద్ధంగా నేను ఈ ప్రపంచము కొనసాగితీరుతుందని, రాబోయేరోజులు ఇంతకంటే చాలా గొప్పవి అనీ చెప్తున్నాను. ఈ విషయంలో అభిరుచి ఉన్నవారు నా భవిష్యత్ వాణిని నోట్ చేసుకోండి. మూడవ ప్రపంచయుద్ధము జరుగదు. యుద్ధాలు ఎక్కడ జరిగినా అవి ఒక సీమితక్షేత్రానికి మాత్రమే నియమితమై ఉంటాయి. సమస్త ప్రపంచాన్ని నాశనము చేసి, మానవ సముదాయ భవిష్యత్తును పాడుచేసే విపత్తులు రావు.

రెండవపక్షము సృజనాత్మకమైనది. దీనికొరకు ట్యూబ్‌వెల్స్‌ని ఏర్పాటుచేసుకొనుట, జెనరేటర్ పెట్టుకొనుట, మంచి విత్తనాల గోడౌన్లు ఏర్పాటుచేసుకొనుట, మంచి ఎరువులు తయారు చేసుకొని నర్సరీలను పెంచుట, ట్రాక్టర్లు మొదలగు పరికరములు సమకూర్చుకోవాలి. కానీ ఇవన్నీ ఒక విశాలమైన పచ్చని పంటకు ఏర్పాటు చేసుకోవాలి. దీనికి సాధనాలు ఏమిటి? ఎక్కడుంటాయి? దీనికి జవాబు ఒక్కటే. ఆదినుండి చివరి వరకు నేను ఏకత్రితము చేసిన సంపదంతా ఈ ప్రయోజనాల పూర్తికొరకు చాలా సహాయపడుతుంది. నేను ఏకత్రితము చేసిన సంపదంతా కూడా గాయత్రీ పరివారమే. ఇందులో చాలామంది చిన్నవాళ్ళుగా అల్పజ్ఞులుగా కనిపిస్తారు. వారి యోగ్యతలు, సామర్థ్యము చాల తక్కువగా ఉన్నట్లు కనిపించినా ఈ మొగ్గలే రాబోయేరోజులలో వికసించి తమ సౌరభంతో సంపూర్ణ ప్రపంచమును సుగంధమయం చేస్తాయి. ఈ అంకురములే పచ్చని వృక్షాలుగా మారి సంపూర్ణక్షేత్రమును ఆహ్లాదపరుస్తాయి. ఈ చిన్నచిన్న దూడలే రేపటి, ఎల్లుండిలో నాగళ్ళను లాగుతాయి. రథాలని నడుపుతాయి. పిల్లలందరు అజ్ఞానులు, కానీ చూడటానికి ఎంత అందంగా ఉంటారు! వారి చేతలు ఎంతో ఆనందాన్ని కలుగజేస్తాయి. దీనికి కారణము వాళ్ళ పెదవుల మీద నర్తిస్తున్న భవిష్యత్తు. ఇదే విషయము ప్రజ్ఞాపరివార సంబంధంలో కూడా చెప్పవచ్చును. వారిలో హనుమంతుడు అంగదుడు స్థాయి వ్యక్తులు ఖచ్చితంగా తక్కువగా ఉన్నప్పటికీ, జాగ్రత్తగా పరిశీలించి చూస్తే జటాయువు, శబరి, గుహుడు, ఉడుతల వలె పూర్తి అంకితభావంతో సమర్పిత వ్యక్తులతో ఈ మొత్తము సముదాయము నిండి ఉన్నది. 'చిన్నవాళ్ళమైనప్పటికి మామీద మీరు ఆశలు పెట్టుకోవచ్చును' అనే సందేశము ఇస్తున్నారు.

ఈరోజులలో నా ధ్యానము మూడువైపుల ఉన్నది. ఒకటి నా వైపు ఇంకా ఎక్కువ పీడనాన్ని (pressure) ఉపయోగించి, ఇంకా చాలా ఎక్కువ స్థాయి సూక్ష్మీకరణము చేసుకోవాలి. దీనికి చాలా కఠిన ప్రయత్నాలు చేయవలసి ఉన్నది. అతి తీవ్రస్థాయి తపశ్చర్యలు చేయవలసి ఉన్నది. అందులో నేను ఖచ్చితంగా ఉత్తీర్ణుడనైతీరాలి. లేకపోతే గురితప్పిన గుండు లక్ష్యాన్ని ఛేదించలేకపోవడమే కాక వ్యర్థముగా నవ్వుల పాలు అవవలసి ఉంటుంది. రెండవ లక్ష్యము ప్రపంచ సమస్యలను అర్థము చేసుకొని, ప్రపంచములో ఉన్న మూర్ధన్యుల దివ్యాత్మల సహకారము కూడగట్టుకొని మహాప్రళయానికి కావలసిన సరంజామాను ఏకత్రితము చేయబడుతున్న కేంద్రములపై

**లేవండి, మేల్కొనండి, లక్ష్యం సాధించేవరకు విశ్రమించకండి**

దాడి చేయాలి. ఈ సంపూర్ణ ప్రక్రియ సూక్ష్మజగత్తులో జరుగుతుంది. దీనికొరకు నేను నా ధ్వజమును తీసుకుని, ఎక్కడా ఫిరంగులని కాల్చబోవడం లేదు.

నా మూడవ ప్రయత్నము ప్రాణవంతులైన ప్రజ్ఞా పరిజనులకు సంబంధించినది. నేను స్థూలంగా కనిపించక పోవడం వలన వారిలో నిరాశరాకుండా ఉండేటట్లు చూడటం, చెల్లాచెదరు కాకుండా నర్సరీ (Nursery)లో ఉన్న మొక్కలను ఒక క్రమమైన పద్ధతిలో పెంచి, సమయము ఆసన్నమైనప్పుడు అవసరమైనచోట వాటిని తీసికెళ్ళి నాటి, ఉద్యానవనము యొక్క సుందరదృశ్యమును అతి త్వరలో చూడగలగటము.

పైన చెప్పిన మూడు రంగములలో ఏ ఒక్కటీ కూడా ప్రాముఖ్యత లేనిదికాదు. కేవలము ఒకదాని ఆధారంతోనే అభీష్ట లక్ష్యము చేరుకొనలేము. అందువల్ల ఒకదానికి తక్కువ ప్రాముఖ్యతనిచ్చి వదిలివేయలేము. మూడు ప్రయోజనాల కొరకు ఏమి చేయగలుగుతానో దానిని సమగ్ర తత్పరతతో సంపన్నము చేస్తున్నాను. ఇటువంటి పరిస్థితులలో ఇదివరకు వలె మమ్మల్ని కలుసుకొనలేకపోతే, దర్శన, స్పర్శలాంటి కార్యక్రమాలను ఆపివేసి ఒంటరిగా నేనుంటే ఇది మీకు అప్రియముగా ఉన్నా లేక అహంకారపూర్ణ స్వార్థము అని అనిపించినా క్షమించమని కోరుతున్నాను. నాకు నా పరిజనుల ప్రజ్ఞమీద పూర్తి నమ్మకమున్నది. వారు ఈ సాధనయొక్క ఉచ్చస్తరీయ ఫలశృతులను దృష్టిలో ఉంచుకొని నా సాధనా ప్రక్రియలో సహకరిస్తారని అనుకుంటున్నాను.

ఈ ఒంటరి తపస్సాధనలో వ్రాయుట అనే యోగాభ్యాసము యొక్క ఈ క్షణములో నాకు యోగిరాజ్ అరవిందుల మాటలు స్మరణకు వస్తున్నాయి. వారు పరతంత్ర భారతములో ఉన్న విషమపరిస్థితుల గురించి తన ఏకాంతవాసములో అభివ్యక్తము చేసిన శబ్దములను ఇక్కడ అక్షరాలా పొందుపరుస్తున్నాను.

'ఇంత గొప్ప విరాట్ భారతములో ఏదైతే శక్తివంతమైన యుగాంతరకారి భూమికను నిర్వర్తించవలసి ఉన్నదో అది ఈనాడు దుఃఖిస్తోంది. ఆమె దుఃఖానికి కారణము ఏమిటి? నిశ్చయంగా ఏదో ఒక పెద్ద లోపము ఉన్నది. ప్రాణశక్తి యొక్క అభావమున్నది. మన దగ్గర అన్నీ ఉన్నాయి కానీ మనము శక్తిహీనులము. ఊర్జా (energy ) రహితులము. మనము శక్తి ఉపాసన వదిలేశాము. శక్తి మనలను వదిలేసింది. ఆ తల్లి ఇప్పుడు మన హృదయాలలో కానీ, మస్తిష్కములోగాని, భుజములోగాని లేదు.... ఈ విశాల దేశపునరుజ్జీవనము కొరకు ఎన్నో ప్రయత్నాలు చేయబడ్డాయి. ఎన్నో ఉద్యమాలు చేయబడ్డాయి. మన ప్రారంభములన్నీ చాలా గొప్పగా ఉంటాయి. కానీ దానివల్ల ఫలితాలు ఏమీ రావడం లేదు. కనీసము తాత్కాలిక ఫలితములు కూడా రావడము లేదు. మనవద్ద జ్ఞానానికి కొరవలేదు. జ్ఞానములోని ఉచ్చతమ వ్యక్తిత్వాలు, మనలోనించే ఆవిర్భవించాయి. కానీ ఉపయోగించని జ్ఞానము ఒక శవము ఒక విషము, మనలను మెల్లమెల్లగా చంపివేస్తుంది. శక్తియొక్క అభావంలో, ఆత్మబలము లేకుండా జ్ఞానము అసంపూర్ణమైనది. భక్తిభావనా ఉత్సాహములు ప్రశంసనీయమే. కానీ భక్తి అనే అగ్నిశిఖకు కూడా, శక్తి అనే ఇంధనము కావాలి. ఆరోగ్యవంతమైన స్వభావము జ్ఞానములో ప్రదీప్తమై, కర్మలో అనుశాసనమై విరాట్ శక్తితో కలిసినప్పుడు మాత్రమే ఈశ్వరీయ అనుగ్రహానికి పాత్రత లభిస్తుంది. మనము గంభీరంగా ఆలోచించగలిగితే మనకు మొట్టమొదట కావలసింది శక్తి అని, ఆత్మబలమని అర్థమౌతుంది. శక్తి లేకుండా మనము కుంటివాళ్ళమే. భారతదేశవాసులందరు కుంటివాళ్ళు, ప్రపంచము మొత్తమంతా కుంటిదే. భారత దేశము తిరిగి ఆ శక్తిని పొందవలసి ఉన్నది. పునర్జన్మ తిరిగి తీసుకుని రావాలి. ఎందుకంటే సంపూర్ణ విశ్వముయొక్క ఉజ్జ్వల భవిష్యత్తు దీనిని కోరుకుంటుంది. సమస్త మానవ సమూహాలలో కేవలము భారతదేశానికే ఈ నియతి నిర్దిష్టమై ఉన్నది. ఇది సమస్త మానవజాతి భవిష్యత్తుకొరకు అవసరము. ఆ శక్తి ఉపాసన కొరకు ఎల్లప్పుడు మహామానవులు అవతరిస్తూనే ఉన్నారు. ఆ శృంఖలలో నేను ఒంటరిగా ప్రచండ పురుషార్థము కొరకు నియోజితమైతే అది నా పరమసౌభాగ్యము'.

నిజానికి యోగిరాజ్ అరవిందుల ద్వారా 1905 దరిదాపులలో వ్రాయబడిన ఈ పంక్తుల ద్వారా ఆయన మనస్సులో భారత దేశపు ఉజ్జ్వల భవిష్యత్తుకొరకు ఎంత ప్రచండ ఉత్సాహము ఉన్నదో తెలుస్తోంది. ఈ అంతఃకరణ ప్రేరణ పరోక్షజగత్తు నుండి వచ్చిన నిర్దేశములు ఆయనను క్రాంతికారీ మార్గము (Revolutionary path)ను వదలి, తపఃసాధన ద్వారా వాతావరణమును వేడిచేయుటకు వివశం చేశాయి. నాయొక్క ప్రస్తుత సూక్ష్మీకరణ దినచర్య ఈ సాధనా ఉపక్రమములో సమతుల్యముగా భావిస్తే, అందులో అత్యుక్తి ఏమి లేదు. పరిజనులు దీనిని అంత గంభీరంగాను తీసుకుంటారని ఆశిస్తాను.

(సశేషం)

**కష్టేఫలి అని అన్నారు పెద్దలు**

వసంత పంచమి ప్రత్యేకం

# జ్ఞానము, తపస్సు, ప్రేమల కలయికే - ఈ వసంతపర్వము

వసంతము అనే మాట వినపడగానే గుర్తుకువచ్చేది యుగఋషి పరమపూజ్య గురుదేవులు. ఆయన వ్యక్తిత్వములో జ్ఞానము, తపస్సు, ప్రేమలతో నిండిన నిర్మలమైన త్రివేణీ ధార ప్రవహిస్తూ ఉంటుంది. వారు దీనిని గురించి చెప్తూ ఇలా అన్నారు – "వసంతము అంటే మనకున్న సమయమునకు విలువనివ్వడం, జవసత్వములతో నిండిన నూతనత్వమును గౌరవించడం, సకారాత్మకమైన మార్పు దిశగా అడుగులు వేయడం. వసంతము అంటే పూలు వెల్లివిరుస్తాయి, వనస్పతులన్నీ ప్రసన్నతను పొందుతాయి, ధరిత్రి చక్కగా సింగారించుకొని ముస్తాబవుతుంది. వసంతము అంటే మన మనస్సులో ఉండే ఆకుపచ్చని క్షేత్రము. ఉల్లాసభరితమైన విశిష్టతలు ఏవైతే మన లోపల, బయట ఉన్నాయో అవి అన్నీ వసంతము యొక్క రూపాలే. వసంతము అనేది చెరిగిపోని ఒక రంగు. అది ఒక భావానుభూతి. అది మనలను అనుభూతులతో నింపుతుంది. జ్ఞానము, ప్రేమ, తపస్సు అనేవి వసంతములో సహజంగానే కలిసి ఉంటాయి. జ్ఞానము మన జీవితానికి ఉండే దిశను గురించి తెలియచేస్తుంది. కఠినంగా ఉండే సంఘర్షణలను ఎలా ఎదుర్కోవాలో తపస్సు తెలియ చేస్తుంది. ప్రేమ అనేది మనల్ని అందరిపట్లా సకారాత్మకమైన సంవేదనాభరితమైన సృజనాత్మకతతో కలిసి ఉండేందుకు దోహదపడుతుంది. ఈ మూడే మానవత్వమునకు అవసరమైనవి.

వసంతము వసంతపంచమితో ప్రారంభమవుతుంది. వసంతములో ఒక క్రొత్త స్ఫురణ ఉంది. ఒక క్రొత్త వికాసము ఉంది. భారతీయుల సంవత్సరము యొక్క అంతము, ఆరంభము రెండూ వసంతముతోనే మొదలవుతాయి. దీనివల్ల భారతీయుల ఆలోచనల యొక్క చక్కని సంరచన, కాలములో మార్పు, దృష్టికోణము ఏమిటో మనకు బోధపడుతుంది. వసంతము అనేది ప్రేమపూరితమైన కుంభమేళ వంటిది. అందులో మనం సంజీవనీ స్నానం చేస్తాము. మాఘ శుక్లపంచమి నుండి సంగీతము, సాహిత్యము, కళలతో నిండిన రసమయధారలు కురుస్తూ ఉంటాయి. సరస్వతీమాత ప్రభావము వల్ల పంచమి నుండి ప్రేమ అనే విద్యాలిపితో కూడిన అద్భుతమైన దృశ్య మాలికలు కనపడుతూ ఉంటాయి. అందువల్లనే ఈరోజులను శుభములకు, మంగళకరమైన కార్యములకు ముహూర్త సమయాలుగా పరిగణిస్తారు.

వసంతము కవిత్వమునకు, కళలకు పుట్టినిల్లు. మనం వినగలిగితే కనుక ప్రతి పుష్పము, ప్రతి ఆకు కవిత్వమును పలికిస్తుంది. మన చుట్టూ ఉన్న కాంతివలయానికి సర్వోత్తమమైన ప్రాణకేంద్రము వసంతఋతువు. దుఃఖమనేది ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ వసంతము ఆ దుఃఖమును పోగొట్టి ఒక ప్రగాఢమైన ప్రకృతిరాగమును పలికిస్తుంది. ఇది జీవితమును, కాలమును కలుపుతుంది. ఆంతరిక మనోభావాలలో ఆత్మీయతతో నిండిన ఉల్లాసమును నింపుతుంది. మనం జీవించడం నేర్చుకోవాలి, వ్యక్తిగతంగా పెద్ద మనస్సుతో అందరినీ మనవారిగా చేసుకోవాలి. అందరి దుఃఖములను, బాధలను, సంతోషములను–విషాదములను మనవిగా చేసుకోవాలి. అప్పుడే వ్రాసే కవిత్వానికి, సాహిత్యానికి, ప్రదర్శించే కళలకు సార్థకత చేకూరుతుంది.

కేవలము కవి యొక్క కల్పనలో మాత్రమే వసంతము రమణీయంగా ఉంటుందని అనుకోకూడదు. వసంతఋతు ఆగమనం నిజంగానే ప్రకృతిరమణీయంగా, కన్నులవిందుగా ఉంటుంది. ఆ సమయంలో పర్యావరణము, పరిస్థితులు అన్నీ సమస్థితిలో ఉంటాయి. శీతఋతువుకి–గ్రీష్మఋతువుకి మధ్యస్థంగా ఉండేదే వసంతఋతువు. భూమిమీద, నీటిమీద పద్మాలు కనిపిస్తుంటాయి. మలయసమీరము మందగతితో వీస్తూ ఉంటుంది. పూవుల మీద నుండి వీచే గాలిలోని సౌరభములతో వనాలు, తోటలు అన్నీ తలలూపుతూ ఆనందాన్ని తెలియచేస్తుంటాయి. మనం గ్రామీణజీవితంలో ఉన్నా, మహా నగరాలలో ఉన్నా, ఏ సభ్యతను అనుకరించినా పిండారబోసి నట్లుండే మృదువైన తెల్లని వెన్నెల కిరణాలు, పక్షుల కిలకిలా రావాలు, కోయిల కూతలు, కుసుమసౌరభాలు, శోకమును నశింపచేసే అశోకవృక్షముల విశిష్ట సౌందర్యములు ఈ

**సదా శ్రమిద్దాం - విజయం సాధిద్దాం**

సమయంలో చాలా ఆహ్లాదకరంగా ఉంటాయి. వసంతకాల గుణము వగరుగాను, మధురంగాను ఉంటుంది. హేమంత ఋతువులో శ్లేష్మము వృద్ధి అవుతుంది. వసంతకాలము రాగానే అది ప్రకోపిస్తుంది. ఈ సమయంలో వాయుగుణము కొంత కలుస్తుంది.

హరితసంహితలో ఇలా వ్రాయబడింది – "వసంత ఋతు సమయంలో ఆనందంతో మత్తెక్కిన కోయిలల కుహూకుహూ రావాలతో అరణ్యాలు, ఉద్యానవనాలు ప్రతిధ్వనిస్తుంటాయి. తోటలు, ఉద్యానవనాలు, పర్వతశ్రేణులు పూల యొక్క సువాసనలతో పరిమళిస్తుంటాయి. సంగీత దామోదరుని ప్రకాశములో ఆరురాగాలు, అరవై రాగిణులు ఉన్నాయి. ఈ రాగాల మధ్య వసంతము కూడా ఒక రాగమవుతుంది. ఆ ఆరురాగాలు శ్రీరాగము, వసంతము, భైరవి, పంచమి, మేఘ, వృహన్నాటకం. వసంతపంచమి రోజు వసంతరాగమును ఆలపించడమంటే కోరినవి పొందడమని చెప్తారు. వసంత పంచమిలో సరస్వతీ మాత చేతనత్వము కలిసి ఉంటుంది. సరస్వతి యొక్క అంగములు – లక్ష్మీ, మేధా, ధరా, పుష్టి, ప్రభ, ధృతి. నిరాలా అనే మహాకవి "వరదే వీణావాదిని వరదే" అనే కీర్తనను వ్రాసేముందు ఆయన సంస్కారములో **"వద వద వాగ్వాదిని వాహినీ వల్లభా"** అనే సరస్వతి దశాక్షర మంత్రము కలిసిపోయి ఉంటుంది. మేధ, ప్రజ్ఞ, విద్య, ధీ, ధృతి, స్మృతి, బుద్ధి, విద్యైశ్వర్య అనేవి పీఠదేవతలు. భారత దేశము యొక్క సాంస్కృతిక పరంపరలో ఐదు శక్తులు అంగీకరించబడ్డాయి – రాధ, పద్మ, సావిత్రి, దుర్గ, సరస్వతి. సరస్వతి వాక్కుకు అధిష్ఠాత్రి, శాస్త్రజ్ఞాన ప్రదాయిని.

పురాతన కాలం నుండి ఇప్పటి వరకు వసంతఋతువు మనిషిని సమ్మోహితుని చేస్తూనే ఉన్నది. వసంతము యొక్క ప్రాకృతిక సౌందర్యము అంటే మన చుట్టూ ఉన్న వాస్తవికత, మన అంతరంగముల అద్భుతమైన కలయికగా అర్థము చేసుకోవాలి. ఈ తేజస్సును మనం కాపాడుకుంటూ ఉండాలి. వసంతము అనేది మన లోపల ఉండే రాగమునకు ప్రత్యక్ష రూపము. అందుచేత దానిని భూమి మీద సురక్షితంగా ఉంచుకోవడం అనేది మన ప్రస్తుత కర్తవ్యం. అడవులు అంతరించిపోతున్నాయి, ప్రతి సంవత్సరము లక్షలాది టన్నుల కాలుష్యము తయారవడం చేత భూమిమీద ఉండవలసిన సమశీతోష్ణ స్థితులు ప్రభావితమౌతున్నాయి. దాని వల్ల ఏర్పడే ఉష్ణోగ్రతలకు జలము, వాయువు, అడవులు నశించి పోతున్నాయి. పారిశ్రామిక కాలుష్యము, యాసిడ్‌ల వల్ల మానవునికి, వసంతమునకు ప్రమాదము ఏర్పడుతున్నది. పక్షుల కిలకిలారావాలు మూగ బోతున్నాయి. మనిషి తినే ఆహార పదార్థాలపై చల్లే పురుగుల మందులు భయంకరమైన స్థితిని ఉత్పన్నం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో మనిషి యొక్క ప్రేమ, తపస్సు, జ్ఞానములు మాత్రమే అంతరంగములోని వసంతమును, వాతావరణమునందలి వసంతమును రక్షించగలిగే సామర్థ్యమును కలిగి ఉంటుంది.

వసంతము యొక్క అర్థము ఏమంటే 'మన సంపూర్ణ అస్థిత్వమునకున్న సృజనాత్మక రాగానుభూతి'. ఈ అనుభూతిని ప్రగాఢం చేసుకుంటూ ఉంటే మన యొక్క ఉదాసీనత కడిగి వేయబడి ఆనందము ఆవిష్కరింపబడుతుంది. అది మాత్రమే కల్పనా సామర్థ్యము, పునఃనవీకరణ, ప్రేమ అనే సమ్మోహనాస్త్ర మును సంధించగలదు. అందులోను ఒక లాలిత్యము ఉంది. వసంతఋతువులో పద్మములు, పుష్పములు, ఆహార–విహార ములు, గీత–సంగీతములు, వస్త్ర–విన్యాసములన్నింటిలోను ఒక నూతనత్వము, శోభ గోచరిస్తుంది. హోలీ యొక్క రాగాలు ప్రారంభమవుతాయి. హోలి గీతాలలో ఆనందము, సంతోషము, ఉల్లాసము, ఉత్సాహములతోపాటు రైతుల జీవితములోకి ఒక క్రొత్తదనం కూడా వస్తుంది. జీవితంలో ఉండవలసిన ఇలాంటి అనుభూతులన్నీ ఈనాడు ఉద్యోగాల లోను, ధనములోను చేరిపోయాయి. ఈ పరిస్థితి వల్ల వసంతా గమనము తనతోపాటు తీసుకువచ్చే రంగులు, మౌనభాషలు, రసానుభూతులు ఎంత వెతికినా ఎవరికీ కనిపించవు. ప్రసన్నంగా ఉన్న ధరిత్రి, దాని యొక్క అనేక భవ్యతల కొరకు మనం చూసే ఎదురు చూపులు, మన తీవ్రమైన ఆకాంక్షల పేరే వసంతము.

యుగఋషి పరమపూజ్య గురుదేవులు ఇలా చెప్పేవారు – "వసంతపంచమి అనేది పృథ్విపై మన జీవితమునకు ఒక నవోదయమును, అభ్యుదయమును కలుగచేసే ఒక అవకాశము. అందుకొరకై మనమంతా ఒక క్రొత్త విశ్వాసాన్ని, ఒక క్రొత్త సంకల్పాన్ని తీసుకోవాలి." వసంతపంచమినే 'శ్రీపంచమి' అని కూడా అంటారు. 'శ్రీ' అంటే సౌందర్యము,

**మనిషి తలచుకుంటే ఏదైనా సాధించగలడు**

ఐశ్వర్యము కూడా. ఈ సౌందర్యాన్ని లక్షలాది గ్రామీణ ప్రజల లోను, ఆదివాసీయులలోను, నగరాలలో ఉండే మురికివాడల లోను విద్య ద్వారా తీసుకురావాలి. వసంతము రోజు ధరించే పసుపుపచ్చని వస్త్రములు ఇందుకు తగిన వాతావరణాన్ని చక్కగా తయారుచేసినప్పటికీ అది మాత్రమే సరిపోదు. ప్రకృతి ప్రకోపాలకి తల్లడిల్లినవారి ముఖాలలోనే అసలైన ఉల్లాసము, ఉత్సాహము తీసుకురావాలి. కాశ్మీరులో కుంకుమపువ్వు యొక్క సుగంధాలు మరల విరజిమ్మేలా చేయాలి. విద్యాలయాలకు పంపవలసిన పసిపిల్లలే అసలైన కుసుమాలు. మన వ్యక్తిగత ప్రార్థనను సంకల్పంగా మార్చుకొని దానిని సామూహికంగా మార్చి అందరితో చెప్పించాలి. స్త్రీకి మనం సరస్వతిగా మారేంతటి గౌరవాన్ని ఇవ్వాలి. వ్యక్తుల మధ్య ఉండే విభేదాలను తగ్గించుకుంటూ వసంతము యొక్క ప్రభావాన్ని పెంచుకుంటూ పోవాలి. ఇలాంటి సమరసత, సామరస్యము ఎంత పెరిగితే పుష్పముల పరాగములు అంత పెరుగుతాయి.

ఈ విషయాన్ని మనం ప్రతిరోజు నిత్యజీవితంలో నేర్చుకుంటూనే ఉండాలి. ఈనాడు జీవితంలో ఆనందమనేది పోయి ప్రేమవిహీనంగా మారింది. వ్యక్తి, సమాజము రెండింటి లోను జడత్వము నిండి ఉంది. దీనిని వసంతము యొక్క రంగులతో విరగ్గొట్టేయాలి. జీవితము నుండి ఆనందమనేది లాగివేయబడింది. సమాజానికి కానీ, తనకు తాను కానీ ఏదైనా ఇచ్చుకోగలిగేంత సామర్థ్యం మనిషికి మిగిలిలేదు. ఆత్మీయతా పూర్వకమైన దగ్గరితనం లేకపోతే మనిషికి అర్థమేమిటి? ఎక్కడ దగ్గరతనం లేదో అక్కడ నిరుత్సాహము ఆవరించి ఉంటుంది. ఇందుకు భిన్నంగా సోషల్‌సైట్లలోను అంతర్జాల-సంపర్కము లను సాధించాలని ప్రయత్నిస్తున్నాము. అక్కడ ఆత్మీయత ఉండదు, వర్చువాలిటీ ఉంటుంది. ఆత్మీయతను సాధించాలంటే మనం తిరిగి మనల్ని, మనవారిని వసంతం యొక్క అర్థమును తెలుసుకునేలా ప్రోత్సహించుకోవాలి.

ఆధునికత, వృత్తి-వ్యాపారాలు, కృత్రిమతలతో నిండిన ఈ యుగములో వసంతఋతువు అందరినీ ప్రశ్నిస్తున్నది. వసంతము తెలుసుకోవాలనుకున్నది ఏమిటంటే ఈనాడు మనిషికి-మనిషికి మధ్య, మనిషికి-సమాజానికి మధ్య, మనిషికి, సమాజానికి-ప్రకృతికి మధ్య కలుగుతున్న వేర్పాటు ధోరణులు మనలను ఎక్కడికి తీసుకువెళుతున్నాయి? ఆకాశము, నక్షత్రాలు, వృక్షాలు, వాటిపై హాయిగా, శ్రావ్యంగా గీతాలు ఆలపించుకునే పక్షులకు, నదులలో చేసే సహస్రశీర్ష స్నానాలకు మనం పరాయివారమైపోయాము ఎందుకు? మనం ఏర్పరుచు కుంటున్న క్రొత్త ఆలోచనలతో తయారైన జీవనవిధానము, జీవితమును జీవించే కళను మర్చిపోయేలా చేస్తున్నదా? అదే నిజమైతే మనలోని దోషాలను మనమే గుర్తించి వాటిని తొలగించుకునే ప్రయత్నం చేయాలి. జీవితములో జ్ఞానము, తపస్సు, ప్రేమల గొప్పతనమును గుర్తించాలి. వీటిని గురించి చెప్పేందుకై విచ్చేసిన యుగఋషి, వేదమూర్తి, తపోనిష్ఠ, ప్రేమావతారులు అయిన పరమపూజ్య గురుదేవుల ఆలోచన లలో ఉన్న సౌందర్యమును తెలుసుకోవాలంటే శాస్త్రములను గురించిన లోతైన అవగాహన ఉండాలి. ఈ వసంతపంచమి, ఈ వసంతఋతువు భారతభూమిపై పురాతన ఋషుల ద్వారా అందించబడిన జీవన విధానమును తిరిగి చూడాలని కోరు కుంటున్నది.

*- అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

*అఖండజ్యోతి, జనవరి 2015*

## శబరి ప్రత్యేకత

*అత్రిమహర్షి ఆశ్రమంలో జ్ఞాన చర్చ జరుగుతున్నది. ఒక జిజ్ఞాసువు ఇలా అడిగాడు - "భక్తజనులు భగవంతుని దర్శనం చేసుకోవాలని, ఆయన దగ్గరకు వెళ్ళాలని ప్రయత్నిస్తుంటారు. కానీ శబరి దగ్గరకు ఆయన స్వయంగా వెళ్ళడమే కాక ఎంగిలి చేసిన రేగిపండ్లను అడిగి అడిగి తిన్నాడు. ఆమెలో అంత ప్రత్యేకత ఏమున్నది?" అత్రి మహర్షి ఇలా అన్నాడు - "శబరి భక్తురాలే కాదు. ఒక సంతు కూడా. ఆమె రాత్రి వేళల్లో భజన చేస్తుంది. పగటి పూట పరమార్థ కార్యములలో నిమగ్నమవుతుంది. మాతంగి ఋషి ఆశ్రమవాసులు నేత్రవతి నది వరకు వెళ్ళవలసిన మార్గములో ఉన్న ముళ్ళను తీసివేసి, ప్రతినిత్యం చీపురుతో శుభ్రం చేసేది. భగవంతుడు అటువంటి భక్తులను సన్మానించడానికి స్వయంగా వారి ఇంటికి వెళ్తాడు.*

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1999*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**సంకల్పబలం ఉంటే అనుకున్నది ఏదైనా సాధించవచ్చు**

వసంత పంచమి ప్రత్యేకం

# ఖాళీ అవడానికి సిద్ధపడ్డవాడికి భగవంతుని ద్వారం తెరుకుంటుంది

శాంతికుంజ్‌లో వసంతపు రంగులు పులుముకున్నాయి. మామిడి సుగంధం వ్యాపిస్తోంది. చలికి సూర్యుని కిరణాలు వెచ్చగా, హాయిగా అనిపిస్తున్నాయి. ఈ వెచ్చదనంలో గురువు గారి ఆధ్యాత్మిక చైతన్యం కలిసి ఆనందాన్ని పరిపూర్ణంగా చేస్తోంది. ఆయన గది వెనకాల వరండాలో నవారు మంచంపై గురువుగారు నడుం వాల్చారు. ఆ మంచం సగం ఎండలో, సగం నీడలో ఉంది. చదవడం, రాయడం కోసం ఆయన రమ్మన్న కొందరు దాని పక్కన పరిచిన గోనెపట్టా మీద కూర్చున్నారు. వారికి ఆయన ఏదో చెప్తున్నారు. మధ్యమధ్యలో సరదాగా నవ్విస్తుండేవారు.

అప్పుడే ఒక కార్యకర్త వచ్చి, "గురువుగారు, మిమ్మల్ని కలవడానికి ఒక పెద్ద ఆంగ్ల పత్రిక సంపాదకులు వచ్చారు" అన్నాడు. సామాన్యంగా అది ఆయన ఎవరిని కలిసే సమయం కాదు. ఈ సమయంలో ఆయన వ్యాసాలు రాసే కార్యకర్తలను కలిసేవారు, లేదా ముఖ్య కార్యకర్తలతో వ్యవస్థ, నిర్మాణం లేదా వేరే కార్యక్రమాల గురించి చర్చించేవారు, నిర్దేశాలు ఇచ్చేవారు. కాని అప్పుడు ఏమనుకున్నారో ఏమో, నవ్వుకుంటూ ఆ కార్యకర్తను, "పో! తీసుకురా నీ ఆంగ్ల సంపాదకుడిని. మీరు మీ పట్టా కాస్త పక్కకు లాగి ఇక్కడొక కుర్చీ వేయండి" అన్నారు.

అక్కడున్నవారు ఆయన చెప్పినట్టు చేశారు. తరువాత ఒక మధ్య వయస్కుడు లోపలికి వచ్చాడు. తెల్లగా, జుట్టు నెరిసి పోయిన ఆయన పాంటు, షర్టు, టై వేసుకుని ఉన్నాడు. కళ్ళజోడు కూడా ఉంది. ఆయనతో పాటు ప్రతిక్షాలయంలోని వరిష్ఠ కార్యకర్త కూడా ఉన్నాడు. ఆ అతిథి గురువుగారికి చేతులు జోడించి ప్రణామం చేశాడు.

గురువుగారు కూడా అంతే మర్యాదగా స్వాగతం పలికారు. కుశలప్రశ్నలు అడిగారు. వారి కుటుంబం గురించిన క్షేమ సమాచారం కనుక్కున్నారు. ఆ తరువాత ఆయన ఆఫీసు, పత్రిక గురించి మాట్లాడారు. ఆయన కూడా ప్రసన్నంగా అన్నింటి గురించి చెప్పుకొచ్చారు.

ఈ మాటల్లోనే ఆయన తమ పత్రిక గురించి చెప్తూ, 'ఆచార్యగారు, మా పత్రిక చాలా ప్రఖ్యాతి చెందింది. గొప్ప గొప్పవాళ్ళు మా పత్రికను చదువుతారు. మీ వ్యాసాలను అనువదించి ఇందులో ప్రచురిద్దాం అని అనుకుంటున్నాను' అన్నాడు. అందుకు గురువుగారు ఎంతో సహజభావంతో, 'నాయన! వ్యాసాలు నావైనా మరెవరివైనా, అందులో ఆలోచనలు మంచివై ఉండాలి. ప్రపంచానికి సరైన ఆలోచనలు, సద్ జ్ఞానం అవసరం. నేను చేసే పని చాలా సాధారణమైనది.' ఇది విని అతను ఉత్సాహం, అభిమానం కలిసిన స్వరంతో, "మీరు నా మాట అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. నా పత్రికలో మీ లేఖలను ప్రచురిస్తే మీ ఖ్యాతి పెరుగుతుంది. పెద్ద పెద్దవాళ్ళు మిమ్మల్ని కలవడానికి వస్తారు. ఇప్పుడైతే మీ దగ్గరకు సాధారణ ప్రజలు వస్తున్నారు. అప్పుడు ప్రతిభావంతులు, ధనవంతులు, ప్రఖ్యాతిగాంచినవారు మిమ్మల్ని కలుస్తారు."

గురువుగారు ఓపికగా ఆయన మాటలన్నీ విని, 'చూడు నాయన! నేనే సాధారణ మనిషిని, కాబట్టి నా దగ్గరకు వచ్చేవారు కూడా సాధారణమైన వాళ్ళే అవుతారు. ఇక ఇది దేవుడి పని. దేవుడు తన పనిని నా లాంటి సాధారణ మనుషులతో చేయించు కోవడం అనేది ఆయన ఇష్టం. నాయన! ఎందుకో గాని దేవుడికి సామాన్యులే అర్థం అవుతారు. ఒక యుగంలో కోతులను చేరదీస్తే, ఇంకో యుగంలో చదువు సంధ్య లేని గొల్లవాళ్ళతో ఆడతాడు."

గురువుగారు ఇలా మాట్లాడుతున్నప్పుడు ఎదురుగా కుర్చీలో కూర్చున్న ఆ పెద్ద మనిషి వింటున్నాడు కానీ, ఆయన హావభావాలు చూస్తే, అవేవీ పెద్దగా అర్థం కావట్లేదు అని తెలిసిపోతోంది. చివరికి ఓడిపోయి గురువుగారి దగ్గర నుండి శలవు తీసుకుని బయల్దేరాడు.

ఆయన వెళ్ళిపోయాక గురువుగారు నవ్వుతూ సంస్కృతంలో ఒక శ్లోకం చెప్పారు –

**అహం కర్తేత్యహంమాన మహాకృష్ణాహి దంశితః ।**
**నాహం కర్తేతి విశ్వాసామృతం పీత్వా సుఖీ భవ ॥**

*భావం:* 'నేను కర్తను' ఇటువంటి అహంకారమనే అత్యంత నల్లటి పాముతో కరవబడ్డ నువ్వు, 'నేను కర్తను కాను' అనే విశ్వాసరూప అమృతాన్ని సేవించి సుఖంగా ఉండు.

"నేను! నేను!! నేను!!! ప్రపంచమంతా ఈ నేను అనే

మన బలహీనతలను భూతద్దంలో చూడవద్దు

పిచ్చిలోనే ఉంది. ఈ 'నేను' అనేదే ప్రతి ఒక్కరినీ భగవంతుడి నుండి దూరం చేసింది. ఈ 'నేను' అనేది ఒక నల్లటి సర్పం, మహావిష సర్పం. ఈ విషనాగు ఎవరిని కాటేస్తే వారు ఇక లేనట్టే. అహం అనే విషమే అన్ని బాధలకు కారణం. బాధ అనేది బయట నుండి రాదు. మనం పడే బాధలన్నీ మనం కొని తెచ్చుకున్నవే. ఎంత ఎక్కువ అహంకారముంటే అంత ఎక్కువ బాధ. అహంకారం అనేది ఒక గాయం. కాస్త గాలి వీచినా నొప్పి ఎక్కువవుతుంది."

ఇలా చెప్పి, కొంచం నవ్వి, తిరిగి ఇలా అన్నారు. "గౌరవం, ఖ్యాతి, యశస్సు, పెద్ద మనుషులు అనే ఆర్భాటం ఇవన్నీ అహంకారానికి వేరు వేరు రూపాలు. అహంకారం లేని మనిషిని బాధ పెట్టడం అసంభవం. అహంకారం ఉన్న మనిషిని సుఖ పెట్టడం అసంభవం. అహంకారి ఇంకెప్పటికీ సుఖపడను అని నిర్ణయించుకుంటాడు. అహంకారమనేది మేకు లాగా గుచ్చుకుని అలా బాధపెడుతూనే ఉంటుంది. తన ఉనికి లేదనే అనుభూతి దృఢపడుతున్నకొద్దీ అతనిపై సంతోషం వరదలాగా కొట్టుకొస్తూనే ఉంటుంది. ఖాళీ అయితే, పూర్తిగా నింప బడతాడు. 'అహం-కర్త' అనేది జీవితానికి విషం. 'అహం న కర్త' అన్నది అమృతం.

గురువుగారు ఇలా చెప్పుకుంటూ పోతుంటే, ఆయన తన పూర్తి జీవిత అనుభవాలను అందరికీ ఔదార్యంతో పంచేస్తున్నారు అనిపించింది. ఎదురుగా కూర్చున్న శిష్యుల మీద వసంతాన్ని వర్షిస్తున్నారు. గురువాణి అనేదే కదా బోధ వాణి. గురువు లేకుండా జ్ఞానమెక్కడిది, ఎలాంటిది? ఆయన చెప్తుంటే సంతోషం, సంతృప్తి కలుగుతున్నాయి. "ఒక్కటి అర్థం చేసుకోండి. చనిపోయేది అహంకారమే, నువ్వు ఎప్పుడు చావవు. అందుకే అహంకారమే మృత్యువు, విషం. ఏ రోజైతే నీలో అహంకారం నశించినప్పుడు లోపల ఉన్నది ఆ పరమాత్మయే అని తెలుస్తుంది. అప్పుడు ఇక నీకు చావు ఉండదు. ఇక నీవు సముద్రమే."

పరమాత్మతో ఉంటే నీవు అమృతానివి. అహంకారంతో నీకు చావు ఉంటుంది. నీతో నువ్వుంటే ఒంటరివి, ప్రవాహానికి ఎదురీదుతున్నావు, అంటే ఓటమి తథ్యం. పరమాత్మతో ఉంటే సంపూర్ణత్వం నీతో ఉన్నట్టే. అప్పుడు ఓటమి అసంభవం, గెలుపు తథ్యం. ఇది నమ్మకానికి, విశ్వాసానికి సంబంధించిన విషయం. నమ్మకం లేకపోవడమంటే భగవంతునితో నీ సంబంధాన్ని ఒప్పుకోవట్లేదు అని. ఒప్పుకుంటే, స్వీకరిస్తే ఇక భయమెందుకు? ఇబ్బందేంటి? ఆయన ఎలా ఉంచితే అలా ఉంటాం. ఎలా నడిపిస్తే అలా నడుస్తాం. పుట్టకముందు ఎవ్వరు మనల్ని అడగలేదే, పుడతావా అని. చనిపోయే ముందు ఎవ్వరు అడగరే, చనిపోతావా అని. మరి అనవసరంగా ఈ మధ్యలో మన అహంకారాన్ని ఊరికే ముందు పెట్టుకుంటాం."

ఆయన మాట్లాడుతూ తలెత్తి ఒక మామిడిచెట్టు వైపు చూశారు. దాని మీద వాలి ఉన్న కోయిల అప్పుడే కూసింది, అంతా వింటూ 'ఉ' కొడుతున్నట్టు. ఆధ్యాత్మిక జీవితానికి పరమసత్యం చెప్తున్నారు – "ప్రాణం ఇచ్చిన ఆయనలోనే మనం సమసిపోతే, ఇక అపనమ్మకం ఎందుకు? ఈ అందమైన జీవితం ఎక్కడి నుండి వచ్చిందో, దాని మీద అనుమానం ఏంటి? అనుమానించాల్సింది అహంకారాన్ని. ఇది తప్ప వదిలేయా ల్సింది ఏదీ లేదు." ఆయన చెప్పే మాటలు అర్థం అవుతున్నాయి. నిజంగానే, అహం – కర్త, నేను కర్తను, ఇదే విషం. నేను కర్తను కాను, అహం – న – కర్త అన్నది అమృతం. పరమాత్మ దగ్గర, గురువు సాన్నిధ్యంలో, ఆయన సహచర్యంలోనే ఆధ్యాత్మిక ఆనందం ఉన్నది.

**నేతి నేతీతి నేతీతి శేషితం యత్పరం పదం ।**
**నిరాకర్తుమశక్యత్వాత్తదస్మీతి సుఖీభవ ॥**

*భావం:* ఇది కాదు, ఇది కాదు, ఇది కూడా కాదు – అంటూ అర్థం చేసుకుంటూ వదిలేస్తూ వెళ్తే, మిగిలి ఉన్నది పరమాత్మ. ఇది తెలుసుకుని సుఖంగా ఉండు.

– *అఖండజ్యోతి, ఫిబ్రవరి 2016*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## ప్రజ్ఞావతారుని పని

*ప్రజల మనస్సులలో నమ్మకము కల్గించుటకై వారిని సన్మార్గం వైపు పయనింపజేయుటకై అనేకరీతులలో ప్రయత్నాలు చేస్తుండాలి! అందరి అంతఃకరణలో ఉత్కృష్ట భావాలు పెంపొందింపజేస్తూ వారిలో శ్రద్ధాసక్తులను తీవ్రాతి తీవ్రగతిన నాటుకొనేలా చేయాలి! సమస్య ఒక్కటే మరియు ఒక్కటే సమాధానం! మనుష్యులకు దానిపై లోతైన అవగాహన లేదు. మహాకాలునికి యధార్థము తెలుసు. దీనికై ఆయన ప్రజల మనస్సులలో శ్రద్ధాసక్తులను పునర్జీవింపజేయుటకై ప్రజ్ఞావతారుని పంపుచున్నాడు. ఆయన ప్రధాన ఉద్దేశ్యము అశ్రద్ధను శ్రద్ధగా మార్చుటయే!*

*– హిందీమూలం : అఖండజ్యోతి, జూన్ 2016*
*అనువాదం: ఎ. శారద*

**సంకల్పం బలంగా ఉంటే అవరోధాలు ప్రక్కకు పోతాయి**

21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 3

# నిరాశలో ఆశాకిరణాలు

నేటి పరిస్థితులలోని కొన్నింటి గురించి మాత్రమే ఇక్కడ చర్చించుకుంటున్నాము. క్లుప్తంగా చెప్పబడినది ఏమిటంటే భవిష్యత్తును సవరించుకునే దిశలో ప్రయాస, పురుషార్థములు జరిగి ఉంటే బాగుండేది. ఇటువంటి పరిస్థితుల్లో నిరాశా జనకమైన మనఃస్థితి ఏర్పడుట సహజమే! కానీ నిరాశా మానసికస్థితి స్వయంగా ఒక పెద్ద ప్రమాదము. దీనితో మనోబలం కోల్పోయి ఉత్సాహం సన్నగిల్లి అవరోధాలు ఏర్పడతాయి.

సృజనాత్మక ప్రయత్నాలు అసలు జరుగలేదు అని అనలేము. వర్తమానాన్ని సరిదిద్ది, భవిష్యత్తును ఉజ్జ్వలంగా మార్చడానికి చేసే ప్రయత్నాలలో లోటు ఉన్నప్పటికి, లేదు అని అనలేము. విపరీత పరిస్థితులు నలువైపులా ఉన్నా ఉత్సాహము మెండుగ ఉంటే ప్రతికూల పరిస్థితులలో కూడా ఆశ్చర్యపడే ఫలితాలను పొందగలము. ఈజిప్ట్‌లోని పిరమిడ్లు, పనామాకాలువ, సూయజ్ కాలువ, చైనా యొక్క గొప్పగోడ (Great Wall of China) లాంటి ప్రబల ప్రయత్నాలు ఆశాపూరిత ఉత్సాహము తో కూడిన సాహసము వల్లనే సాధ్యమైనాయి. అనేకమంది వ్యక్తులు కలసి ఒకేసారి బరువును తోస్తున్నప్పుడు వారి సంయుక్తశక్తి మరియు నోటి నుండి ఒకేసారి వెలువడిన 'హైలెసా' అనే ఉత్సాహమును పెంచే హుంకారము లక్ష్య ప్రాప్తిని కలుగజేస్తాయి.

రెండవ ప్రపంచయుద్ధములో ఓడిపోతున్న బ్రిటన్‌వాసుల మనోబలాన్ని పెంచటానికి బ్రిటీష్ ప్రధాని సర్‌విన్టన్ చర్చిల్ 'వి-ఫర్-విక్టరి' అనే నినాదాన్ని అందజేశాడు. అనగా శత్రువు ఎంత బలశాలి అయినా గెలిచేది మనమే! ఈ సంకేత సూత్రము ఎంత ప్రచారము పొందిందంటే ఇది సునిశ్చిత విశ్వాసము, విజయము యొక్క ప్రతీకగా మారినది. ఈ 'హుంకారము' అద్భుతమైన పరివర్తనను తీసుకువచ్చింది. యుద్ధపు తాకిడితో బలహీనమైన యూరప్ లేచి నిలబడింది. హిరోషిమా దెబ్బకు సర్వనాశనమైన జపాన్ సృజనాత్మక ప్రయత్నాలలో నిమగ్నమై మనోబలము తగ్గకుండా చూసుకొని ఈనాటి ప్రపంచము యొక్క ఆర్థికరంగాన్ని శాసిస్తున్నది. యుగానుసారము మనుష్యుల యొక్క నమ్మకాలలో తగిన మార్పులు తీసుకురాగలిగితే, వాటిని పాటించటానికి తగిన వాతావరణమును నిర్మించగలిగితే ఆనందదాయకమైన భవిష్యత్తును, ఉజ్జ్వలపరిస్థితులను నిర్మించడము ఖచ్చితంగా సంభవమవుతుంది. ఈ ప్రయత్నము నేటి ప్రవాహదిశను పూర్తిగా తల్లక్రిందులుగా చేసే భగీరథ ప్రయత్నము. కానీ అసంభవము కాదు. ఖచ్చితంగా సంభవమే!!

## క్రియ మారితే ప్రతిక్రియ మారుతుంది

క్రియకు ప్రతిక్రియ ఒక సునిశ్చిత తథ్యము. గడియారము యొక్క లోలకము ఒక వైపుకి వెళ్ళాక తిరిగి మరల రెండవ వైపుకు వస్తుంది. ఒక దిశలో చాలా ఎక్కువగా, అతిగా ముందుకు వెళ్ళేవారు కొంత సమయము తర్వాత పశ్చాత్తాపపడి మళ్ళీ పూర్వస్థితి రావాలని తపించడము చూస్తూనే ఉన్నాము. విష పదార్థములు తిన్నప్పుడు వాంతులు, విరోచనాలు అవడమే గాక ప్రాణాపాయస్థితికూడా సంభవిస్తుంది. కోపిష్ఠి వ్యక్తి ఇతరుల పగకు గురి అవుతాడు. దుర్వ్యసనాలు కలవాడు తన ఆరోగ్యాన్ని, సుఖములను, మర్యాదను మూడింటిని పోగొట్టుకుంటాడు. ఎక్కువగా డబ్బు ఖర్చుపెట్టేవారు లేమిని అనుభవించాల్సి వస్తుంది. చెడుపనులు చేసేవాడు ఇహపరాలు రెండింటినీ పోగొట్టుకుంటాడు. దీనికి విరుద్ధముగా కష్టపడే వారు, క్రమశిక్షణతో మెలిగేవారు రాత్రింబవళ్ళు పూర్తి తత్పరతతో మనస్సును పెట్టి పనిచేసేవారు వారి అభీష్ట ఉద్దేశ్యములను పొందుటలో పూర్తి సఫలతను పొందుతారు.

శక్తుల సదుపయోగము జరిగేరోజులలో సాధారణ పరిస్థితు లలో కూడా మనుష్యులు శాంతముగా ఉండి సుఖశాంతులు నిండిన వాతావరణములో జీవించేవారు. అలుపెరుగక చరిత్ర కారులు గొప్పగా వర్ణించే సత్యయుగం అటువంటి కాలమే! దీనికి విరుద్ధముగా మర్యాదలను (చేయవల్సినవి) మరియు వర్జనీయము (చేయకూడనివి)లను పట్టించుకోక అనాచారము లను, అణచివేయదగిన పద్ధతులను పాటించడంవలన సహజం గానే కలియుగ పరిస్థితులు ఏర్పడతాయి. ఇటువంటి పరిస్థితులలో అన్ని రకాల సాధనాసామగ్రులున్నా మనుష్యులు భయపడుతూ, భయపెడుతూ, ఈర్ష్య, అసూయలతో రగులు

**ఉత్సాహాన్ని ఉరకలు వేయించాలి, సకారాత్మకంగా ఆలోచించాలి**

తున్న-రగిలిస్తున్న అశాంతిమయ జీవితాలు జీవిస్తారు. ఈ రోజులలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. విజ్ఞానము వ్యక్తిని అనంతశక్తి సంపన్నునిగా చేసింది. వికసిస్తోన్న బుద్ధివైభవము అనేక విషయాలను గురించి అవగాహన ఏర్పరచింది. విలాస సాధనాలకి లోటులేదు. చుట్టూరా ఉన్న అలంకరణ సామాగ్రిని చూస్తే స్వర్గములో ఉన్నామా అనే భ్రమ కలుగుతుంది. ఇవి చాలు అనుకుంటే, గత శతాబ్దములలో అసాధారణ ప్రగతి సాధించాము అని అనుకోవచ్చు. కానీ పైన ఉన్న వాటి ఆవరణను తీసిచూస్తే లోపల దుర్గంధపూరిత విషాణువులు, జీవాణువులు తప్ప ఏమి కనిపించవు. ఇంతటి సిగ్గుపడవలసిన విషయము శిష్టాచారములను పరిత్యజించుట వలన ఏర్పడింది. **విజ్ఞానము, ధర్మము కలసి అడుగులు వేసి ఉంటే ఈనాటి వైజ్ఞానిక ఉపలబ్ధులు వ్యక్తికి, సమాజానికి ఎంతో సుఖశాంతులతో కూడిన పునాదులను నిర్మించి ఉండేవి.** సత్యయుగము కంటే గొప్ప పరిస్థితులు ఉండేవి. కానీ దౌర్భాగ్యమేమిటంటే **ఈనాడు సదుపయోగము, దురుపయోగమునకు మధ్య ఉండే అడ్డురేఖ చెరిగిపోయింది.**

## తీవ్రముగా మారుతున్న పరోక్ష జగత్తు ప్రవాహాలు

మనిషి ఏమైనా చేయవచ్చు కానీ వాటి ప్రభావము నుండి తప్పించుకోలేడు. దురుపయోగం యొక్క పరిణామాలు కష్టకరమైనవిగా, బాధాకరమైనవిగానే ఉంటాయి. ఈరోజులలో అదే జరుగుతోంది. సంపన్నులు-లేనివారి మధ్య ఒక శీతల యుద్ధము జరుగుతోంది. సజ్జనతను ఉపేక్షించే రీతి రివాజుల వ్యాప్తి-స్నేహము, సౌజన్యము, సద్భావనలను పూర్తిగా చెరిపి వేస్తున్నది. ఎత్తులకు పైఎత్తులు వేసే పరిస్థితులలో ఇరుక్కుని మానవుడు సంతోషాన్ని, ఉల్లాసాన్ని, సహయోగాన్ని పోగొట్టుకున్నాడు. ఇతరులను పీడించుట మరియు అహంకార ప్రదర్శన కంటే ఇంకొకటి ఎవ్వరికీ తట్టడములేదు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యక్తుల మనఃస్థితి వికృతమగుట మరియు సమాజము యొక్క అధఃపతనము సహజమే. ఇక విశ్వజనీన సంతులనము ఎలా సాధ్యము? వాతావరణ కాలుష్యము, అహంకారము, అనాచారము తమతమ విధానాలద్వారా తమయొక్క దురుపయోగాల వల్ల మహావినాశనము జరుగబోతోంది అని హెచ్చరిస్తున్నాయి. భూమిలో లభించే అనంతసంపదను విచ్చలవిడిగా పిండుకొనుట (భూదోహనము), అదుపులేని జనాభా పెరుగుదల, అనుచితమైన ప్రవర్తన, ప్రతిఒక్కరిలోను నిరాశను, అవిశ్వాసమును, భయముతో కూడిన పరిస్థితులను ఏర్పరుస్తున్నాయి. రాబోయేరోజులు అంధకారమయంగా కనిపిస్తున్నాయి. వర్తమాన పరిస్థితులు కూడ ఎంత గందరగోళంగా ఉన్నాయంటే ఒక సమస్యకు పరిష్కారము వెతుకుతూ ఉంటే పది క్రొత్త విపత్తులు ప్రచండరూపము ధరించి ముందుకొస్తున్నాయి. సహయోగమునకు బదులు సంఘర్షణే పద్ధతిగా మరియు అలవాటుగా మారిపోతున్నది.

ఇటువంటి పరిస్థితులలో సూక్ష్మవాతావరణము కూడా విషపూరితమవుతోంది. తనను బలాత్కరించినవారికి తగిన శిక్ష వెయ్యడానికి, ప్రతీకారము తీర్చుకోవటానికి ప్రకృతి సమాయత్తమవుతోంది. రాబోయేరోజులలో దుర్భిక్షము తాండవిస్తుంది. కరువు, కాటకాలు, వరదలు, భూకంపాలు, రకరకాల రోగాలు వీటి సూచకాలే. **తల్లివలె పోషణ, రక్షణ ఇవ్వవలసిన ప్రకృతి ఇప్పుడు చంపడానికి, చావడానికి కూడా సమాయత్తమవుతోంది.** అణు ఆయుధాలు, మృత్యుకిరణాలు, విషాక్తమైన రసాయనాల ప్రయోగము వలన పృథ్వి నిస్తబ్ద పిండరూపంలో ఉంటుందా? లేక అసలు ఉండదా? అనే సందేహం కలుగుతోంది. అన్నిదిశలనుండి కమ్ముకువస్తున్న మహావినాశకర మేఘాలు మహాప్రళయాన్ని సృష్టించబోవడము లేదుకదా అని అనిపిస్తోంది. ఈ భయంకర ప్రవాహాలవల్ల ఈ అందమైన గ్రహము ధూళికణాలుగా మారి అనంత ఆకాశంలో వెదజల్లబడే ప్రమాదము కూడా పొంచి ఉన్నది. భూమి అస్తిత్వమే సమాప్తమవుతుంది.

సాధారణముగా పృథ్వి స్థిరముగా ఉన్నట్లు అనిపిస్తుంది. రోజులు ఈవిధమైన అనుభవముతోనే గడిచిపోతాయి. కానీ సూక్ష్మదృష్టి కలవారికి పృథ్వి తన అక్షముమీద ఒక బొంగరము లాగా తిరగడంతోపాటు, సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తోందని తెలుసు. ఇది ఆశ్చర్యకరమైన మన భౌతిక ఇంద్రియాలకు అనుభూతిలోకి రాని విషయమైనా సత్యమిదే. అదేవిధంగా ఒక సగటువ్యక్తికి అంతా సవ్యముగానే మామూలుగానే ఉన్నట్లు కనిపించినా లక్షణాలను గుర్తించగలిగేవారు ఈనాటి పరిస్థితులు విస్ఫోటకస్థితిని చేరుకున్నాయని, మనమందరము ఒక అగ్నిపర్వతముమీద కూర్చొని ఉన్నామని, సమీపభవిష్యత్తులో మహావినాశకర పరిస్థితులు రాబోతున్నాయని గుర్తించగలరు.

విశేషజ్ఞులు, భవిష్యవేత్తలు అందరు 20వ శతాబ్దపు అంతము చాలా బాధాకరమైన పరిస్థితుల మధ్య ముగుస్తుందని

**"నేను చెయ్యలేను నావల్ల కాదు" అనే మాటలు మాట్లాడకూడదు**

హెచ్చరిస్తున్నారు. ఆ దుస్థితి రేపు, ఎల్లుండిలలోనే మన ముందుకు రావచ్చు అనే ఊహకూడా ఉన్నది. ప్రగతి పేరుతో మనము సర్వనాశన దిశకి వెళ్తున్నాము. ఇవాళే అంతా పొందాలి అనే ఆలోచనతో భవిష్యత్తును పణంగా పెడుతున్నాము. పృథ్వి యొక్క ఖనిజభాండారాలు అంతమైపోతున్నాయి. పెరుగుతోన్న జనాభాకు ఆహార–విహారములకేకాక నడవటానికి కూడా పృథ్వి సరిపోకపోవచ్చు. జీవనీశక్తి లేకపోవడము వలన మనుష్యులు ఈగలు, దోమలు వలె దిక్కులేని చావుచావవచ్చు. సంపదలు, ఇతర సుఖసాధనాలు ఎన్ని ఉన్నా, సద్భావనలు, సహయోగము లేకపోవుటవలన మనుష్యులు ప్రేతపిశాచాల వలె జీవిస్తారు. ఈ లక్షణాలన్నీ ఈనాడు మనముందే ఉన్నాయికదా! రాబోయే రోజులలో ఇవి పెరుగుతాయి తప్ప తగ్గవు అని అనిపిస్తున్నది.

## సంతులనం - నియంత యొక్క వ్యవస్థలో ఒక భాగము

ఇలాంటి పరిస్థితులలో కూడా ఒక విషయము గుర్తుంచు కోవాలి. ఈ సృష్టికి ఒక నియంత ఉన్నాడు. అతను సమస్త కళాకౌశలములను ఏకీకృతము చేసి ఈ పృథ్విని, దానిని శాసించుటకు మనిషిని తయారుచేశాడు. అతను ఈవిధమైన సర్వనాశనమును చూస్తూ ఊరుకోడు. పిల్లలకు ఒక హద్దువరకే ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించుటకు అనుమతి ఉంటుంది. ఉపయోగపడే ఖరీదైన వస్తువులను పిల్లలు పాడుచేయటానికి ప్రయత్నిస్తే గారాబము చేసే తల్లిదండ్రులే దండించటానికి కూడా వెనుకాడరు. ఇష్టానుసారము ప్రవర్తించడానికి కూడా ఒక హద్దు ఉంటుంది. ఇంగితజ్ఞానము మనము అడుగులు వెనుకకు వేయాలి అని తెలుపుతోంది. అనాచారులు విశృంఖలముగా ప్రవర్తిస్తే వారిని కారాగారములో పెడతారు. అప్పుడప్పుడు వారికి మృత్యుదండన కూడా విధిస్తారు. శరీరములో ప్రవేశించిన రోగాలను తరిమికొట్టటానికి **జీవనీశక్తి ఏకత్రితమై** చెయ్యవలసినది చేయటానికి సన్నద్ధమవుతుంది. నేటి విపత్కర పరిస్థితులకు కూడా ఇది వర్తిస్తుంది. నియంత సమయానుకూలంగా సర్వనాశన దిశవైపుకు వెళ్తున్న గుడ్డి పరుగును ఇక ఆపివేయదలచుకున్నాడు. మళ్ళీ కాల ప్రవాహ మును సంతులిత స్థాయికి తీసుకురాదలచుకున్నాడు. శాసన సంచాలకులు తగినట్లు ప్రవర్తించకపోతే రాష్ట్రపతి శాసనం విధింపబడుతుంది. అయోగ్యులకు బదులు సుయోగ్యుల చేతిలోకి శాసనవ్యవస్థ ఇవ్వడానికి ఇదేవిధమైన **ఉచ్చస్తరీయ నియంత్రణ** అమలుచేయబడుతుంది.

భయము కలిగించే అంధకారము, దానివల్ల ఉత్పన్నమయ్యే ఇబ్బందుల గురించి అందరికి తెలుసు. అలాగే మనము గుర్తుంచుకోవల్సిన విషయము ఇంకొకటి ఉన్నది. సృష్టి వ్యవస్థ అంధకారమును ఎక్కువ కాలము భరించదు అన్నది కూడా దృష్టిలో ఉంచుకోదగిన అంశము. బ్రాహ్మీముహుర్తము వస్తుంది. కోడి కూస్తుంది. తూర్పుకనుమలలో ఉషఃకాంతులు ప్రసరిస్తాయి. అవి తమ వెలుతురుతో దశదిశలను నింపుతాయి. త్వరితంగా క్రొత్త పరిస్థితులు ఏర్పడతాయి. పుష్పములు వికసిస్తాయి. పక్షులు కిలకిలారావాలు చేస్తూ ఎగరడము, గెంతడము మొదలెడతాయి.

స్రష్ట వర్తమాన కాలప్రవాహ దిశ చరమవినాశ బిందువుకు చేరుకొనకముందే ఆపి పరివర్తన యొక్క క్రొత్త వాతావరణము నిర్మించడానికి నిశ్చయించుకున్నాడు. దీని గురించి సూక్ష్మదృష్టి కలవారందరు ఒకేవిధంగా తెలుపుతున్నారు. క్రొత్త ఆలోచనా విధానము ఆరంభించబడుతోంది. దృష్టికోణముయొక్క దిశ మారుతోంది. ఈ మార్పు మేధావివర్గములో అప్పుడే మొదలయ్యింది. **విస్తృత వాతావరణంమీద నియంత్రణ చేసే అదృశ్య శక్తులు తమతమ కార్యక్షేత్రాలలో తమదైన శైలిలో అవాంఛనీయవిధివిధానాలను తలక్రిందులు చేసి వాటి స్థానములో క్రొత్త విలువలను, లక్ష్యాలను స్థాపించటానికి తగిన చమత్కారములను చూపించడానికి నిర్ణయించుకున్నాయి (పంచవీరభద్ర సాధన).**

**మనిషి యొక్క ప్రచండ పురుషార్థపరాయణత వల్ల సమయము వేగము పుంజుకున్నది.** సృష్టి ఆదినుండి జరగని అనేక చమత్కారములు గత కొద్ది శతాబ్దములలో చాలా విచిత్ర రీతిలో జరిగాయి. అది అవాంఛనీయమైనా కావచ్చు. సమయము యొక్క వేగము పెరుగుటవలన గంటకు 3 మైళ్ళు మాత్రమే నడువగలిగే వ్యక్తి ఆ 3 గంటలలోనే విమానాలలో కూర్చుని ఎక్కడెక్కడికో చేరుకుంటున్నాడు. మనిషి యొక్క ప్రబల పురుషార్థము యొక్క వేడివల్ల సమయ ప్రవాహ గతి చాలా వేగము పుంజుకున్నది. మానవుడు మంచి చేసినా, చెడు చేసినా వేగంగా చేశాడు. ఈ తీవ్రవేగము ముందు ముందు కూడా కొనసాగుతుంది. సవరించే కార్యక్రమాలు కూడా అంతే వేగంగా

**"మనకి ఎదురే లేదు, మనలను ఎవరు ఆపలేరు" అని అనుకుంటూ ఉండాలి**

జరుగుతాయి. తుఫాను ఏ దిశకి తిరుగుతుందో అటువైపే తన ప్రచండతను చూపిస్తుంది.

ప్రతిదానికి ఒక హద్దు ఉంటుంది. రావణ, కంస, హిరణ్య కశ్యప, వృత్తాసురుడు మొదలగువారు ఎంత వేగముతో ఎదిగారో అదే వేగముతో వారి అంతము కూడా జరిగింది. నీటిలో బుడగలు చాలా వేగముగా ఏర్పడతాయి. అంతే వేగముతో తమ రూపాన్ని కూడా కోల్పోతాయి. పంట పక్వాని కొచ్చి కోశాక దాని స్థానములో క్రొత్తపంట వేస్తారు. జర్జర శరీరాలు మరణించి క్రొత్త జన్మను తీసుకుంటాయి. శిథిల భవనాల స్థానములో క్రొత్త భవనాలు లేస్తాయి. ఇదేవిధంగా అవాంఛనీయతల వాతావరణము ఇక సమాప్తము కానున్నది. దాని స్థానములో నిజమైన ప్రగతిశీలత వస్తుంది. లంకా దహనముతో పాటు, రామరాజ్యము కూడా అవతరించింది. ఇప్పుడు కూడా అదే జరుగబోతున్నది.

### ఇరవై ఒకటవ శతాబ్ది - ఉజ్జ్వల భవిష్యత్తు

ఈ ఆధారాలవలన 21వ శతాబ్దం సుఖప్రదమైన సంఘటనల కాలము. 20వ శతాబ్దముయొక్క ఉపలబ్ధులు తక్కువ. విపత్కర పరిస్థితులు ఎక్కువగా ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులలో విప్లవాత్మకమైన మార్పు రాబోతోంది. ఉదయము, సాయంకాలము సంధికాలాలు ఏర్పడినట్లే ఈ కాలం 20వ శతాబ్దం మరియు 21వ శతాబ్దంయొక్క యుగ సంధి. దీనికి కూడా ఒక కాలావధి ఉన్నది.

1989 నుండి 2000 వరకు 12 సంవత్సరాలు యుగసంధి యొక్క మధ్యకాలము. ఈ కాలములో అనేక సూక్ష్మ, స్థూల స్థాయిలలో విప్లవాత్మకమైన మార్పులు ఆరంభించబడ్డాయి. ఆరిపోతున్న దీపము ఎక్కువ ప్రకాశవంతముగా వెలుగుతుంది. చనిపోయే ముందు చీమలకు రెక్కలొస్తాయి. మరణము ఆసన్నమైనప్పుడు శ్వాసగతి తీవ్రమవుతుంది.

పగలు, రాత్రి కలిసే సంధ్యాకాలాలు అనేక చిత్రవిచిత్రాలను తీసుకుని వస్తాయి. ప్రసవవేదనపడేటప్పుడు రెండు పరస్పర విరోధి విచిత్రములు కనిపిస్తాయి. ఒకవైపు బాధతో కూడిన మూలుగులు వినిపిస్తూ ఉంటే రెండవవైపు సంతానము కలగబోతోంది అనే ప్రసన్నత, సంతోషము కుటుంబసభ్యులలో కనిపిస్తుంది. యుగసంధి మధ్యకాలము యొక్క ఈ 12 సంవత్సరాలు సముద్రములోని ఆటుపోటుల వంటివి. ఈ పరిస్థితులలో ఒకవైపు అవాంఛనీయత ఓడిపోతున్న జూదరి వలె ఒకటికి రెట్టింపు పందెమును పెంచుకుంటూ తన వంతుగా కొంపముంచుకొనుటకు ప్రయత్నలోపము ఉంచుకోదు. రెండవ వైపు సృజనాత్మక పరిస్థితులు మరియు ప్రయత్నాలు కూడా తన పూర్తి శక్తిని ఉపయోగించి పందెములో గెలవడానికి తీవ్ర ప్రయత్నములలో మునిగి ఉన్నాయి.

**యుగసంధి యొక్క ఈ చారిత్రాత్మక కాలములో ఒకవైపు సృజనసంభావనల దృశ్యమానప్రయత్నాలు ప్రభుత్వ , ఆర్థిక, వైజ్ఞానిక క్షేత్రాలలో జరుగుతూ ఉంటే ఇంకొకవైపు ఆధ్యాత్మిక శక్తులు కూడా తపఃప్రేరణలకు ఎంత తీవ్రమైన వేగమును ఇస్తున్నాయంటే మళ్ళీ భగీరథుడు, దధీచి, హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు మొదలగువారి గొప్ప గొప్ప విప్లవాత్మక ప్రయత్నాలన్నీ పునరావృత్తమగుట గోచరిస్తున్నది.**

లోకసేవకుల ఒక పెద్ద సమూహము ఈరోజులలోనే కార్యక్షేత్రములో దిగి రాముని ఎలుగుబంట్లు, కోతుల వలె, కృష్ణుని గోపబాలకుల వలె, బుద్ధుని పరివ్రాజకుల వలె మరియు గాంధీగారి సత్యాగ్రహుల వలె ఒక అభినవపాత్రను పోషించి ఒక క్రొత్త చరిత్ర యొక్క నవనిర్మాణాన్ని గావిస్తున్నాయి. **ఇవన్నీ అదృశ్య ప్రయత్నాల యొక్క అనుకృతి అని అర్థము చేసుకోవాలి.**

*(సశేషం)*

## బుద్ధ భగవానుడు

*బుద్ధ భగవానుడు ఆత్మశాంతి వెతుకులాటలో ఇంటిని వదలి ఆత్మప్రాప్తికొరకు అనేక గురుజనులను దర్శించాడు, ప్రశ్నించాడు. ఆత్మశాంతిపై జిజ్ఞాస నిరంతరం అలాగే ఉండటం వలన అతని లోపలి నుంచి సమాధానం వినిపించింది – "తపస్సు చెయ్యి, నీ లోపల వెలుగును ఉత్పన్నం చెయ్యి."*

*"తపసాధనతో నేను స్వయంగా పరమతత్వాన్ని తెలుసుకుంటాను, ప్రాప్తించుకుంటాను." ఇలాగ సంకల్పం చేసుకుని, ఆత్మబోధని ప్రాప్తించుకుని బుద్ధత్వం పొందాడు, ధర్మచక్ర పరివర్తన వంటి మహాకార్యములను చేయగలిగాడు.*

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1999*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**ఇతరులకు కీడు తలబెడితే మన విలువైన శక్తిని కోల్పోతాము**

అంతర్యాత్ర-3

# మనస్సు తొలగిపోతేనే చిత్తవృత్తి యోగం యొక్క సత్యము తెలుస్తుంది

ఎవరి అంతశ్చేతన యందు శిష్యుడు కావాలనే తపన ఉదయించిందో వారు మాత్రమే పతంజలి మహర్షి సమాధి పాదములో ఇచ్చిన రెండవసూత్రములో యోగము యొక్క సత్యమును తెలుసుకోగలుగుతారు. మహర్షి రెండవ సూత్రాన్ని ఇలా చెప్పారు-

**'యోగశ్చిత్తవృత్తినిరోధః' ॥ 1/2**

ఇది యోగానికి మూలమైన, మౌలికమైన పరిభాష. ఈ సూత్రములోని శబ్దములకు అర్థము

యోగః = యోగము, చిత్తవృత్తినిరోధః = చిత్తవృత్తులను ఆపుట.

కానీ సాధకుల దృష్టిలో ఈ సూత్రమునకు అర్థము - యోగము అనగా మనస్సును సమాప్తము చేయుట. పరమ పూజ్యగురుదేవులు యోగసాధన యొక్క ఈ సత్యాన్ని మనకు అర్థమయ్యేలా ఇలా చెప్పారు - 'సాధకుని మనస్సు తొలగిపోతేనే అతనికి యోగమును గురించిన సత్యము అర్థమవుతుంది' పతంజలిమహర్షి. పరమపూజ్య గురుదేవులు ఇరువురు తీవ్ర వైజ్ఞానికత కలిగినవారు, పక్కా గణితజ్ఞులు. వారు అక్కడి మాటలు ఇక్కడ, ఇక్కడి మాటలు అక్కడ చెప్పి తమ సమయాన్ని వృథా చేయరు.

ఆయన ఇంతకుముందు ప్రథమసూత్రములో కూడా ఒకే వాక్యముతో సాధకునిలోని నిష్కళంకత, వాస్తవికత ఎంత ఉందనేది పరీక్షించి చూస్తారు. అతను నిజంగా, ప్రమాణ పూర్తిగా యోగమునందు తనకు అభిరుచి ఉన్నదని నిరూపించాలనుకుంటే అది కూడా ఆశ, కోరిక ఉన్నదని నోటితో చెప్పడం కాదు. అతను అనుశాసనపూర్వకంగా జీవితాన్ని ఆ క్షణంలోనే పూర్తిగా రూపాంతరం చెందించుకునే విధంగా మారాలనుకోవాలి. ఇటువంటి తీక్షణమైన, సత్య తుల్యమైన స్థితికి మాత్రమే ఆయన యోగము అనే పదాన్ని వాడాలని చెప్తారు. యోగము అంటే మనస్సును సమాప్తం చేయడం అంటే మనస్సు పోతేనే పని సాధించడం సాధ్యమవుతుంది.

తాత్పర్య, టీకా సహితంగా అసలైన యోగపరిభాష ఇదే. అనేకమంది ఆచార్యులు శాస్త్రములను యోగాన్ని రకరకాలుగా వర్ణించారు. వారు అనేకరకాల పరిభాషలు వెతికి మరీ చెప్పారు. యోగమంటే దివ్యసత్తాతో కలయిక అని కొందరి అభిప్రాయము. అంటే వారి ఉద్దేశ్యం ప్రకారం యోగమంటే కలయిక, రెండింటిని కలపడం. మరికొందరు యోగమంటే అహంకారమును అణచివేయడం అని చెప్తారు. వారినను సరించి అహంకారం మధ్యలో అడ్డుగా ఉంది. ఏ క్షణాన ఆ గోడ కూలద్రోయబడుతుందో అప్పుడు ఆ దివ్యసత్తాతో కలయిక సాధ్యపడుతుంది. నిజానికి మొదటినుండి ఒకటిగానే ఉన్న వారిమధ్య అహంకారం కారణంగా భేదమున్నట్లు కనపడుతుంది.

ఇటువంటి ఎన్నో వ్యాఖ్యలు, పరిభాషలు ఉన్నాయి. శ్రీమద్భగవద్గీతలో 'సమత్వంయోగఉచ్యతే' మరియు 'యోగః కర్మసుకౌశలమ్' అని చెప్పి యోగాన్ని నిర్వచించారు. కానీ పతంజలి మహర్షి ఈ ఆచార్యులు, శాస్త్రకారులకంటే గొప్ప వైజ్ఞానికులు. ఆయన ఆకులను, కొమ్మలను పట్టుకోలేదు, నేరుగా మూలమైన వేరునే పట్టుకున్నారు. గీతలో చెప్పబడిన సమత్వం, కర్మకుశలత ఎలా లభిస్తాయి? దివ్యసత్తాతో సాధకుని అస్తిత్వం కలయికను పొందేది ఎలాగా? పతంజలి మహర్షి పరిభాషలో ఈ ప్రశ్నలన్నింటికి సరైన సమాధానం ఉంది. ఆయనేం చెప్తారంటే మనస్సు ఎప్పుడు అవసానదశకు చేరుకుంటుందో అప్పుడే నశిస్తుంది. ఆయన ప్రకారం యోగము అంటే మనస్సు యొక్క అవసానదశ.

పతంజలి మహర్షి యొక్క ఈ మాటలకు గురుదేవులు ఒక నూతనవైజ్ఞానిక అనుభూతిని ఇస్తారు. మొత్తమంతా మనస్సు యొక్క మాయాజాలమే అని ఆయన చెప్తారు. ఈ మాయ తొలగిందా మిగిలినదంతా తొలగిపోయినట్లే. ఆయన ప్రకారం 'మనస్సు' అనే శబ్దము అన్నింటినీ తనలో ఇముడ్చుకుంటుంది. అహంకారము, కోరికలు, కామనలు, కల్పనలు, ఆశలు, తత్త్వజ్ఞానము, శాస్త్రము ఎక్కడైనా సరే, కొద్దిగానైనా ఆలోచించే వీలు ఉన్నది అంటే అక్కడ మనస్సు ఉన్నట్లే. ఏది తెలుసుకున్నారో, ఏది తెలుసుకోవచ్చో, ఏది తెలుసుకునేందుకు వీలవుతుందో అది మొత్తం మనస్సు మనపై కప్పిన పరదాయే. మనస్సు సమాప్తం కావడం అంటే నీవు ఏది తెలుసుకున్నావో అది సమాప్తం కావడం, ఏది తెలుసుకోవాలో అది సమాప్తం

**విమర్శించిన వారి చేతనే పొగిడించుకోవాలి**

కావడం. ఇదంతా మన జ్ఞానాతీతస్థితిలో ఒక పెద్ద దుముకు. (దూకడం అని అర్థం) ఎప్పుడు మనస్సనేది లేదో ఇక అక్కడ మిగిలేది జ్ఞానానికి అతీతమైనదేగా!

మనస్సు యొక్క ఈ సత్యాన్ని గోస్వామి తులసీదాసు తన రామాయణంలో ఇలా కీర్తించారు.

**గో గోచర్ జహా లగి మన్ జాయ్ ।**
**సోసల్ మాయా జానేహు భాయ్ ॥**

అనగా ఇంద్రియాలు, ఇంద్రియాలు చేరే ప్రదేశాలకు మనస్సు కూడా వెళ్తుంది. ఓ సోదరా! నీవు వాటినన్నింటినీ మాయ అని తెలుసుకో, మిథ్య అని అర్థం చేసుకో! పతంజలి మహర్షి ఈ మాయనే సమాప్తం చేయమని, ఈ మిథ్యనే తొలగించమని చెప్తారు. మిథ్యను తొలగించడమంటే మనస్సును సమాప్తం చేయడం అంటే యోగము అని అర్థం.

మనస్సు యొక్క కష్టము, మనస్సు వల్ల కలిగే కష్టములనేవి సాధకునికి అన్నింటికంటే ప్రప్రథమంగా ఎదురయ్యే అతి ముఖ్యమైన, మహత్త్వపూర్ణమైన ప్రశ్నలు. ఈ చిక్కుముడిని విప్పదీసేందుకు ముందుగా ఒకటి తెలుసుకోవాలి. అసలు ఈ మనస్సు అనేది ఏమిటి? ఇది మన లోపల ఏమి చేస్తున్నది, ఏమేమి చేయిస్తున్నది? సాధారణంగా అందరు మనస్సు శిరోభాగంలో ఉండే ఏదో ఒక భౌతికవస్తువు వంటిదని అనుకుంటారు. కానీ పరమపూజ్య గురుదేవులు దీనిని ఒప్పుకోరు. 'ఎవరు మనస్సును లోపలినుండి తెలుసుకుంటారో వారు ఈ మాటలను అంగీకరించరు, గురుదేవులు మనస్సు అనేది ఒక వృత్తియని, క్రియాశీలత అని అంటారు.

ఇప్పుడు నడుస్తున్న ఒక మనిషి కూర్చున్నాడు అనుకోండి, కూర్చున్నంత మాత్రాన అతనిలో ఉన్న నడిచే లక్షణం పారిపోతుందా? విషయం అంతే! నడవడం అనే లక్షణం ఒక వస్తువు కాదు, పదార్థము కాదు, అది ఒక క్రియ. అందుకే ఎవరైనా అలా కూర్చుని ఉంటే అతనిని మనం నీ నడకను ఎక్కడ దాచావు అని అడగము కదా! ఒకవేళ అలా అడిగితే ప్రక్కన ఉన్నవాళ్ళు నవ్వుతారు. అప్పుడతను ఇది క్రియయే కదా, నేను కావాలనుకుంటే నడుస్తాను, మరలమరల నడవ గలను అని సమాధానమిస్తాడు. అంతే! మనస్సు కూడా ఇటువంటి ఒకానొక క్రియాకలాపమే! కేవలం మనస్సు లేదా మైండ్ అనే శబ్దము వల్ల అది ఒక తత్త్వము లేదా పదార్థము అన్న భ్రమ కలుగుతుంది. ఈ మైండ్‌ని కనుక మైండింగ్ అని పిలిస్తే ఆ మాట ఇంకా స్పష్టంగా ఉంటుంది. ఎలాగంటే మాట్లాడటాన్ని టాకింగ్ అన్నట్లే ఆలోచించడాన్ని మైండింగ్ అనవచ్చు. దీని యొక్క సక్రియత ఆగిపోయి మనస్సు అవసానదశకు చేరుకుంటే కనుక సాధకుడు యోగి అవుతాడు.

యోగి యొక్క ఈ సత్యాన్ని తెలియపరిచేందుకు గురుదేవులు అప్పుడప్పుడు ఒక కథను చెప్తుండేవారు. వారణాసిలో త్రైలింగ స్వామి అనే మహానుభావుడు ఉండేవాడు. ఒకసారి ఆయన దగ్గరికి గొప్ప రాజవంశానికి చెందిన ఒక రాజు వచ్చాడు. ఆ రాజు స్వామితో 'మహారాజ్! నా మనస్సు చాలా ఆందోళనగా ఉంది, చాలా అశాంతిగా, కష్టంగా ఉంది, మీరు గొప్ప మహాత్ములు కదా, నా మనస్సు శాంతపడేటందుకు ఏం చెయ్యాలో చెప్పగలరా?' అని అడిగాడు.

త్రైలింగస్వామివారు చాలా సున్నితస్వభావులు. కానీ అప్పుడప్పుడు చాలా కోపంగా మాట్లాడేవారు. ఆ రోజు కూడా చాలా కోపంగా ఉండడం వల్ల ఇలా అన్నారు, 'ఏమీ చేయవద్దు, ముందు నీ మనస్సును నా దగ్గరకు తీసుకురా!'. ఆ రాజుగారు తనకేమీ అర్థం కాలేదని విన్నవించాడు. ఆయనేం చెప్తున్నా స్వామి వినిపించుకోకుండా, 'ప్రొద్దునే నాలుగింటికి నా దగ్గరకు రా! కానీ నువ్వు ఒంటరిగానే రా! గుర్తుంచుకో, నీ మనస్సును కూడా మర్చిపోకుండా నీతోనే తీసుకురా!' అని చెప్పారు.

ఆ రోజు రాత్రంగా రాజుగారికి నిద్రపట్టలేదు. స్వామి దగ్గరికి వెళ్ళకుండా ఉంటే ఎలావుంటుందని చాలాసార్లు ఆలోచించాడు. ఇంత అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నా ఈ స్వామి చాలా గొప్పజ్ఞాని అని ప్రజలంతా ఎలా అనుకుంటున్నారు అని తనలో తానే అనుకున్నాడు. అసలాయన మరచిపోకుండా నీ మనస్సును కూడా నీతో తీసుకురా అని చెప్పారే, దానికేమిటి అర్థం? అని పరిపరివిధాల ఆలోచించాడు.

ఈ ఊహల బరువు చాలా ఎక్కువైపోయి తనను తాను నిగ్రహించుకోలేకపోతున్నాడు. త్రైలింగస్వామివారి ఆకర్షణశక్తి అంత గొప్పది. ఏదో అద్భుతమైన అయస్కాంతశక్తి తనను లాగుతున్నది అని రాజుకు అర్థమైపోయింది. నాలుగుకాక ముందు ప్రక్కమీది నుండి లేచి ఆయన దగ్గరకు ఖచ్చితంగా వెళతాను అనుకున్నాడు. ఆయన నన్ను భ్రమింపచేయాలని చూస్తున్నారు, అయితేనేమి? ఆయనలోని శక్తి గురించి ఆయన కళ్ళే చెప్తున్నాయి కదా!

ఇలా ఆలోచించుకుంటూ రాజుగారు త్రైలింగస్వామి

**ఇతరుల విమర్శలలోని నిజానిజాలు చూడాలి**

దగ్గరకు వెళ్ళాడు. వెళ్ళగానే 'వచ్చేశావా నువ్వు, నీ మనస్సెక్కడ?' అని అడిగారు స్వామి. దానికి రాజుగారు 'మీరు భలేవారు స్వామీ! నా మనస్సు నాలోనే ఉండక ఎక్కడికి పోతుంది, అది నాలోనే ఉంది' అన్నాడు.

అందుకు త్రైలింగస్వామి 'సరే, నీ మనస్సు నీ దగ్గరే ఉన్నదని నిర్ణయమైపోయింది కదా, ఇప్పుడు నేను చెప్పిన మరో పని చెయ్యి, నీవు కళ్ళు మూసుకుని నీ మనస్సు ఎక్కడుందో వెతుకు! దాన్ని వెతికి కనుక్కున్న తరువాత చెప్పు, నేను దానిని శాంత పరుస్తాను' అన్నారు.

ఆ రోజు త్రైలింగస్వామివారు చెప్పిన మాట విని రాజు కళ్ళుమూసుకొని మనస్సును చూడడానికి ప్రయత్నించసాగాడు. అతను ఎంత లోపలికి లోపలికి వెళ్ళి వెతికినా ఎక్కడా మనస్సు కనిపించడం లేదు. ఒక్కటిమాత్రం తెలుస్తున్నది – ఆలోచించే పని, కోరికలు, ఆశలు, అభిలాషలు ఊహించుకోవడం అనే పనే కనపడుతున్నది అని రాజుగారికి అర్థమైపోయింది. మరు క్షణమే తన అన్వేషణ అనేది ఎంత అనవసరమైన విషయమో స్పష్టంగా తెలిసిపోయింది. మనస్సు అంటే ఏమీ లేదు, దానిని గురించి మనం చేయగలిగేది ఏమీ లేదు, అది కేవలం ఒక పని అనుకుంటే కనుక ఆ పనిని మనం చెయ్యకుండా ఉంటే సరిపోతుంది. అది కేవలం ఒక చలనమే అనుకుంటే చలించకుండా ఉంటే సరిపోతుంది.

ఇలా ఆలోచించగానే రాజుగారి కళ్ళు తెరుచుకున్నాయి. త్రైలింగస్వామివారు నవ్వుతూ ఇలా అన్నారు – 'విషయం అర్థమైందా? ఇకమీదట ఎప్పుడైనా నీకు అశాంతిగా అనిపిస్తే నీ లోపలికి వెళ్ళి చూసుకో! ఇలా లోపలికి చూసుకోవడం, అవలోకనం చేసుకోవడం వల్ల మనస్సు యొక్క గతి నియంత్రణ లోకి వస్తుంది. నీవు కనుక పూర్తిస్థాయిలో మనస్సులోకి వెళ్ళగలిగితే నీ శక్తి అంతా ఒకే ఒక దృష్టిగా మారుతుంది. అప్పుడు ఆ శక్తి గతి, ఆలోచనావిధానము సామాన్యస్థాయిలో నిలకడగా ఉంటుంది.

పరమపూజ్య గురుదేవులు ఇలా అనేవారు – మనిషికుండే అలవాట్ల వల్ల అతని శక్తి మొత్తం ఆలోచనల మీదనే కేంద్రీకృతమై ఉంటుంది. అతను జన్మజన్మలుగా, ఇంకా చెప్పాలంటే లక్షల జన్మల నుండి ఇలాగే చేస్తూ వస్తున్నాడు. అతను నిరంతరంగా అందిస్తున్న ఇంతటి శక్తి కారణంగా, సహకారం కారణంగా మనస్సు అనే నది చాలా వేగంగా ప్రవహిస్తున్నది. ఆవిధంగా ఇంతకుముందు నుండి వస్తున్న వేగము వల్ల ఈనాడు మనస్సు ఆశ్చర్యకరమైన సామర్థ్యములతో, తీవ్రవేగమును పుంజుకున్నది. యోగసాధన చేసేవారందరికీ ఈ విషయం చక్కగా అర్థం కావాలి. యోగసాధన అంటే దీని నుండి మనం వేరుపడడం. మనస్సుచేసే క్రియలతో సంబంధము సమాప్తమైపోవాలి. మనస్సుతో, దాని క్రియాశీలత తోపాటు మనస్సుకుండే ఆసక్తి కూడా సమాప్తమైపోవాలి. అప్పుడు మన నుండి మనస్సుకు శక్తి లభించదు. అప్పుడు మహా అయితే కొద్దిసేపు చలిస్తుంది, అంతే! మననుండి శక్తి అందకపోవడం వల్ల అదే అణగిపోతుంది. ఎప్పుడైతే పూర్వపు వేగం తగ్గిందో పూర్వపు శక్తి కూడా ఆగిపోతుంది. ఇంక మనస్సు దానంతటదే ఆగిపోతుంది. అలా మనస్సు ఆగినస్థితి ఎప్పుడు వస్తుందో అక్కడనుండి మనం యోగసాధకులు అనే స్థితి నుండి యోగి అనే దిశగా అడుగులు వేయడం మొదలు పెడతాము. అప్పుడు పతంజలి మహర్షి పరిభాష, పరమపూజ్యగురుదేవులు మనకు చెప్పిన బోధ అన్నీ మన యొక్క అనుభూతులుగా మారతాయి. మనస్సు సమాప్తము కావడమే యోగము అనేది అర్థమవడం మొదలవుతుంది.

ప్రతిరోజు 24 నుండి 30 నిమిషాల వరకు అనుభూతి పొందేందుకు మనం కేటాయించుకోవాలి. నియమిత సమయంలో, నియమిత స్థానంలో క్రమశిక్షణతో అనుశాసన పూర్వకంగా మనం ఆసనంపైన స్థిరంగా కూర్చోవాలి. (నేను అనే లోతుల్లోకి వెళ్ళేందుకు) మీరు మీ లోపలికి వెళ్ళేందుకు సిద్ధమై ఉండాలి. మొదటి క్షణంలో మనస్సు యొక్క వేగవంతమైన ప్రవాహం వలన పెద్దపెద్ద అలలు వస్తున్న అనుభూతి కలుగు తుంది. ఈ ప్రవాహానికి, అలలకు ఆకర్షితులు కాకూడదు. దానినుండి మిమ్మల్ని మీరు దూరంగా ఉంచుకోవాలి. నేను వేరు, మనస్సు యొక్క వేగవంతమైన ప్రవాహం వేరు అని అనుభూతి చెందాలి. ఈ అనుభూతి ప్రగాఢమవుతున్న కొద్దీ మనస్సు యొక్క వేగవంతమైన ప్రవాహం కూడా నిశ్చలస్థితికి చేరుతూ ఉంటుంది. కానీ ధ్యానంలో ఉంచుకోవాల్సిన నియమం ఒకటుంది. మనస్సు యొక్క వేగం తగ్గిందా? లేదా? అని మాటిమాటికి వెనక్కు తిరిగి చూడకూడదు. ఎందుకంటే ఇలా చేయడం వల్ల మీరు, మీ శక్తిని మనస్సుకు ఇవ్వడం మొదలు పెడతారు. అది మరల ప్రచండరూపాన్ని ధరిస్తుంది. మనస్సును మీ నుండి వేరుచేసి స్థిరత్వమును పొందడమనే అనుభూతి అనే అంకురము ఎంతవేగంగా పెరుగుతుందో అంత వేగంగా యోగఃచిత్తవృత్తినిరోధః అనే అనుభూతి సాకారమవుతుంది.

– *అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**విమర్శలను సద్విమర్శగా చూడటం మనకు మనము మేలుచేసుకోవడమే, అవి అనేకసార్లు మనం ఎదగడానికి తోడ్పడతాయి**

జీవనయాగం-2

# ఐదు 'వకారములు' విద్యార్థిని తీర్చిదిద్దుతాయి

ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరములోని సంస్కృత శ్లోకం

**వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేన చ వకారైః పంచకర్యుక్తః నరోభవతి పూజ్యతః**

ఈ 5 వకారాలను గుర్తుంచుకుంటే ఉద్యోగము రాకపోవటం అనే పరిస్థితి ఉండదు. ఈ ఐదు విషయములలో జాగ్రత్త వహిస్తే లోకం లోకమంతా మనిషిని గౌరవిస్తుంది.

**1. వస్త్రేణ:** మనిషికి ముఖ్యంగా విద్యార్థికి లేక ఉద్యోగము కోసం వెళ్ళే అభ్యర్థికి ముందుగా వస్త్రధారణ సవ్యముగా ఉండటమనేది చాలా ముఖ్యం. ఎలాంటి బట్టలను ధరించావు? దీనినిబట్టి నీకు గౌరవము-అగౌరవము లభిస్తుంది. నా ఇష్టం వచ్చినట్లు వస్త్రధారణ గావిస్తాను, అది నా స్వేచ్ఛ అంటే కుదరదు. చదువుకునే విద్యార్థి మర్యాదను అనుసరించి ఏ వేషములో, ఎలా ఉండాలో అలానే ఉండాలి. ఉదాహరణకు నేను సంప్రదాయమును గురించి, విద్యార్థులను గురించి, విద్యావ్యవస్థ గురించి మాట్లాడటానికి వచ్చాను కాబట్టి సంప్రదాయ పంచెకట్టుతో, బొట్టుపెట్టుకుని రావాలి. అలా కాకుండా నేను జీన్స్‌ప్యాంట్-టిషర్ట్ వేసుకుని వస్తే చూసేవారికి ఎలా ఉంటుంది? నన్ను చలనచిత్రములో నటించే కథా నాయకుడు అని అనుకుంటారు తప్ప మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావుగారు అని అనుకోరు. కనుక వస్త్రధారణలో తేడా రాకూడదు. నా వృత్తిధర్మమును అనుసరించి నేను బట్టలు కట్టుకోవాలి. ఇంటి దగ్గర ఉంటే అది వేరే విషయము. కానీ వృత్తిధర్మములో ఉన్నప్పుడు దానికి తగిన వస్త్రధారణ చేయవలసినదే. ప్రవచనము చెప్పటానికి వేదిక మీదకు వచ్చినప్పుడు నేను ఇలా పంచెకట్టుతో ఉండాల్సిందే. కదా!

సరే పనికి తగిన వేషముతో వస్తే సరిపోతుందా? సరిపోదు. వేదిక మీదకు వచ్చాక చక్కని భాషాపరిజ్ఞానముతో లక్ష్యమును నిర్దేశిస్తూ శ్రోతలను ఉద్దేశించి అనర్గళమైన ఉపన్యాసమును చెప్పాలి తప్ప 'తెత్తెత్తె మెమ్మెమ్మె' అని నసిగితే నాకు విలువ ఉండదు. వచ్చినవారు నవ్విపోతారు. కేవలం వేషముతో పని నడవదు. కానీ అది అవసరమా? కాదా? అవసరము. అద్భుతముగా మాట్లాడటం ఎంత అవసరమో అందుకు తగ్గ వస్త్రధారణ చేయటం కూడా అంతే అవసరము.

ఒక అభ్యర్థి ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్ళాడనుకోండి. ముందుగా 'అతను ఎలాంటి బట్టలను ధరించాడు? ఎలా ధరించాడు?' అనేది గమనిస్తారు తప్ప అందం గురించి పెద్దగా పట్టించుకోరు. కాబట్టి ఉద్యోగము కోసం వెళ్ళే అభ్యర్థి అందుకు తగ్గ వస్త్రధారణ నాకు ఉన్నదా? లేదా? అని బాగా గమనించు కోవాలి. నన్ను చూస్తే ఉద్యోగం ఇవ్వాలని అనిపిస్తోందా? లేక గూండాగా కనిపిస్తున్నానా? అని ఆ అభ్యర్థి తనను తాను పరీక్షించుకోవాలి.

వస్త్రధారణ మీ సభ్యతను కూడా తెలియజేస్తుంది. మీ సంస్కారమును చూపిస్తుంది. అందుచేత ఎక్కడికి వెళ్ళేటప్పుడు ఏ బట్టలు ధరించాలో ఆ బట్టలనే ధరించాలి. ఒక సైనికుని వస్త్రధారణ ఒకలాగా ఉంటుంది. ఒక వైద్యుని వస్త్రధారణ మరోలాగా ఉంటుంది. ఒక పండితుని వేషధారణ ఇంకొకలాగా ఉంటుంది. చేస్తున్న వృత్తి ననుసరించి వేషభాషలు ఉంటాయి. అలా ఉన్నప్పుడే సంఘములో మన్నన పొందుతాము.

**2. వపుష:** శరీర భాష లేక భంగిమ అనగా బాడీ లాంగ్వేజ్. ఇవాళ-రేపు ఎక్కడ చూసినా ఈ బాడీలాంగ్వేజ్ నేర్పిస్తామంటూ ఎన్నో కోచింగ్ సెంటర్లు వేల రూపాయిల ఫీజులు తీసుకుంటు న్నాయి. అసలు శరీరము ఉన్నవాడికి దాని గురించి వేరే చెప్పాల్సిన అవసరమేముంది అనేది ఒక్కసారి ఆలోచించండి. బాడీ లాంగ్వేజ్ అంటే ఎలా కూర్చోవాలి? ఎలా నుంచోవాలి? ఎలాంటి పరిస్థితులలో, ప్రదేశములలో నీ శరీర భంగిమ ఎలా ఉండాలి? ఇత్యాది విషయములకు సంబంధించిన శాస్త్రము. దీనినే సంస్కృతములో 'వపుషా' అని వేల సంవత్సరముల నాడే మన పెద్దలు చెప్పారు.

నీ ఎదుట పెద్దలు ఉన్నారు. అప్పుడు కాళ్ళు-చేతులు ఊపుతూ, శరీరమును కదలిస్తూ, వంకర్లు తిరుగుతూ కూర్చో కూడదు. అలా కూర్చుంటే అది నిర్లక్ష్యమును సూచిస్తుంది. చక్కగా నిటారుగా, వినయముతో కూర్చోవాలి. అప్పుడు పెద్దలు

నిరంతరం కష్టపడేందుకు నడుం బిగిద్దాం

'పిల్లవాడు వినయశీలి, మర్యాద తెలిసినవాడు' అని మెచ్చుకుంటారు. ఈ కాలం కుర్రాడిలా లేదు. చక్కని సంస్కారముతో, పద్ధతిగా, క్రమశిక్షణతో పెరిగాడు అని ప్రశంసిస్తారు. వయస్సులో ఉన్న కుర్రకారు ఇలా ఉంటే ఆడపిల్ల గల ఏ తండ్రైనా పిల్లనిస్తామంటూ ముందుకొస్తాడు. ఉద్యోగానికి వెళితే యజమాని 'ఈ కాలపు కుర్రాడిలా లేదు. పద్ధతిగా ఉన్నాడు' అని చెప్పి తన సంస్థలో చేరమంటాడు. ఈకాలపు యువతగా లేకపోవటమనేది ఒక అర్హతగా మారింది గమనించండి. అదీ విచిత్రము. ఎందుకంటే ఇచ్చేవాడు పూర్వపు రీతినీతులను ఎరిగినవాడు. కావున అతనికి అలాంటి సభ్యత గల అభ్యర్థియే నచ్చుతాడు. ఉద్యోగం ఖాయమౌతుంది.

'వపుష' అని సంస్కృతములో చెపితే 'మందబుద్ధి' అని ఎగతాళి చేస్తారు. 'బాడీ లాంగ్వేజ్' అని ఆంగ్లములో చెపితే అది విజ్ఞానము. నేడున్న ఈ ఆలోచనావిధానము తప్పు. భాషను బట్టి భావము ఉండదు కదా! కనుక ఈ ఆలోచనాశైలిని మార్చుకోవాలి. ఇంగ్లీష్ అంటే గొప్ప-సంస్కృతము అంటే పాతచింతకాయపచ్చడి అనే ఆత్మన్యూనతా భావన పోగొట్టుకుని మన వేషభాషల యందు, సభ్యత-సంస్కృతుల యందు అపారమైన శ్రద్ధ, గౌరవము పెంపొందించుకోండి. ఒకప్పుడు జగద్గురుపీఠం మీద ఆసీనురాలైన భూమి మనది. తిరిగి ఆ సింహాసనము మీద ఆమెను ప్రతిష్ఠించాలి మనం.

మీ వేషం బావుంది. మీ వపుష అంటే మీ శరీర భంగిమ అనగా కూర్చునే, నిల్చునే... కదలికలన్నీ బావున్నాయి. ఇక మూడవది మాటామంచి.

**3. వాచా:** అనగా మాట్లాడే తీరు. ఇది గనుక బావుంటే ఉద్యోగం ఇస్తారా? ఇవ్వరా? తప్పకుండా ఇస్తారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా మాట్లాడే పద్ధతి నేర్పించటానికి ఎన్నో కోచింగ్‌సెంటర్లున్నాయి. వాటికన్నా కూడా నువ్వు చదువుకున్న తెలుగు లేదా సంస్కృత పాఠ్యపుస్తకములలో, ఇంటిలో నేర్చుకున్న క్రమశిక్షణలో ఎవరితో ఎలా మాట్లాడాలో నీవు నేర్చుకున్నావు కదా? మాటల ద్వారా నీలోని సంస్కారము, తెలివి, పద్ధతి, శైలి, వ్యవహారము, నీ పృష్ఠభూమి ఏమిటి? ఇత్యాది విషయములను ఎదుటివారు నిశితముగా గమనిస్తారు. అందుకనే అవసరమైతే పరిస్థితులను చక్కబెట్టగల తెలివి, సమయస్ఫూర్తి ప్రదర్శించగలగాలి. నిజము చెప్పాలి. చెప్పదలచుకున్న విషయమును సూటిగా, మధురముగా, చక్కగా, అర్థమయ్యే రీతిలో సుస్పష్టముగా చెప్పగలగాలి. అంతేకాకుండా ఎదుటివారికి మనం గర్విష్ఠి అనే భావన కలుగకుండా వాక్కును ప్రయోగించాలి. ఇతరులకు వారు నొచ్చుకోకుండా, అపార్థము చేసుకోకుండా చక్కని శైలిలో నిజము చెప్పగలిగే నేర్పు ఉండాలి.

కావ్యము, కవిత్వము ఎలా ఆలోచిస్తాయో స్త్రీ అలా ఆలోచిస్తుంది. కనుక స్త్రీ అంటే కవిత్వమే. కవిత్వము సున్నితముగా ఉంటుంది. ఆడవాళ్ళు కూడా సున్నితముగా ఆలోచిస్తారు, చేస్తారు. సంగీతము, సాహిత్యము, చిత్రలేఖనము, శిల్పము... ఇవి స్త్రీని ప్రతిబింబిస్తాయి. ఈ కళలన్నీ స్త్రీ స్వరూపము! పురుషుడు శాస్త్రస్వరూపుడు! అందుకే కళాశాలలో ఆర్ట్స్ అండ్ సైన్స్ అని రెండూ ఉంటాయి. కళ-శాస్త్రము రెండూ ముఖ్యమే మనిషికి. శాస్త్రము సూర్యకాంతి లాంటిది. కళ చంద్రకాంతి వంటిది. సూర్యునిది తీక్షణత, వాడి. చంద్రునిది కోమలత్వము, సున్నితత్వము. రెండూ జీవితానికి అత్యంత ఆవశ్యకమైనవే. మాట ఒక్కొక్కసారి తీక్షణముగా, వాడిగా ఉండాలి. మరొకసారి సున్నితముగా, మృదు మధురముగా, హాయిగా ఉండాలి.

ఉద్యోగము చేస్తున్నప్పుడు మాటలలో నిజాయితీ తొంగి చూడాలి. ఇంట్లో ఉన్నప్పుడు మాటల ద్వారా ఆప్యాయత వెల్లివిరియాలి. లోకం పోకడ చూస్తే ఎక్కడ, ఎవరితో ఎలా మాట్లాడాలో తేటతెల్లమౌతుంది. లేదంటే కష్టమే. కటువైన మాటలవలన యుద్ధాలు సంభవిస్తాయి. తేడాలు తలెత్తుతాయి. మనుషులు విడిపోతారు. అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. అలాకాకుండా తియ్యగా మాట్లాడితే విడిపోయిన మనస్సులు కలుస్తాయి, సమస్యలు మబ్బుల్లా తేలిపోతాయి, వైరిభావన తొలగిపోతుంది. మాటల ద్వారా మనిషి జీవితము ప్రతిక్షణము ప్రభావితమవుతుంది కనుక మాట్లాడేముందు జాగ్రత్తగా ఆలోచించుకుని, తెలివితో మాట్లాడాలి. అదొక కళ! విద్య ద్వారానే మాట్లాడటము నేర్చుకోవాలి. బడిలో, కళాశాలలో, పెద్దల ద్వారా, పరిస్థితుల నుండి విద్యార్థి అనేవాడు ఎలా మాట్లాడాలో నేర్చుకుని, ఆచరణలో పెట్టుకోవాలి.

**4. విద్య:** విద్యకు సంబంధించిన యోగ్యతాపత్రము నువ్వు కష్టపడి చదువుకుని సంపాదించుకోవాలి. ఆ ధృవీకరణ పత్రం లేకుండా ఎవ్వరూ ఉద్యోగం ఇవ్వరు. తెలివి ఒక్కటే ఉద్యోగం సంపాదించిపెట్టదు. తప్పకుండా ఒక విద్యలో మేటిగా నిలిచి

**అదనపు శ్రమ ఎన్నడు వృథాకాదు, మెరుగైన ఫలితాలు వస్తాయి**

యోగ్యతా పత్రమును సంపాదించిననాడే సమాజములో గౌరవ మర్యాదలు పొందటంతో పాటు, పెద్ద ఉద్యోగమును పొందే అర్హతను సాధిస్తాము. చిన్ననాడు బడిలో పాఠాలు బాగా ఒంట బట్టించుకుని విషయము మీద సాధికారతను సాధించాలి. విద్యార్థి నేర్చుకోవలసినది ఒక్క పాఠ్యాంశములే కాదు. జ్ఞాన వంతుడు అవ్వాలి.

విద్య మనిషిని మనిషిగా నిలబెడుతుంది. సంస్కారవంతుడిని చేస్తుంది. చక్కని పౌరునిగా తీర్చిదిద్దుతుంది. సమాజమునకు ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరునిగా తయారు చేస్తుంది. అందుచేత విద్యార్థి దశలో చదువు మీదనే దృష్టి కేంద్రీకరించాలి తప్ప పెడత్రోవ పట్టరాదు.

పాఠశాలలలో, కళాశాలలలో మనం సరస్వతీదేవి ప్రతిమను ప్రతిష్ఠించుకుంటాము. సరస్వతి అనగా ప్రవహించేది. స-రసవతి. సముద్రములో నుండి ఒక అల లేచి పైకెగసి తిరిగి సముద్రములో పడిపోతుంది. అలాగే మనం కూడా ఆ భగవంతుని నుండి పుట్టాము, తిరిగి ఆయన వద్దకు వెళ్ళి పోతాము. అయితే మధ్యన నువ్వు ఏమి సాధించావు? అనేది ముఖ్యము. ఒక వివేకానంద జీవించింది కేవలము 39 సంవత్సరములు మాత్రమే. జగద్గురు ఆదిశంకరాచార్యులవారు బ్రతికింది కేవలం 32 యేండ్లు. గణితశాస్త్రములో తిరుగులేని మేధావి రామానుజన్ ఉన్నది కేవలం 28 సంవత్సరములే! వారంతా మహానుభావులు. జీవించిన ఆ కొద్ది కాలములోనే ఎంతో సాధించారు. అద్భుతముగా జీవించారు. ప్రపంచమునకు ఆదర్శప్రాయముగా బ్రతికారు. ప్రతి విద్యార్థి అటువంటి వారి జీవితము నుండి ప్రేరణ పొంది ఏదో ఒకటి సాధించాలనే పట్టుదలను పెంచుకోవాలి.

విద్య ద్వారా విద్యార్థి ఒక లక్ష్యమును ఏర్పరచుకుని దానికోసం అహర్నిశలు శ్రమించాలి. ఆదర్శవంతమైన జీవితమును గడపాలి. విద్య వలన విద్యార్థి వినుతికెక్కాలి. అదే విద్య యొక్క పరమావధి. విద్యార్థి రత్నము వలె మెరవాలి. రత్నము దగ్గరకు మనిషి వెళతాడు గానీ-మనిషిని వెతుక్కుంటూ రత్నం రాదు. అలాగే బాగా చదువుకున్న విద్యార్థికి ఉద్యోగము అనాయాసముగా వస్తుంది. నీలో ప్రతిభ ఉంటే సమాజము తప్పకుండా దాన్ని గుర్తిస్తుంది, తనకు కావల్సిన రీతిలో ఉపయోగించుకుంటుంది. చదువు ఆపదలలో నిన్ను ఉద్ధరిస్తుంది. నీకు ధనము సంపాదించిపెడుతుంది. కీర్తి ప్రతిష్ఠలను కట్టబెడుతుంది. అందుచేత విద్యార్థి విద్యార్థి దశలో బాగా చదువుకోవాలి.

**5. వినయము:** ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి అని మన పెద్దలు అనాదిగా చెప్తూనే ఉన్నారు. తాము దానిని పాటిస్తూ పిల్లలకు కూడా నేర్పుతూ వచ్చారు. కానీ రోజులు మారాయి. పిల్లలు వినయము స్థానములో పొగరును చూపిస్తున్నారు. ఇది అన్నివిధాలా వర్జింపతగినది. మనకంటే పెద్దలు, విద్యావంతులు, సంస్కారవంతులు, ధనవంతులు, ధీరులు, శూరులు, మేధావులు... ఎంతోమంది ఉంటారు. వారిని గౌరవించాలి. వారియందు వినయముతో ప్రవర్తించాలి. ఎంత వినయముగా ఉంటే అంత మన్నన పొందగలుగుతాము. వినయశీలి అంతటా విజయమును సాధిస్తాడు. కానీ అతి వినయమును ప్రదర్శించరాదు. అతి వినయం ధూర్తలక్షణం. ఎవ్వరూ నిన్ను నమ్మరు.

ఈ 5 వకారములు విద్యార్థిని ప్రతిభావంతునిగా, సంస్కారవంతునిగా, యోగ్యునిగా, చక్కని పౌరునిగా, ప్రయోజకునిగా, ఆదర్శవాదిగా తీర్చిదిద్దుతాయి. అందుచేత వీటిని ఆచరణలో పెట్టుకుంటూ ఉజ్జ్వల భవిష్యత్తుకు రాచబాట వేసుకోండి.

*(మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావుగారి ప్రవచనం నుండి)*

*సంకలనం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి!
చదివించండి!!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


**కలలను సాకారం చేసుకోవాలంటే మనం ఎంతో కృషి చేయాలి**

# సామూహిక కర్మఫల వ్యవస్థ

మనం చేసే కర్మకు ఫలాన్ని మనం ఎలాగు అనుభవించ వలసివస్తుంది. కానీ ఆ ఫలాన్ని మనతోపాటు ఇతర ప్రాణులు కూడా అనుభవించవలసివస్తుంది. కర్మఫలం విషయంలో మనీషుల ఉపదేశం ఇది. మనిషి సామాజికంగా జీవించే ప్రాణి. పెక్కు నియమాలను అతడు సామూహికంగా పాటించ వలసి ఉంటుంది. కనుక-మన కర్మల ఫలం సముదాయానికి లభిస్తుంది. సముదాయం చేసే కర్మఫలములలో మనం కూడా భాగస్వాములం అవుతాం.

సామాజిక వ్యవస్థ వల్ల జనించిన దోషాల, శ్రేష్ఠకర్మల ఫలాన్ని వ్యక్తులందరు పంచుకుని అనుభవించవలసి ఉంటుంది. అయితే ఒక వ్యక్తి తాను చేసే కర్మల ఫలంలో అధిక భాగాన్ని తాను అనుభవించాలి. దానిలో కొద్దిభాగం మాత్రమే సముదాయానికి చెందుతుంది. ఇలా వ్యక్తి ప్రయోజనం సమిష్టిలోను, సమిష్టి ప్రయోజనం వ్యక్తిలోను ఇమిడి ఉంది.

ఈ నమ్మకం ఉండటం అవసరం. ఎందుకంటే-ఇందువల్ల పరస్పర ప్రేమ, విశ్వాసం, సమభావం జనిస్తాయి. మానవత్వం మరింత దృఢంగా పెంపొందుతుంది. కనుక-మనం స్వయంగా శ్రేష్ఠకర్మలలో నిమగ్నం కావాలి. దీనితోపాటు - శ్రేష్ఠకర్మలు చేయడానికి ఇతరులకు ప్రేరణ ఇవ్వాలి.

భూగోళంలోని ఒక భాగంలో కరువు వచ్చిందని అనుకుందాం. అప్పుడు వర్షాల కోసం యజ్ఞాలు మున్నగు శ్రేష్ఠకర్మలు జరుగుతాయి. అందువల్ల వర్షాలు కురిసి, ఆహారం అధికంగా ఉత్పత్తి అయితే - దాని ప్రయోజనం అందరికి కలుగుతుంది. యజ్ఞం చేసే వ్యక్తికి మాత్రమే ఆ అధికోత్పత్తి ప్రయోజనం లభించదు. అతడి శుభకర్మ వల్ల కలిగే ఫలం పరోక్షంగా అతడికి అందే మాట నిజం. అది ఈ జన్మలో అందవచ్చు. తర్వాతి జన్మలలో అందవచ్చు. ఒక వ్యక్తి అన్నసత్రం నిర్మిస్తే. ఆ మంచి పని వల్ల కలిగే ఫలితంలో కొద్ది కొద్ది భాగం ఆ సత్రంలో కొద్ది సమయం మకాం చేసేవారికి కూడా లభిస్తుంది. దాని పరోక్ష ప్రయోజనం సత్రం నిర్మించిన వ్యక్తికి లభిస్తుంది. ఏది ఏమైనా ప్రత్యక్ష ప్రయోజనం ఆ సత్రంలో మకాం చేసే వారికి అందుతుంది. ఈవిధంగా ఆ మంచి పని వల్ల కలిగే ఫలితంలో సామూహికమైన భాగం ఉన్నదని స్పష్టమవుతోంది.

విద్యాలయం, ఆసుపత్రి, బావి, చెఱువు, విద్యార్థుల వసతి గృహం, అన్నసత్రం, గోశాల, అనాథశరణాలయం వంటివి నిర్మించడం, ధర్మప్రచారం వంటి శుభకార్యాలు జరపడం- ఇవన్నీ ఆయా వ్యక్తులు ఆత్మకళ్యాణం కోసం జరిపేవే కావచ్చు. ఐతే వాటి ప్రయోజనం ఇతరులకు కూడా లభిస్తుంది. ఆ పనులు చేసే వ్యక్తి ఏ కులానికి, ఏ దేశానికి, ఏ సంప్రదాయానికి చెందితే దానిని కూడా ప్రజలు మెచ్చుకుంటారు. ప్రపంచంలో వివిధ సమయాలలో పలువురు మహాపురుషులు జన్మించారు. వారివల్ల ఆయా యుగాలకు, ఆయా దేశాలకు, సమాజాలకు కూడా కీర్తి లభించింది. శ్రీరాముని జన్మ వల్ల అయోధ్య ప్రతిష్ఠ, శ్రీకృష్ణుని జన్మ వల్ల మథుర ప్రతిష్ఠ పెరిగాయి. భగవద్గీత జ్ఞానం వల్ల ప్రపంచంలో భరతవర్షం గౌరవం పెరిగింది.

రైలుమార్గం, టెలిగ్రాఫ్, రేడియో, విద్యుచ్ఛక్తి, పారిశ్రామిక యంత్రాలు, విమానం, క్రొత్త ఔషధాలు మున్నగువానిని కొందరు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వాటి ప్రయోజనాన్ని మానవాళి అంతా పొందుతున్నది. ధర్మం, సదాచారం, అధ్యాత్మం, సహకారం, సహనశీలత, సంయమనం, సమానత్వం వంటి ఆదర్శాలను కొందరు మనీషులు ప్రతిపాదించారు, ప్రసారం చేశారు. ఆ ఆదర్శాలు మానవాళి ప్రగతికి ఎంతగానో దోహదం చేశాయి. స్వరాజ్యసమర నేతల, యోధుల, అమర వీరుల బలిదానాల ఫలితాన్ని నేడు భారతీయు లందరు స్వతంత్ర భారతదేశంగా అనుభవిస్తున్నారు.

వ్యక్తి చేసే మంచి పనుల ప్రయోజనాన్ని సమాజం పొందు తుంది. అలాగే అతడి చెడు పనుల ఫలితాన్ని కూడా ఇతరులు అనుభవించవలసివస్తుంది. బందిపోటుదొంగలు, చోరులు, జేబుదొంగలు తమ నేరాల వల్ల లక్షలాదిమందికి హాని కలిగిస్తారు. గుండాల దౌర్జన్యాల వల్ల అమాయక ప్రజలు ఎందరో బాధపడతారు. ముఱికి వ్యక్తులు ఎప్పుడు ఏదో ఒక రోగంతో బాధపడుతూ ఉంటారు. వారి రోగాలు ఇతరులకు సంక్రమించి పలువురిని కష్టనష్టాలకు గురిచేస్తాయి. వ్యసన పరులు, వ్యభిచారులు, త్రాగుబోతులు, జూదగాళ్ళు తమ చెడు అలవాట్లను మానసికంగా బలహీనులైనా ఇతరులైన పలువురికి నేర్పి సమాజాన్ని భ్రష్టుపట్టిస్తారు.

**మన సంకల్పానికి అగ్నిపరీక్షలు ఎదురవుతుంటాయి, వాటిని ఎదుర్కోవలసినదే**

వ్యక్తి ఒంటరివాడు కాదు. అతడు సమాజంలో ఒక అంతర్భాగం. కనుక అతడు చేసే మంచి చెడు పనుల ప్రభావం అతడికే పరిమితం కాదు. ఆ ప్రభావాన్ని సమాజం కూడా అనుభవించవలసివస్తుంది. కడుపులో నొప్పి వస్తే, దానివల్ల శరీర వ్యవస్థ అంతా దెబ్బతింటుంది. మెదడుకు జ్ఞానం, విద్య పుష్కలంగా లభిస్తే, ఆ జ్ఞానం వల్ల అన్ని అవయవాలకు సుఖం లభిస్తుంది. సమాజం అనే శరీరంలో వ్యక్తి ఒక అవయవం కనుక వ్యక్తి విషయంలోను ఈ ప్రక్రియ వర్తిస్తుంది.

కనుక – ఇతరుల మంచిచెడు పనులపై దృష్టిపెట్టడం ప్రతిమనిషి యొక్క కర్తవ్యం అవుతోంది. మా సంగతి మేము చూసుకుంటాం. ఇతరుల సంగతి మాకెందుకు–అనుకుంటే పని జరగదు. ఇలా ఆలోచిస్తే చెడ్డవాళ్ళను అడ్డుకునేవాళ్ళు ఉండరు. అందువల్ల వారి ఆగడాలు మితిమీరిపోతాయి. సమాజం విపరీతమైన కష్టనష్టాలకు గురి అవుతుంది. అలాగే –మంచివాళ్ళ పనులకు సహకారం, ప్రోత్సాహం అందక పోవడం వల్ల వారు హతాశులై చతికిలబడిపోతారు. వారి మంచి పనుల వల్ల కలిగే మేలు కొరవడిపోతుంది. వరదలు, భూకంపాలు, కరువులు, మహమ్మారులు, అతివృష్టి, అనావృష్టి, యుద్ధం వంటి దైవీప్రకోపాలు మానవాళి సామూహికంగా చేసిన పాపాలకు ఫలితాలని భావించబడింది. వీటివల్ల నిర్దోషులు సైతం నష్టపోతారు. వాస్తవానికి వారు నిర్దోషులు కారు. సామూహిక దోషాలను తొలగించుకోకపోవడం – ఇది కూడా పాపమే. ఈ దృష్టితో చూసినప్పుడు వారు నిర్దోషులు కారు. **సామూహిక దోషాలను తొలగించడానికి, తగ్గించడానికి ప్రయత్నించకపోవడం, వాటిని పట్టించుకోకపోవడం – ఇది కూడా పాపమే. ఈ దృష్టితో చూచినప్పుడు నిర్దోషులుగా కనిపించే వ్యక్తులు సైతం దోషులని ఋజువవుతుంది. వారు సామూహిక శిక్షలో భాగస్వాములు కావలసివస్తుంది.**

ఒక నగరంలో భారీ ఎత్తున అల్లర్లు జరిగితే ప్రభుత్వం ఆ నగర పౌరులందరికీ సామూహికంగా జరిమాన విధిస్తుంది. నిర్దోషుల నుండి కూడా జరిమానా వసూలు చేస్తారు. తమ పేటలో అల్లర్లు జరిగినా వాటిని అడ్డుకోవడానికి ముందుకు రాకపోవడం, పిరికితనం చూపడం, శాంతిస్థాపనకు ప్రయత్నిం చకపోవడం వారు చేసిన తప్పని, కనుక వారు నేరస్థులని అందుకు కారణం చూపుతారు.

సమాజంలో జరిగే చెడ్డపనులను అడ్డుకోవడానికై పరమేశ్వరుడు ఇలాంటి సామూహిక బాధ్యతను ప్రతి వ్యక్తికి అప్పగించాడు. అవినీతి ఎక్కడ జరిగినా దానిని అడ్డుకోవడం, దానిని తగ్గించే ప్రయత్నం చేయడం, దానిని ప్రతిఘటించడం, దానికి సహాయనిరాకరణ చేయడం వ్యక్తికి కర్తవ్యం అవుతోంది. ఇందుకు తనకు వీలైన పద్ధతిని అతడు అనుసరించవచ్చు. కనీసం అతడు చెడ్డపనికి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సహాయం అందించకూడదు. చెడ్డ పనులను ఎన్నడు పొగడ కూడదు, వాటిని నిందించాలి, వ్యతిరేకించాలి, ప్రతిఘటించాలి.

అలాగే–మంచిని సమర్థించడానికి, సజ్జనులను గౌరవించ డానికి, ప్రోత్సహించడానికి మనలో ప్రతి ఒక్కరు ఎంతో కొంత పనిచేయాలి. ప్రజలకు ప్రయోజనం కలిగించే అలాంటి పనులకు సాధ్యమైనంత సహకారం అందించాలి. కనీసం వాటిని మెచ్చుకోవడం అత్యవసరం.

మనమంతా వేర్వేరు వ్యక్తులం అయినప్పటికి ఒక సమాజంలో అంతర్భాగాలము. ఒకే పడవలో కూర్చొని ఉన్నాము. ఒక వ్యక్తి పడవకు రంధ్రం చేయడానికి ప్రయత్నిస్తే దానిని అడ్డుకోవడం ఇతర ప్రయాణీకుల కర్తవ్యం. ఎందుకంటే పడవకు రంధ్రం ఏర్పడితే అందరి ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. సామాజిక సువ్యవస్థను, ధార్మికమైన కట్టుబాట్లను మనం స్వయంగా పాటించడంలోను, ఇతరుల చేత పాటింప జేయడంలోను మనం ఈ దృక్పథాన్నే అవలంబించాలి.

★★★

## సమృద్ధి మాత్రమే జీవన లక్ష్యం కాకూడదు

*అవినీతితో పొందిన సంపాదన వలన దుష్ప్రవృత్తులు అధికమవుతాయి. నీతిపూర్వకంగా పొందిన సంపదను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టడానికి ఎవరు సాహసించరు. సులభంగా, కష్టపడకుండా సంపాయించిన సొమ్ము సద్వినియోగం చేయడం చాలా అరుదు. కానీ వీరి జీవిత విధానాన్ని చూసి అనేకమంది ఏదోవిధంగా డబ్బు సంపాయించాలని చేయకూడని పనులు చేస్తుంటారు. ఇలాంటివారివలన సమాజం భ్రష్టుపడుతుంది. అందువలన సమృద్ధి మాత్రమే జీవనలక్ష్యం అవకూడదు.*

*– అనువాదం: ముక్కామల రత్నాకర్*

**ఓటమిని అంగీకరించడం కూడా నేర్చుకోవాలి, అప్పుడే విజయం వరిస్తుంది**

# ప్రేమతోనే కుటుంబములో సంతోషము వెల్లివిరుస్తుంది

ఈ భూమి మీద స్వర్గము అనేది ఎక్కడన్నా కనబడుతుందీ అంటే అది నవ్వుతు-తుళ్ళుతు, ఆడుతు-పాడుతు సంతోషముతో సాగిపోయే పరివారములోనే కనిపిస్తుంది. అలాగే ఈ పృథ్వి మీద నరకము అనేది ఎక్కడన్నా కనబడుతుంది అంటే అది కూడా దుఃఖముతో తల్లడిల్లే కుటుంబములలోనే గోచరిస్తుంది. కుటుంబ జీవనము ఎలాంటిదంటే దానిని స్వర్గము వంటి ఆనందమయ పరిస్థితులలోకి మార్చుకొనవచ్చును లేదా నరకము వంటి కష్టభూయిష్టమైన పరిస్థితులలోకి కూడా నెట్టుకో వచ్చును. గృహలక్ష్మి అని పిలువబడే ఇంటి ఇల్లాలు కావాలను కుంటే ఇంట్లో సంతోషములను తీసుకురాగలదు లేదా ఆ ఇంటి నుండి ఆనందమును హరించివేయగలదు. కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని ఇతరులతో చక్కగా వ్యవహరిస్తూ ఆ ఇంట్లో ప్రేమ, ఆనందము, ఇంకా మనమంతా ఒక్కటే అనే మంచి భావనలు గల గంగ ప్రవహించేటట్లు చేయగలరు లేదా ఈర్ష్య, ద్వేషము, అసూయ అనే మురికి నీటినీ పారించగలరు.

కుటుంబసభ్యులందరినీ ఒక్కటిగా చేసి నిలుపగలిగేది చక్కని సంస్కారములు మాత్రమే. ఆదర్శములు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయి. కుటుంబము అంటే దానికి కొన్ని ఖచ్చితమైన నియమములు, పద్ధతులు, క్రమ శిక్షణ, కట్టుబాట్లు ఉంటాయి. అవన్నీ మనిషిని దారితప్ప నివ్వవు, లక్ష్యము నుండి దూరం కాకుండా కాపాడతాయి. అంతేకాకుండా జీవితమును అందముగా జీవించే రీతిని-నీతిని నేర్పిస్తాయి. గృహం యొక్క శుభములను దృష్టిలో పెట్టుకుని ఆ ఇంటికి కొన్ని ఆరోగ్యవంతమైన పరంపరలు, రీతి-రివాజులు నిర్దేశించ బడి ఉంటాయి. అవన్నీ కూడా ఆ కుటుంబమును పైకి తీసుకొస్తాయి. వారికి మేలు చేకూరుస్తాయి.

ఏ ఇంట్లో అయితే నిత్యం గొడవ-కొట్లాట, మాటకు మాట ఎదురుచెప్పుకుని అల్లరీ ఆగం జరుగుతుంటుందో, ఏ ఇంట్లో అయితే ఎవ్వరూ ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నము చేయరో, ఏ ఇంట్లో పరిజనులు ఇతరులకు కష్టమును, బాధను తెచ్చిపెడుతూ, దుఃఖమును కలిగించుటలో ఆనందమును పొందుతుంటారో ఆ ఇంట్లో ఎట్టి పరిస్థితులలోనూ స్వర్గము అనేది ఎప్పటికీ ఉండదుగాక ఉండదు. ఏ ఇంట్లో అయితే కుటుంబసభ్యులు కష్టములను అనుభవిస్తుంటారో, వ్యథను సహిస్తుంటారో, దుఃఖముల బారిన పడుతుంటారో ఆ ఇంటిని నరకము అని అంటారు.

అయితే నవ్వుతూ-తుళ్ళుతూ సంతోషముగా ఉండే పరివారము వేరేగా ఉంటుంది. ఆ ఇంట్లో అందరు ఒకరి నొకరు గౌరవించుకుంటారు. ఒకరితో మరొకరు ప్రేమతో మెలగుతారు. వారిలో అందరు తనవారే అనే భావన ఎంతలా ఉంటుందంటే వారందరు తమ కుటుంబసభ్యులకు సహాయము చెయ్యడము కోసము ప్రతిక్షణము సిద్ధంగా ఉంటారు. తమకు వీలైనంత చేయూతను ఇస్తుంటారు. ఆ ఇంట్లోని వారందరి లోనూ ఇంకొకళ్ళ దగ్గర నుండి తీసుకోవాలి అనికాక; ఇవ్వాలి అనే భావన ఎక్కువగా ఉంటుంది. కుటుంబీకులందరిలోను ఎంతప్రేమ ఉంటుందంటే వారు ఇతరులను సంతోషపెట్టడానికి, ప్రసన్నముగా ఉంచటానికి నిరంతరం కృషి చేస్తుంటారు. బాధ, కష్టము, వ్యథలలో ఒకరికొకరు తోడుగా నిలుస్తారు. 'నేను ఒంటరిని' అనే భావన ఆ ఇంట్లో ఎవ్వరికీ ఉండదు. పైగా ఒంటరితనంలో కూడా నా కుటుంబసభ్యులందరు నాకు తోడుగా ఉన్నారు అనే ఆలోచన ఉంటుంది. అందరి ముఖాల లోనూ ఆనందం వెల్లివిరుస్తుంటుంది. అందరి మనస్సులలోను సంవేదనలు ఉప్పొంగుతుంటాయి. మేమందరము ఒక్కటే అనే భావన అందరి మనస్సులలోను ఉంటుంది.

ఇటువంటి ఇంటిలో ఆనందసాగరాలు వెల్లివిరుస్తాయి. పరిజనులంతా ఇంటి కట్టుబాట్లను, క్రమశిక్షణను పాటిస్తుంటారు. పెద్దలను గౌరవిస్తుంటారు. చిన్నపిల్లలకు ప్రేమను పంచు తుంటారు. మంచి మంచి సంస్కారాలను అందరు స్వీకరించి ఆచరణలో పెడతారు. ఎవ్వరు వాటిని ఎగతాళి చెయ్యరు. ఎప్పుడైనా పొరపాటుగా మనస్పర్ధ తలెత్తినా సమస్యను అర్థం చేసుకుని, అపార్థాలు తొలగించుకుని ముందుకు సాగుతారు. ఏదైనా పెద్ద పని ఉందంటే కుటుంబసభ్యులందరు తలోచెయ్యివేసి ఆ పనిని పూర్తిచేస్తారు. ఎవ్వరిమీదా ఈర్ష్య, ద్వేషం చూపించరు సరికదా వాటి వ్రేళ్ళను సమూలంగా

**కష్టం వస్తే కదా గుండెబలం తెలిసేది**

పెరికిపారేస్తారు. పెద్దలు తమతమ బాధ్యతలను సక్రమముగా నిర్వరిస్తుంటారు. చిన్నవారు పెద్దల మాటను వింటారు. పెద్దవారి నిర్ణయాలను గౌరవిస్తారు. అలాగని పెద్దల మాటలు పిన్నలకు బంధనముగానో లేక వివశతగానో అనిపించవు. చిన్నవారు కూడా తమ తమ అభిప్రాయములను, నిర్ణయములను ప్రకటించగలిగే స్వేచ్ఛ కలిగి ఉంటారు. ఇంత చక్కని భావనలు, ఆదర్శములు ఉన్న కుటుంబమే ఈ భూమి మీద స్వర్గము అని పిలువబడుతుంది. ఆ ఇంట నిజముగా స్వర్గమే ఉంటుంది. అంత మంచి ఇంటి నుండి బయటకు వెళ్ళాలని అనిపించనే అనిపించదు అందరికి. పరివారములోని వాతావరణము కూడా సకారాత్మకము (పాజిటివ్)గా అనగా మంచిగా ఉంటుంది.

ఒకప్పుడు మన దేశములో ఉమ్మడికుటుంబాలకు ఎక్కువ ఆదరణ ఉండేది. కానీ ఇప్పుడు చిన్న కుటుంబాలు అనగా తల్లితండ్రి–వారి పిల్లలు మాత్రమే ఉండే కుటుంబవ్యవస్థ శరవేగముతో అభివృద్ధి చెందుతున్నది. దీనికి కారణము ఏమిటంటే ఎవ్వరు కూడా మరొకరితో కలిసి ఉండాలని అనుకోవటము లేదు. పెద్ద కుటుంబ భారమును తలకెత్తుకోవాలనుకోవటం లేదు. అసలు వీరంతా ఒకే ఇంటి కుటుంబ సభ్యులు అవునా? కాదా? అన్నంతగా వారిలో ఒకరి పట్ల మరొకరిలో ఈర్ష్య, ద్వేషం, మనస్పర్ధలు ఉంటున్నాయి. నిజం చెప్పాలంటే తమ కుటుంబంలోనివారితోకంటే వేరొక ఇంటిలోని మనుష్యులతోనే చాలా బాగా మాట్లాడుతుంటారు, వారికే ఎంతో సహాయము చేస్తుంటారు. తమ ఇంటిలోనివారితో ఎంత శత్రుభావనతో ఉంటున్నారంటే అసలు పరులతో కూడా అంతటి శత్రుత్వము ఉండదేమో అని అనిపిస్తుంది. కుటుంబాలు ముక్కలు చెక్కలు అవుతున్నాయి. భూ సంపద అనగా తోటలు, పొలాలు, ఇళ్ళు వంటి స్థిరాస్తి, డబ్బుదస్కం, నగలు వంటి అంశములు ప్రజలను ఒక్కటిగా ఉంచలేకపోతున్నాయి. ఒకరికి ఒకరు సహాయపడటానికి ఇవన్నీ అడ్డుపడుతున్నాయి. వీటి కారణముగా ప్రజలు ఒకరితో ఒకరు కలహించుకుంటున్నారు, గొడవపడుతున్నారు, వేరు కాపురం పెట్టి విడిగా ఉండాలనుకుంటున్నారు.

కుటుంబ కలహాల కారణముగా ఎన్ని కుటుంబాలు విడిపోయాయో, ఎంతమంది రవ్వంత గూడు కూడా లేకుండా వీధిన పడ్డారో చెప్పలేము. ఎంతోమందిని హత్య కూడా చేసిన సంఘటనలు ఉన్నాయి. ఎంతమందికి వీటి కారణముగా శారీరిక, మానసిక బాధలు కలుగజేస్తున్నారో తెలియదు. ఈ చెడు పనులన్నింటికీ, చెడు భావనలన్నింటికీ కారణము ఆయా వ్యక్తుల యొక్క అహంకారము తృప్తిచెందకపోవటము, పిసినారితనము పట్టిపీడించటము. మనదేశములో రాజులు, మహారాజుల రాజ్యములు ఉన్నప్పుడు ఆయా దేశపు రాజులకు రాజ్యకాంక్ష ఎక్కువగా ఉండేది. ఆ అభీష్టం పూర్తవ్వటానికి తమ స్వంతవారి రక్తమును పారించటానికి కూడా సిద్ధపడేవారు. ఆదర్శములను ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవారు. మంచివారు, ఆదర్శవాదులు రాజకీయ కుట్రలకు బలైపోయేవారు.

రాజుల యొక్క రాజ్యములు అంతరించిపోయాక దేశములో ప్రజాస్వామిక ప్రభుత్వము ఏర్పడటము మొదలైనది. అయితే ఇప్పుడు ఇక్కడ కూడా రాజకీయంతో నిండిన కుట్రలు, కుతంత్రాలు రచించబడుతున్నాయి. నిజము చెప్పాలంటే వీరంతా కూడా ఏదో ఒక కుటుంబములోని సభ్యులే కదా! కానీ వీరంతా పెద్ద పెద్ద కోర్కెలను, ఆకాంక్షలను మనస్సులో పెట్టుకున్నవారే. వీరి జీవిత లక్ష్యము ఏమంత గొప్పగా ఉండదు. అందుచేత వారంతా సార్థకమైన (లక్ష్యం గల) పనులేవీ చెయ్యలేరు. ఇలాంటి వారు చేసే చెడ్డపనుల వల్లనే మన దేశము ఈనాడు ఇటువంటి దుఃస్థితిలో ఉన్నది.

లోభము, లాలస అనగా తీవ్రమైన కోరికను నెరవేర్చుకోవాలనే తపనయే ఇప్పుడు మానవుని జీవిత లక్ష్యముగా ఉన్నది. ఇలా ఉన్నప్పుడు అది రాజకీయరంగమైనా లేక ప్రజాస్వామ్యమైనా సమాజము ముక్కలుగా విడిపోయి, ఏ దిక్కు లేకుండా జనమంతా ఎవరికివారు తలోదారిలో జీవిస్తుంటారు. ఇటువంటి సామాజిక విషసమస్యను పరిష్కరించి, చక్కటి సమాజమును నిర్మించాలంటే ముందుగా కుటుంబ నిర్మాణముతో ఆ పనిని ప్రారంభించాలి. ఒకరితో ఒకరు ప్రేమగా ఉండటం, ఒకరిపట్ల మరొకరికి విశ్వాసము ఉండుట, పెద్దలను గౌరవించటము, చిన్నవారిని ప్రేమించటము వంటి గుణములే చక్కగా నవ్వుతూ, నవ్విస్తూ ఆనందముగా ఉండే మంచి కుటుంబ నిర్మాణమునకు పునాది వంటివి. ఈ సూత్రముల ఆధారముగానే సంతోషముగా ఉండే ఒక మంచి కుటుంబము నిర్మించబడుతుంది. అటువంటి గొప్ప పరివారం నుండి వచ్చిన సభ్యులే ఆదర్శప్రాయమైన సమాజమును సృష్టించగలరు.

*– అఖండజ్యోతి, జనవరి 2016*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**కష్టాలు మనుష్యులకు రాక మానులకు వస్తాయా?**

# సత్యయుగం సునిశ్చితముగా వచ్చి తీరుతుంది

చాలారోజులపాటు ఆకాశమును ఆవరించి ఉన్న మేఘములు తొలగిపోయిన తరువాత ఇవాళ వినీలాకాశమున తిరిగి నక్షత్రకాంతి మినుకుమినుకుమంటున్నది. అది బ్రాహ్మీ ముహూర్తము! మరికొద్దిసేపటిలో తెల్లవారుతుంది. పైగా చలికాలం అవ్వటం వలన ఇంకా చిమ్మచీకటి పరచుకునే ఉన్నది. పరమవందనీయ మాతాజీ మరియు పరమపూజ్య గురుదేవులను సందర్శకులంతా దర్శించుకుని నమస్కరించు కునేందుకు కేటాయించిన సమయము ఈ ప్రాతఃకాలమే! ప్రణామములు అర్పించబడే సమయమున వందనీయ మాతాజీ తమ గదిలో రోజు కూర్చునే ఆసనం మీదనే విరాజమానురాలై ఉంటారు. పూజ్య గురుదేవులను మాత్రము ఆ గది కిటికీ నుండి చూడగలిగేవారు. వంటగదికి ఒక మూలనున్న మెట్ల మీదుగా పైకివెళ్ళేవారు పరిజనులు. ఆరోజులలో పైకప్పు మీద ఇంకా మిద్దె నిర్మించబడలేదు. అందువల్లనే ఆ పైభాగమున నిలుచుండి చాలా సులభముగా అక్కడినుండి పరమపూజ్య గురుదేవులను దర్శించుకుని, ఆయనకు దూరం నుండే నమస్కరించే సౌభాగ్యము కలిగేది. తూర్పు తెల్లవారకముందే గురుదేవులు సోఫాలో కూర్చుని వ్రాతపనిలో మునిగిపోయి ఉండేవారు. శీతాకాలం కావటం చేత గురుదేవులు మోకాళ్ళ నుండి క్రిందకు ఒక కంబళిని కప్పుకుని మోకాళ్ళ పైన ఒక పాడ్‌ను ఒత్తుగా పెట్టుకుని కాగితముల మీద వ్రాస్తుండేవారు.

అలా ఏకాగ్రతతో వ్రాసుకుంటూనే మధ్య మధ్యన సందర్శకుల మీదకు అప్పుడప్పుడు దృష్టిని సారించేవారు. ఆ క్షణమున ఎవరిమీద నైతే పూజ్య గురుదేవుల కృపా దృష్టి ప్రసరింపబడుతుందో ఆ వ్యక్తి ఆరోజు లేదా జీవితము ధన్య మైనదని భావించేవాడు. ఈ సౌభాగ్యము దొరికినప్పుడు మనస్సు ఆనందంతో పులకించిపోయేది. అంతలోనే 'పూజ్య గురుదేవులు పిలుస్తున్నారు' అని వందనీయ మాతాజీ యొక్క కబురందినది. ఈ సందేశంతో పాటు ప్రణామములు అర్పించు కునేందుకు సాగే వరుస కూడా ముగింపుకు వచ్చింది. మాతాజీ వర్తమానం విన్న మీదట మనస్సు కొద్దిపాటి అలజడికి లోనయ్యింది. పరమపూజ్య గురుదేవులు అసలెందుకు పిలిపించారు? ఏదైనా పనిని గురించి కొన్ని సూచనలు ఇవ్వటానికైనా అయ్యుండాలి లేదా తానేదైనా తప్పు చేసుండాలి. గురుదేవుల సమక్షమునకు వెళ్ళి నిలబడినప్పుడు మనస్సులో రవ్వంత సందేహం మరియు భయం ఆవరించినాయి. పూజ్య గురుదేవులు సర్వాంతర్యామి అని తెలుసు. అందుచేత మనస్సు పరిపూర్ణముగా నిర్మలమై ఉండవలసినదే. ఆ కారణము చేతనే గురుదేవుల సమ్ముఖమునకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడి నప్పుడు మనస్సు తనకు తాను పరిపరివిధాల పరీక్షించుకుని, పరిశీలించుకునేది.

ఈరోజు కూడా కొంత అలానే జరిగింది. అయితే ప్రక్రియ ఎక్కువసేపు కొనసాగలేదు. ఎందుకంటే ప్రణామ-పంక్తి ముగియబోతున్నది. అంతేకాదు పూజ్యగురుదేవులను కలుసు కునేందుకు వీలుగా వందనీయ మాతాజీ ఆ ప్రక్కగా ఉన్న తలుపును తెరిచిపెట్టారు. మెట్ల గుండా పైకెక్కి గురుదేవుల గదిలోకి వెళ్ళేసరికి గురుదేవులు వ్రాతపనిని ముగించారు. పూజ్య గురుదేవులు ఎప్పటివలెనే ప్రసన్నవదనముతో దర్శన మిచ్చారు. పరమ పూజ్యగురుదేవులు సంతోషముగా ఉండట మును గమనించాక మనస్సుకు చాలా ఊరట కలిగినది. 'ఇక్కడ కూర్చో' అని గురుదేవులు మౌనంగా సూచించినారు. పూజ్య గురుదేవుల శ్రీచరణముల చెంతన కూర్చొనుట అన్నది తప్పకుండా గొప్ప సౌభాగ్యమని చెప్పితీరవలసినదే.

గురుదేవులు ఆసీనులైన సోఫాకు దగ్గరగా కూర్చున్న పిదప 'పుత్రా! ఈరోజు మేము మా క్రొత్త పుస్తకము యొక్క ముందు మాటను కూడా పూర్తిచేశాము' అని ప్రసన్నవదనముతో పలికారు. పుస్తకము వ్రాయుట మరియు దానికి పరిచయ వాక్యములు వ్రాయుట అన్నది గురుదేవులకు క్రొత్త విషయ మేమీ కాదు. అయితే ఎందుకనో తెలియదుగానీ గురుదేవులు ఈవేళ ఎక్కువ సంతోషముగా ఉన్నారు. దానికి గల కారణమును ఆయనే స్వయముగా తెలుపుతూ ఇలా అన్నారు. 'ఈసారి మేము ఏ పుస్తకము అయితే పూర్తిచేశామో అదెంతో ప్రముఖ మైనది, విశేషమైనది. అది మా జీవితం మరియు ఆలోచనల

**అందరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది**

యొక్క సారాంశము అని చెప్పవచ్చు. ఆ పుస్తకము పేరు 'సత్యయుగ పునరాగమనము!' ఆ పేరు ముమ్మాటికీ గురు దేవుల యావజ్జీవితము మరియు సంపూర్ణ ఆలోచనల సారం. పూజ్యగురుదేవులు తమ అన్ని సాధనలను, సమస్త ప్రయత్నము లను, మొత్తం రచనా వ్యాసంగం మరియు కార్యప్రణాళిక లన్నింటినీ సత్యయుగ పునరాగమనము కోసమే సాగించినారు అన్నది యథార్థము. 'సత్యయుగ పునరాగమనము!' ఇదే గురు దేవుల మహోజ్జ్వల జీవితము యొక్క మహోన్నత లక్ష్యము.

పూజ్య గురుదేవుల మాటలను విన్న తరువాత **'ఋషయః మంత్రద్రష్టాః'** అనగా ఋషి మంత్రద్రష్టయై ఉంటాడు అనే శాస్త్ర-వచనము మనస్సులో మెదలసాగింది. ఋషులకు త్రికాలదర్శిత్వముంటుంది. పూజ్య గురుదేవులు యుగఋషి!! యుగద్రష్ట!! యుగావతారులు!! ఆయన ఏది చెప్పారో, ఏది వ్రాశారో అదంతా నిశ్చయముగా ఆయన దర్శించినది మరియు అనుభూతి చెందినదై ఉంటుంది. సమయము వచ్చినపుడు అది జరిగి తీరుతుంది అనేది సత్యమని నిరూపించ బడుతుంది. ఈనాటి సంఘటనాక్రమం ఆ ఋషి వాక్కుకు సాక్షిగా ఉంటుందో ఉండదో కానీ కాలం మాత్రం తన కాలచక్రము తిరుగుతున్నప్పుడు సరైన సమయములో తప్పకుండా పరివర్తన తీసుకువస్తుంది. తత్ఫలితముగా యుగం యొక్క దశ-దిశ మార్పుచెందుతాయి. ప్రస్తుతం నడుస్తున్న కలియుగం కూడా కాలక్రమములో నెమ్మదిగా సత్యయుగంగా పరివర్తిన చెందుతుంది. ప్రత్యావర్తన జరిగితీరుతుంది. నమ్మకంతో నిండిన ఈ మనోస్థితితో పాటు మనస్సులో ఒక మూల 'అసలు సత్యయుగ పునరాగమన ప్రక్రియ ఏమై ఉంటుంది? ఎలా ఉంటుంది?' అనే చిన్న జిజ్ఞాస తలెత్తింది.

సంకోచం వలన ఈ ప్రశ్నను అడిగే సాహసం చెయ్యలేదు నేను. అయితే మనస్సును చదువగలిగే గురుదేవులు 'ఏదైనా అడగాలనుకుంటే నిస్సందేహముగా అడుగు!' అని అన్నారు. దానితో ధైర్యమును కూడగట్టుకుని మనస్సులోని సంశయమును గురుదేవుల ముందుంచాను. 'అసలింతకీ ఈ సత్యయుగ పునరాగమన ప్రక్రియ అంటే ఏమిటి?' 'చాతుర్యుగముల రహస్యమును ఎరుగుదువా నువ్వు?' అని ప్రశ్నించారు గురుదేవులు. నేను మౌనం వహించటంతో ఆయనే ఇలా వివరించారు. '1. సత్యయుగములో సత్వగుణ ఆధిక్యత ఉంటుంది. రజో, తమోగుణములు చాలాతక్కువగా ఉంటాయి. ఇందువలన సత్యయుగములో సత్వగుణానికను రూపముగా ప్రకాశము, పవిత్రత మరియు ప్రసన్నతలను వృద్ధిపరచే ఘటనాక్రమములు జరుగుతుంటాయి. 2. త్రేతాయుగములో సత్వగుణాధిక్యత కొంత తగ్గుముఖం పడుతుంది. రజోగుణం పెరుగుతుంది. అయితే తమోగుణం నామ మాత్రముగా ఉంటుంది. అందుచేతనే త్రేతాయుగమున ప్రకాశము, పవిత్రత మరియు ప్రసన్నతలలో కొంత తగ్గుదల రావటంతో పాటు ఇచ్ఛ, సంస్కారము మరియు సంఘర్షణ వృద్ధిచెందుతాయి. 3. ద్వాపరయుగములో సత్వయుగం తక్కువగా ఉంటుంది. రజోగుణంలో కూడా పెరుగుదల రావటంతో పాటు తమో గుణం కూడా నెమ్మదినెమ్మదిగా పెరుగుట ప్రారంభమవుతుంది. అందువలన ఇచ్ఛ, వాసన మరియు సంఘర్షణల క్రియాశీలత అధికమవుతుంది. తమోగుణ ప్రభావం చేత హింస, బాధించే తత్త్వము, క్రోధం కూడా వీటికి తోడవుతాయి. 4. కలి యుగములో తమోగుణము అధికముగా ఉంటుంది. సత్వ-రజోగుణములు నామమాత్రముగా ఉంటాయి. తమోగుణపు చీకటి మరింత గాఢమవ్వటం వలన వాతావరణములో దుష్కర్మలతో నిండిన పనులు కూడా మితిమీరుతాయి. రోగం, శోకం, సంతాపం, దూషిత ప్రవృత్తులు, కుకర్మలు తొలివరుసలో నిలుస్తాయి.'

'సత్యయుగ పునరాగమనము' కోసం తమోగుణం స్థానములో సత్వగుణం పెరగాలి. తమోగుణం తగ్గి సత్వగుణం అభివృద్ధి చెందాలి. ఇదంతా జరగటానికి సత్యయుగ పునరాగమన ప్రక్రియ రెండంచెలలో పరిపూర్ణమవుతుంది.' పరమపూజ్య గురుదేవులు తమ కళ్ళ ఎదురుగా యుగముల పరివర్తన-ప్రత్యావర్తన-ప్రవర్తన అను సంఘటనలు జరుగు తూండగా చూస్తున్నట్లుగానే అదంతా చెపుతున్నారు' అన్న రీతిలో ఉన్నది ఆయన చెప్పే విధానము. ఆయన కన్నులలో దివ్య ప్రకాశమున్నది. ఆ వర్చస్సు ముఖమండలమంతటినీ ప్రకాశింపజేస్తున్నది. గురుదేవులు ఇంకా ఇలా చెప్తున్నారు. 'సత్యయుగ పునరాగమనము కొరకు వ్యక్తిగత మరియు సామూహిక చేతన నుండి తమోగుణమును పారద్రోలుట అన్నది మొదటి అడుగు. ప్రవృత్తిలో తమోగుణపు ఆధిక్యతను దాదాపుగా నామమాత్రస్థితికి చేర్చుట. దానిని నియంత్రించుట.

**జీవితంలోని అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొన్నవాడే రాటుదేలుతాడు, విజేత అవుతాడు**

ఈ ప్రక్రియ సాగుతున్నప్పుడు గొప్ప ఉపద్రవమే జరుగుతుంది. పెద్ద పెద్ద ప్రాకృతిక విపత్తులు, వ్యాధులు, యుద్ధములు, సంఘర్షణలు, క్రొత్త క్రొత్త ఆపదలు ఒకదానితరువాత ఒకటి విరుచుకుపడతాయి. మనుష్యుల జీవితము కూడా గొప్ప సంకటములో చిక్కుకుంటుంది, సంఘర్షణల వలన జీవన స్థాయి దిగజారుతుంది. జీవుల మరియు ఔషధముల యొక్క ప్రజాతులకు కూడా ముప్పు వాటిల్లుతుంది.

ఇవన్నీ కలగలిసి ప్రథమ చరణం యొక్క ఈ ప్రక్రియ క్రొత్త క్రొత్త సంకటములను ఎదుర్కొంటూ తుదకు పరిపూర్ణ మవుతుంది. ఇంతవరకు చెప్పి గురుదేవులు ఏవో ఆలోచనల లోకి వెళ్ళి క్షణమాగి తిరిగి ఇలా అన్నారు – 'అధ్యాత్మ శాస్త్రములలో ఏదైతే చిత్తశుద్ధి అని చెప్పబడినదో ఈ ప్రక్రియలో అది మొత్తంగా పూర్తవుతుంది. అయితే తేడా ఏమిటంటే ఆధ్యాత్మిక సాధనలలో చిత్తశుద్ధి అన్నది వ్యక్తిగత ప్రయత్నము లతో మరియు స్వీయ సంకల్పం ద్వారా సాధించబడుతుంది. అంతే! కానీ ఇక్కడ మాత్రం సామూహిక స్థాయిలో ఇది నెరవేరుతుంది. వ్యక్తి, సమూహం, దేశ స్థాయిలో అంతా కూడా అసంకల్పితముగానే ఈడేరుతుంది. మహాకాలుని సంకల్పము దీనికొరకు కావలసిన సరంజామానంతా సమకూర్చిపెడు తుంది. ఈశ్వరుడే స్వయముగా దీనిని సంచాలితము గావిస్తాడు. వ్యక్తిగత ఇష్టాఇష్టాలతో నిమిత్తము లేకుండా అందరు అప్రయత్న ముగా ఈ మహాసంకల్పసిద్ధికై భాగస్వామ్యము వహిస్తారు. ఖచ్చితముగా ఇది కఠినమైనదే కాకుండా; కఠినాతి కఠినమైన ప్రయాణం అని చెప్పవలసినదే. ఈ ప్రణాళిక పూర్తయిన వెంటనే భూమిని ఆవరించి ఉన్న కారుచీకట్లు నెమ్మదిగా వాటంతటవే తొలగిపోతాయి.

ఈ భూమి మీద వెలుగు కిరణములు ప్రసరింపబడగానే కాంతులను వెదజల్లుతూండే ఉచ్చస్తరీయ లోకములతో ధరిత్రికి సంబంధము ఏర్పడటం జరుగుతుంది. అంతేకాకుండా పృథ్వి మీద ప్రకాశం వర్షిస్తుంది. ఇలా జరగటం మొదలవగానే చీకటి తనశక్తులతో పాటు పూర్తిగా వైదొలగిపోతుంది. రోగము, శోకము, సంతాపము, హానికరమైన కీటాణువులు, జీవాణువులు పూర్తిగా క్షీణించిపోతాయి. సుఖమయ వాతావరణము నిర్మించ బడుతుంది. ఇదంతా సుసంపన్నమవ్వటానికి ఉన్నత లోకములలో జీవించే తాపసులు, ఋషిగణము, మహా–ఆత్మలు భూమి మీదకు వేంచేసి కఠోర సాధనలు చేస్తారు. వారు చేసే తపో సాధనలతో ప్రకృతిలో సత్వగుణము పెంపొందుతుంది. అవని పైనున్న వాతావరణము ఈ ప్రయత్నముల ద్వారా సత్వ గుణముతో నిండిపోతుంది.'

'యుగపరివర్తనకు ఇదే ఆధారముగా నిలుస్తుంది. ఈ ప్రణాళిక ద్వారానే సత్యయుగ పునరాగమనము సుసంపన్న మవుతుంది.' పరమపూజ్య గురుదేవులు ఈ మాటలు చెప్తున్నప్పుడు చీకటి తొలగి సూర్యభగవానుని అరుణ కిరణములు నెమ్మదిగా ఆకాశము నంతా ఆవరించసాగాయి. గురుదేవులు తమ మాటలకు ముగింపు పలుకుతూ 'ఈ సత్వ గుణ పెంపుతో మనుష్యులలోనే కాదు ఇతర జీవ–వనస్పతులలో ఇంకా చెప్పాలంటే సంపూర్ణ ప్రకృతిలో సకారాత్మక పరివర్తన వస్తుంది. ఇది భవిష్యత్కాలములో జరుగబోయే సునిశ్చిత సత్యము!' గురుదేవులు చెప్పిన భవిష్యవాణిని విని బయటకు వచ్చి చూస్తే సత్యయుగ పునరాగమన ఉద్ఘోష నిజమే అని తేటతెల్లం చేస్తూ సూర్యభగవానుడు తన కిరణముల ప్రచండ వర్చస్సును భూమ్యాకాశముల మీద వ్యాపింపజేయసాగాడు.

*– అఖండజ్యోతి, జనవరి 2015*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## సఫలత

*ఉన్నతికి కష్టములు, ఇబ్బందులు ప్రతిదిశలో ఉంటాయి. కష్టములతో సంఘర్షించకుండా ఒక్క సఫలత కూడా ప్రాప్తించదు. జీవితము యొక్క మహత్త్వపూర్ణమైన మార్గములు ఎల్లప్పుడు బాధలతో, విఘ్నములతో నిండి ఉంటాయి. భగవంతుడు సఫలతను కష్టాలతో జోడింపక పోతే, వాటిని సర్వసులభం చేస్తే, అది మానవజాతికి పెద్ద దౌర్భాగ్యమవుతుంది. తేలికగా లభించే సఫలతకు పెద్ద విలువ ఉండదు, దానిని ఉపేక్షిస్తారు. ఏ వస్తువయినా ఎంతో కష్టపడి సంపాదించినపుడు, దానికి ఎక్కువ విలువ ఉంటుంది. అలాగే ఎంతో ఎక్కువ ఖర్చు చేసిన తరువాత పొందిన వస్తువు కూడా చాలా ఆనందదాయకమవుతుంది.*

*– అఖండజ్యోతి, జనవరి 1999*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**కష్టాల వారధి దాటినవారికి అనంత నిధి లభిస్తుంది**

బోధ కథ

# అల్లాహ్‌కి విలువైన కానుక - రాబియా

ఆకాశంలో నల్లటి కారుమేఘాలు అలుముకొని బస్రా నగరాన్ని చీకటిలో చుట్టి వేశాయి. పట్టణ ప్రజలంతా గాఢ నిద్రలో మునిగి ఉన్నారు. అంతా భయంకర నిశ్శబ్దతతో నిండి ఉంది. గాలితోపాటు ఎండిన ఆకులు ఎగురుతూ, నిశ్శబ్దానికి తాళం వేస్తున్నట్లుంది. మధ్య-మధ్యలో కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రి సమయంలో 'రాబియా' గది మూలలో కూర్చొని ఏకాంతంలో, తన ప్రభువుని ఆరాధిస్తూ ఉంది. ఆమె ప్రార్థన స్వరం స్థూల నిశ్శబ్దాన్ని చీలుస్తూ, సూక్ష్మంలో ఏదో తెలియని గందరగోళాన్ని పుట్టిస్తున్నది. హృదయలోతుల నుండి వెడలి ప్రవహిస్తున్న ఆమె స్వరశబ్దంలో ఏ బాధ ఉందో, అది రాళ్ళను కూడా కరిగించే విధంగా ఉన్నప్పుడు ఇక మానవులను ఎందుకు ప్రభావం చేయదు?

రాబియాకి ఖురాన్‌లోని వాక్యాలను చదువుట, ఏకాంతంలో ప్రార్థించటమనేది ఆమెకు తీవ్రమైన అభిలాష. ఆమె ప్రార్థన ప్రారంభించగానే ఎంతో ఆశ్చర్యంగా వాతావరణంలో అద్భుత శాంతి నెలకొని ఉంటుంది. ఆమె నిత్యం అర్ధరాత్రి సమయంలో, ప్రజలంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు లేచి తనలోని దారుణమైన బాధను తన ప్రభు చరణాలకు అర్పిస్తుంది. కానీ ఆ బాధ ఉన్న కారణంగా ఆమె ఎటువంటి ఫిర్యాదు చేయటం కాని లేక ఏవిధమైన మొరపెట్టుట గాని ఎన్నడు చేయదు. రాబియా జీవితంలో బాధ యొక్క వరద పొంగిపోయి ఉంది. ఆమె ఇలా అంటూ ఉండేది. "నా జీవితంలో ఎంతగా దుఃఖ ముందంటే, దుఃఖమంతా ఒక్కచోటుకి చేరి గడ్డకట్టుకు పోయిందని..." చిన్నతనంలో ఆమెకు పరిసరాలను గ్రహించ గలిగే తెలివి ఉన్నప్పటి నుండి ఇప్పటివరకు ఆమె దుఃఖానికి అంతు లేకుండాపోయింది. ఇంకా చెప్పాలంటే నిత్యం ఏదో ఒక క్రొత్త రూపంలో దుఃఖం ఎక్కువ అవుతూనే ఉంది.

ఆమె ఒక అత్యంత బీద కుటుంబంలో జన్మించింది. ఇంటిలో తినుటకు ఒక్క అన్నపు మెతుకు కూడా ఉండేది కాదు. ఎన్నో రాత్రిళ్ళు అందరు తీవ్రమైన ఆకలికి తట్టుకోలేక కేవలం జలంతోనే సరిపుచ్చుకొనేవారు. చిన్నతనం నుండి ఆకలికి తట్టుకోవడం అలవాటైంది. కుటుంబంలో అమ్మ-నాన్న గాక ముగ్గురు అక్కలు కూడా ఉండేవారు. తండ్రి సంపాదన మీదనే కుటుంబమంతా ఆధారపడేది. అక్కలు పెద్దవారే... అయితే వారు బయటకు వెళ్ళి పనిచేయుటకు అనుమతి లేదు. నల్లటి-అకాల మృత్యువు తండ్రి ప్రాణాలను తీసుకొని పోయింది. ఆ రాత్రి వారి చిన్న గృహంలో స్మశాన-నిశ్శబ్దం తాండవమాడింది. దుఃఖపు మేఘాలు వారిని చుట్టిముట్టాయి. దుఃఖపు వరదలో అందరి నేత్రాలు నిర్జీవమయ్యాయి. కన్నీటి ధారలు ఎండిపోయాయి. రెండవ రోజు తండ్రిని సమాధి చేయుట జరిగింది.

చుట్టుప్రక్కలున్న సంబంధీకులు సాంత్వనలు పలికి వెళ్ళిపోయారు. ఎవరూ ఎవరితో మాట్లాడలేకపోతున్నారు. రాబియా తన పెద్దక్క వడిలో చేరి దుఃఖించసాగింది. అమ్మ పెద్దగా ఏడుస్తూ, తలను గోడకు బాదుకొని కూలబడిపోయింది. తలకు గట్టి దెబ్బ తగలటంతో ప్రాణాలొదిలింది. తండ్రి చనిపోయాడనే దిగులుతో కుములుతున్న మాకు కొండ విరిగి మీద పడినట్లైంది. మరుసటి రోజు అమ్మను కూడా సమాధి చేశారు. ఇంట్లో ప్రతిచోట అమ్మ-నాన్నల తీపిగుర్తులు తిరుగాడ సాగాయి. అంతే! ఇప్పుడు కేవలం ఆ గుర్తులే మిగిలిపోయాయి.

ఈ శోక సముద్రంతో ఏదోవిధంగా తన అక్కలతో కలసి రాబియా కాలం గడపసాగింది. నేడు మధ్యాహ్న సమయంలో రాబియా మామ ఒకాయన పిండివంటలతోపాటు మంచి భోజనం తీసుకొచ్చాడు. అమ్మ వెళ్ళిపోయిన తరువాత కొంత శాంతిని పొందారు. ఏదో కొద్ది సంతోషం అందరికి లభించింది. తెల్లవారక ముందు తలుపులను ఎవరో గట్టిగా బాదారు. ఏమి జరుగుతున్నదో తెలుసుకొనే లోపలే లోనికి జొరబడ్డారు. వారి చేతుల్లో కత్తులున్నాయి. వారి కళ్ళలో కర్కశత్వం మెరవ సాగింది. వారు మొత్తం నలుగురు. వారిలో ఒకడు రాబియాను బలవంతంగా లాగుతూ బయటకు తీసుకుపోయాడు. ఎవరూ ఎవరిని కాపాడలేకపోయారు. వారందరు భయంకర కేకలతో ఎంత అరచినా రక్షించుటకు ఎవరు ముందుకు రాలేదు.

రాబియా అనేది - నన్ను బయటకు లాక్కుపోయిన వ్యక్తి, ఒక ధనవంతుడైన షేక్‌కు నన్ను అమ్మివేశాడు. నా మిగిలిన అక్కల గతి ఏమైందో నాకు తెలియదు. నన్ను కొన్న షేక్ పరమ దుర్మార్గుడు. అతడు రోజంతా నా చేత పని చేయించుకొనే

**పరీక్షలలో గెలుపు ఓటములు సహజము**

వాడు. ఒకేసారి మూడు-నాలుగు పనులు పురమాయించేవాడు. ఆ పనులు పూర్తి చేయలేకపోతే చేతికి ఏది దొరికితే దానితో కొట్టేవాడు. దెబ్బలు తిని-తిని నేను స్పృహ తప్పేదాన్ని. భోజనం కూడా సరిగ్గా ఇచ్చేవాడు కాదు. ఒక సాయంకాలం అతడు నన్ను ఒక లోటాను విసిరికొట్టాడు. దాంతో నా తల పగిలి శరీరమంతా రక్తంతో తడిసిపోయింది. నాకు సహనం నశించిపోయింది. నేను ఆ రాత్రే అక్కడ నుండి పారిపోయాను. పారిపోయినా ఎక్కడికెళ్ళాలో నాకు ఎంతమాత్రం తెలియలేదు. అయితే నా అంతరాత్మ మాత్రం ముందు ఇక్కడి నుండి ఎక్కడకైనా వెళ్ళిపొమ్మని అంటున్నది. నేను షేక్ ఇంటిని వదిలే సమయంలో బయట ఎంతో చీకటితో ఉన్న రాత్రి సమయం, దారి ఎత్తు పల్లాలతో భయంకరంగా ఉంది. ఏదీ తెలియకుండా ఉన్నది. నా కాళ్ళు జారాయి. నేను క్రిందపడ్డాను. నా కుడి చెయ్యికి బాగా దెబ్బ తగిలి విరిగినట్లే భుజం నుండి వ్రేలాడసాగింది. బాధతో పెద్దగా అరిచాను."

అటువంటి దారుణ సమయంలో నుదురు నేలకు వంచి ప్రార్థించాను - హే! ప్రభూ! నా ఈ దుర్దశ గురించి ఎంత మాత్రం లెక్క చేయను. అంతేగాక జీవితం గురించి కూడా ఏ మాత్రం లక్ష్యపెట్టను. సుఖించాలనే కోర్కె కూడా లేదు. అయితే నా ఈ దుఃఖం నా తపస్సుగా మారాలి. అటువంటి కృపను నా మీద ప్రసరింపచేయండి. దుఃఖంలో బాధతో కేకలేయ కుండా, నిన్నే తలంచేవిధంగా ఉండేటట్లు నా మీద మీ కృప చూపండి. ఇదే నేను మీ నుండి కోరేది. ఇంతలోనే ఈ దారిలో ఎవరో ఒక సాధుపుంగవుడు వచ్చి నన్ను తనతోపాటు తన ఇంటికి తీసుకొనిపోయాడు. అతడు నాకు ఎంతో సహాయ పడ్డాడు.

కొంతకాలం తర్వాత రబియా మరొక షేక్ ఇంటిలో పనికి కుదిరింది. ఈ షేక్, మునుపటి షేక్ వంటి క్రూరుడు కాదు. పగలు పని ముగిసిన పిదప ఆమె అర్ధరాత్రి ప్రార్థన జరిపేది. నేడు అందరు నిద్రించిన తరువాత, అర్ధరాత్రి సమయంలో రాబియా లేచి, నిత్యంలాగానే ప్రార్థన చేయటం ప్రారంభించింది. ప్రార్థననేది హృదయపు శబ్దం. ప్రార్థన సమయంలో చేతన తన ఉన్నతస్థితిలో ఉంటుంది. అటువంటి సమయంలో అసంభవం సంభవమవుతుంది. చమత్కారాలన్నీ ఈ సమయం లోనే జరుగుతూ ఉంటాయి. రాబియా ప్రార్థన ఇంతటి శ్రేష్ఠత్వమును సంతరించుకొన్నట్టిది. ఆమె తన అంతరాత్మ లోతుల నుండి ప్రభువును పిలిచేది. ఆమె ఇలా ప్రార్థన చేసేది "హే ప్రభూ! నీ స్మృతి నా మనోఫలకం మీద ఎల్లప్పుడు చెరగని ముద్రగా నిలవాలి. నీ సేవలోనే నా ప్రతిక్షణం వినియో గించబడాలనేది నా తీవ్ర కోరిక. కానీ నేనొక వివసురాలైన అబలను... ఏం చేయను? తమరు నన్ను ఒక పరాధీనదాసీగా మార్చారు. అందువల్ల నేను సంపూర్ణ శరణాగతిని పొందలేక, మీ ఉపాసనను చేయుటకు కొట్టుకలాడుచున్నాను. హే ప్రభూ! ఇందుకు నా తప్పులను మీ ఉదార హృదయంతో క్షమించి, నాకు క్షమాభిక్షను ప్రసాదించండి"

షేక్ రాబియా చేయు ప్రార్థనను విని నిశ్చేష్టుడయ్యాడు. అతనికి విశ్వాసం కలుగుట లేదు. ఇంతటి అమాయకురాలు, ఏదీ తెలియని బాలిక ఇంతటి పవిత్ర, నిశ్చల హృదయం కలిగిందని... ఆమె భగవంతుని ద్వారా ఎన్నబడిన ఒక వరదానం వంటిదని గ్రహించాడు. షేక్‌కు తన మీద తనకే పశ్చాత్తాపము కలిగింది. ఇంత మంచి హృదయమున్న బాలికతో తాను పనిమనిషిగా పనిచేయించుకుంటున్నందుకు ఎంతో బాధపడసాగాడు. అతడు... రాబియా చరణాలకు సాష్టాంగ నమస్కారాలను అర్పించి గద్గద స్వరంతో, బరువెక్కిన హృదయంతో ఇలా అన్నాడు - "తమరు నా తప్పులను మన్నించండి. మీరు ఈ గృహంలో ఇక ముందు కూడా ఉండాలనుకొంటే యజమానురాలిగా ఉండండి. మేము తమరి సేవకులుగా ఉంటాము. ఒకవేళ అలా గాకుండా మరెక్కడకైనా వెళ్ళాలని కోరుకొంటే మీరు పూర్తి స్వతంత్రులుగా వెళ్ళవచ్చు" అందుకు రాబియా ఇలా అంది - "షేక్ సాహబ్! తమరు చింతించవద్దు... ఇది నా ధర్మమై ఉంది. యజమాని యొక్క అంగీకారంతోనే ఇదంతా జరిగింది. ఇప్పుడు నా యజమాని నన్ను ముక్తి చేయటానికి కోరుకుంటున్నాడు. అందువల్ల దయచేసి తమరు నన్ను ఇక్కడ నుండి వెళ్ళనివ్వండి.

రాబియా ప్రారబ్ధం ఇటువంటి చాలా కష్టాల నుండి దాటించింది. ఆమె ఈ సత్యాన్ని అర్థం చేసుకోగలదు. అక్కడ నుండి బయలుదేరిన రాబియా, జీవితాంతం కుమారీ వ్రతాన్ని పాటించింది. నిర్జన వనంలో చేరి ఎన్నో సంవత్సరాలు ధ్యానం, ప్రాణాయామం మొదలైన యోగాభ్యాసాలను ఆచరించింది. శేష జీవితాన్ని కఠోర తపశ్చర్యలో గడిపింది. కొంత సమయం ఆమె సత్సంగంలో గడిపేది. "హుస్సేన్" అనే ఒక మహాత్ముడు ఆ రోజుల్లో బస్రా నగరంలో ఉండేవారు. ఆమె వారి సత్సంగాలకు వెళ్ళేది. "రాబియా తపస్వికి ఎవరు తమ వారంటూ ఉండరు. వారు తమలో ఒంటరివారుగానే ఉంటారు. మహాత్మా

**ఓటమి ఎదురైతే కృంగిపోకూడదు**

హుస్సేనుల వారు ఇంకా ఇలా అంటున్నారు – "రాబియా నీ జీవితం తపంతోపాటు ప్రేమ యొక్క అద్భుత కలయిక. ఎప్పుడైనా ఒంటరిదాన్ననే అనుభవం కలిగిందా? నీ మనసులో 'నికామ్' (పెండ్లి) చేసుకోవాలనే ఉద్దేశ్యం కలిగిందా?" రాబియా చిరునవ్వుతో ఇలా అంది – "పెండ్లి అనేది దేహానికి అవుతుంది. శరీరముంటే "నికాహ్" ఉంటుంది. నా మనసైతే దేహంలో ముడుచుకుపోయింది. ఈ దేహం ఆ ప్రభువుకు ఏనాడో అంకితమైపోయింది. ఇక ఇప్పుడు నేను ఏ దేహంతో పెళ్ళి చేసుకోగలను." ఇది విన్న హుస్సేన్ నిరుత్తరుడయ్యాడు. సత్సంగం నడుస్తూ ఉంది.

ఎందువలనో ఈరోజు రాబియాకు కొద్దిగా జబ్బు చేసినట్లనిపించి ఈ సత్సంగంలో చేరలేకపోయింది. హుస్సేన్ మనస్ఫూర్తిగా రాబియాను గురించి ఇలా చెప్పాడు – "నేను రాబియా విషయంలో చాలా విని ఉన్నాను. అయితే ఆమెను కలసిన తరువాత నాకు అనుభవమైందేమంటే, ఏది విన్నానో అది నూరుశాతం కన్నా తక్కువే. రాబియా నిజంగానే అల్లాహ్‌కీ ఎంతో విలువైన కానుకే" రాబియా ఆరోగ్యం గురించి తెలుసు కొనుటకు హుస్సేన్ వచ్చాడు. ఆ తరువాత అబ్దుల్ ఉమర్, సుఫీయానా వచ్చారు. అందరు మౌనం వహించారు. ఆమె ఇలా అంటుంది – "నా ప్రభువుకు నా విషయం గురించి ఎందుకు తెలియదు. ఆయనకు నా గురించి అంతా తెలుసు. మంచి–చెడులన్నీ ఆయనకు అవగతమే! ఇప్పటి నా అనారోగ్య విషయం కూడా అవశ్యం పరిచయమయ్యే ఉంటుంది. నా అనారోగ్య పరిస్థితి కూడా ఆయన అంగీకారం పొందే ఉంటుంది. అలాంటప్పుడు ఆయన అంగీకారానికి విరుద్ధంగా నేను ఎందుకు ఆయనకు విన్నవించాలి. నేనంటాను ఒకవేళ ఈ వ్యాధితో నాకు మంచి జరిగేటట్లైతే నాకు మరికొంత వ్యాధిని ఇవ్వు ప్రభూ! అని ఆయనను ఇవ్వమని కోరగలను...!"

రాబియా దేన్నీ లెక్కచేయని ఫకీరులాగా తిరుగుతూ ఉండేది. హుస్సేన్ అనేవాడు. "రాబియా దేనిని లెక్కచేయదు. దేనిని లెక్కచేయకపోవటమంటే తన దేహం, దాని ఆవశ్యకత గురించి నిశ్చింతగా ఉంటూ, స్వతంత్ర రూపంలో భగవంతుని ధ్యాసలో మునిగి ఉండుట... నిర్లక్ష్యమనగా తామసిక వృత్తి, బద్ధకం, సోమరితనం కలిగి ఉండుటను నిర్లక్ష్యమంటారు. "రాబియా శారీరిక సంబంధంగా దేనిని లెక్కచేయకపోవటం గమనించిన ఒక ధనికుడు ఇలా అన్నాడు – "మేము తమకొరకు కొన్ని మంచి వస్త్రాలను చేయమంటారా?" అందుకు రాబియా ఇలా అంటుంది – "నేను ఒకవేళ కోరదలచుకుంటే, నేను నా ప్రభువునే కోరి ఉండేదానిని. ఈ లోకమంతా ఆయన సామ్రాజ్యమే. అందరకు అన్నీ ఇచ్చువాడు ఆయనే. మీరు కూడా ఆయననే కోరుకుంటున్నారు గదా! ఇలా కోరుకుంటున్న భిక్షగాని నుండి... నేనేం కోరేది? కోరితే ప్రభువు నుండే కోరాలి కదా!

రాబియా జీవితమంతా నిజమైన మనసుతో తన ప్రభువు మాటలే మాట్లాడుతూ ఉండేది. ఆమె నేత్రాలు మెరుస్తూ ఉండేవి. ఆమె వాణి నుండి ఒక శోభ వెలువడేది. ఈ విధంగా ఆమె జీవితమంతా కొనసాగుతూ ఉండేది. చివరిలో శరీరం వదల బోయే ముందు ఆమె తన ప్రభువు యొక్క ఆరాధన చేసుకుంటూ – "హే పరమాత్మా! ఒకవేళ నరక భయంతో నేను నీ ప్రార్థన చేస్తే కనుక నన్ను నరకంలోని అగ్నిలో దహించి వెయ్యి. లేక స్వర్గపు లోభగుణ కారణంతో నిన్ను తలచినట్లైన, అటువంటి స్వర్గం నాకు పాపకర్మ అవుతుంది. నేను కేవలం మీ కొరకే ఈ ఆరాధన చేస్తూ వచ్చాను కనుక తమరు నా మీద తమరి అపార కృపావర్షం నుండి వంచితురాలినిగా చేయకండి. ఇంతగా చెప్పిన మీద ఆమె శరీరం శిథిలమై ఒక ప్రక్కకు దొర్లింది. రాబియా పరమాత్మ సామ్రాజ్యంలో ప్రవేశిం చింది...

*– అఖండజ్యోతి, జనవరి 2011*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## స్వదేశీ ప్రేమ

*గుజరాత్‌లోని ఖేడాలో జరిగిన సంగతి. ఒక జపాన్ వ్యాపారి వచ్చాడు. ఆతడొకనాడు కూర్చొని లెక్కలు వ్రాసు కొంటున్నాడు. మధ్యలో అతని చేతిలోని పెన్సిలు విరిగి పోయింది. పని ఆగిపోయింది. ప్రక్కనే ఉండి గమనిస్తున్న భారతీయుడొకడు వేరే పెన్సిలు ఇచ్చాడు. జపానీ అది తీసికొనే ముందు దానిమీదున్న పేరును చదువుతున్నాడు. "మేడిన్ హాంగ్‌కాంగ్" అని వ్రాసి ఉంది. వెంటనే అది భారతీయుని చేతిలో పెట్టేశాడు. ఇది జపానులో తయారు కాలేదు. వద్దు. అన్నాడు. తరువాత జపానులో తయారైన పెన్సిలు తెచ్చుకున్నాడు. దానితోనే తన లెక్కలు వ్రాసు కున్నాడు. "విదేశీవద్దు – స్వదేశీముద్దు"*

– *అనువాదం:* పొన్నూరు హైమవతీశాస్త్రి


**గెలుపుకోసం ఓర్పుతో ఎదురుచూసేవారే విజేతలు అవుతారు**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# భారతీయ సంస్కృతి నిర్మాణక్రమంలో యజ్ఞం తండ్రియైతే - తల్లి గాయత్రీమాత

***పూజ్యగురుదేవులు ఆఫ్రికాదేశంలోని మొసాంబాలో ఇచ్చిన ఈ విశిష్ట ప్రవచనంలో యజ్ఞమును విపులంగా వ్యాఖ్యానించినట్లు అర్థమవుతున్నది. 'యజ్ఞంలో మనం సకల దేవతావాహన చేస్తాం. స్వచ్ఛమైన భావనలతో ఆహ్వానించబడిన చోట వారు తప్పక వస్తారు. దేవతలంటే స్వర్గంలో ఏదో ఒక ప్రత్యేకస్థానంలో కూర్చునుండరు. ఇవ్వటానికి అంగీకరించి మన వద్దకు వచ్చేవారే దేవతలు. సమాజము నుండి తాము స్వల్పముగా తీసుకొని-సమాజమునకు తాము అధికముగా తిరిగి ఇచ్చేవారే నిజమైన అర్థములో దేవతలు అనబడతారు. ఈ దృష్టితో చూస్తే కనుక యజ్ఞమనేది సమాజం పట్ల మనం ఋణమును తీర్చుకొనగలిగే ఒక మాధ్యమముగా అవుతుంది. అంతేకాదు ఈ ప్రక్రియ మన శరీరముతో మొదలుపెట్టి చూస్తే సకల ప్రకృతిలోను ఇదే వ్యవస్థ అమలవుతుంటుంది. ప్రతిది తీసుకొనటానికే అలవాటుపడి తిరిగి ఏమీ ఇవ్వకపోతే ఈ సృష్టి యావత్తూ చూస్తుండగానే నశించిపోతుంది' అని కూడా పూజ్యగురుదేవులు తమ ప్రవచనం ద్వారా తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం!***

యజ్ఞకార్యక్రమములో నేడు రెండవరోజు. భగవంతుడిని, దేవతలను వేదమంత్రముల ద్వారా ఆహ్వానించాము. దేవతలంతా విచ్చేశారు. పూలను ఆఘ్రాణించటానికి, బియ్యం – నెయ్యి స్వీకరించటానికి వారు రాలేదు. వాటన్నింటితో పాటు జోడించబడిన మీ హృదయముల లోని భావనలకు ప్రీతిచెంది వారు ఈ యజ్ఞస్థలికి విచ్చేస్తారు. 33 కోట్ల దేవతలు ఒక ప్రత్యేకమైన కార్యం కోసం, ప్రత్యేకమైన మార్గమును అన్వేషించటానికి వచ్చి ఉన్నారు. యజ్ఞం చేసే సమయములో మంత్రములు చదవటం, పూజచెయ్యటం, హోమంలో నెయ్యి సమర్పించటం జరుగుతుంటుంది. వీటన్నింటితో పాటు మానవుల హృదయ భావనలు కూడా జోడించబడతాయి. దేవతలు శ్రేష్ఠమైన భావనల పట్ల ఆకర్షితులై యజ్ఞస్థలికి వచ్చి, మీ పట్ల కృపను వర్షించి, ఆశీర్వాదాలను ఇచ్చి తిరిగి వెడతారు. మీ లోపల ఎటువంటి భావనలు లేకుండా కేవలం శరీరంతో మాత్రమే యజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లైతే మీకు రావలసిన లాభం ఏదైతే ఉందో అది ఎంతమాత్రము లభించదు.



### ప్రపంచానికి మనం ఋణం తీర్చుకునే మార్గం 'యజ్ఞం!'

ప్రాచీనకాలంలో ప్రజలు యజ్ఞములు చేస్తుండేవారు. ఈ ప్రపంచంలో మనం ఊపిరిపోసుకున్నాం. ఆ ఊపిరి మనలను జీవింపజేస్తుంది. ముక్కు ద్వారా మనం శ్వాస పీల్చుకునేటప్పుడు ఆ గాలి ఎంతో స్వచ్ఛముగా ఉంటుంది. మళ్ళీ ముక్కు ద్వారానో, నోటిద్వారానో వదిలిపెట్టేటప్పుడు అదే గాలి మలినమై బయటకు వస్తుంది. ఈ ప్రపంచం మనకు మంచి శ్వాసనిచ్చింది. అదే ప్రపంచమునకు తిరిగి మంచి గాలిని ఇచ్చివెళ్ళాలి. ఈ నేల మనకు ఆహారాన్ని ఇచ్చింది. సమాజం చదువును ఇచ్చింది, జ్ఞానాన్ని ఇచ్చింది. తల్లిదండ్రుల సహకారాన్ని అందించింది.

కాబట్టి మనం కూడా ప్రపంచమును వదిలి వెళ్ళేటప్పుడు అందరి ఋణము తీర్చుకునే వెళ్ళాలి. అప్పు తీర్చివెయ్యాలనే భావన, అప్పు తీర్చుకునే విద్యయే 'యజ్ఞం' అని చెప్పబడుతుంది. ఈ ప్రపంచములో తీసుకునేవాళ్ళ చిట్టాలో కాకుండా; ఇచ్చేవాళ్ళ జాబితాలో మన పేరు ఉండాలి. తల్లిదండ్రుల, అన్నదమ్ముల, గురువుల ఋణమును తగిన రీతిలో తీర్చుకొన

క్రింద పడితే లేవటానికి ప్రయత్నించాలి

గలగాలి. అలాగే సమాజం మనకు ఇచ్చిన సహాయానికి బదులుగా సమాజ హితం కోసం యజ్ఞములు చెయ్యాలి' అని ఆనాటి ప్రజలు ఆలోచించేవారు.

## ఇచ్చేవారినే దేవతలు అంటారు

బ్రాహ్మణులను మనం బ్రాహ్మణ దేవతలంటాం. ఎందు కంటే వాళ్ళు స్వల్పంగా తీసుకొని అధికంగా తిరిగి ఇస్తారు. బ్రాహ్మణుడు స్వల్పంగా భుజిస్తాడు, సంతోషంగా జీవిస్తాడు, తన సమయము అంతా విద్యాలయాలు నడపటం, ధర్మ గ్రంథములు వ్రాయటం, చికిత్స చెయ్యటం, మందు-మాకు ఇవ్వటం వంటి సమాజసేవా కార్యక్రమాలకు వెచ్చిస్తాడు. అందు చేత ఉపకారం చేసే అటువంటివారిని బ్రాహ్మణోత్తములని, దేవతలని అంటారు.

దేవతలను మనము మంత్రపూర్వకముగా ఆహ్వానిస్తాము. మన లోపల యజ్ఞం యొక్క భావన, ప్రవృత్తి ఉన్నవా? లేవా? అని వాళ్ళు పరీక్షిస్తారు. నెయ్యి ఉన్నది. కావాలంటే మీరు నెయ్యిని అన్నములో తినవచ్చు, మిఠాయిలు చేసుకొనవచ్చు... కానీ మీరు ఆ పని చెయ్యటం లేదు. నెయ్యిని హవనములో సమర్పించి, ఆ వాయువుని గాలిలో నింపి సకల ప్రాణులకు చేరవేస్తున్నారు. ఇదే యజ్ఞమవుతుంది. కానీ ఇది ఇక్కడితో ఆగదు. పిల్లవాడిని పాఠశాలలో చేర్పించేటప్పుడు పలక మీద 'శ్రీగణేశాయనమః' అని వ్రాయిస్తారు. అక్కడనుండి చదువు ఆరంభమవుతుంది. ఇక ఆగదు. అలాగే మీ యజ్ఞం కూడా ఇక్కడి నుండి ఆరంభమవుతుంది. మీరు తినగలిగిన, మీ పిల్లలకు తినిపించగలిగిన నెయ్యిని మీరు **'యావత్ ప్రపంచమును సుగంధితము చెయ్యటానికి హోమములో వేసి గాలితో జోడించి సకల ప్రాణులకు పుష్టిని, రోగ నివారణాశక్తిని అందించటానికి, తద్వారా సద్భావనలను ఉత్పన్నము చెయ్యటానికి ఉపయోగిస్తున్నాను' అనే భావనను మనస్సులో నిలుపుకుంటూ హోమము చెయ్యాలి.** తద్వారా మీ శ్రమను, సంపదను, సమయమును సమాజసేవకు ఉపయోగించ గలుగుతారు. యజ్ఞకార్యక్రమము ద్వారా భక్తి మీలో ఉత్పన్న మవుతుంది. హవనమనేది ఒక ప్రారంభము. తర్వాత అభ్యాస మవుతుంది. మానవుడు ఏవిధముగా జీవించాలి? అనేది యజ్ఞముతోనే ప్రారంభమవుతుంది.

## రామాయణము ద్వారా మనకు లభించే అసలైన సందేశమేమిటి?

యజ్ఞము ప్రారంభించే ముందు మీరు చేసిన ఆహ్వానము ననుసరించి దేవతలంతా వచ్చారు. మీ భావనలను చూసి సంతోషించి ఆశీస్సుల నిచ్చారు. యజ్ఞము చేసేటప్పుడు మీరు చేసిన భావనలు, ఆలోచనలను మీరు తర్వాత కూడా అదే విధముగా కొనసాగించాలి. **ఇంట్లో ఉన్నా-బయట ఉన్నా ఎక్కడున్నా మీ చుట్టుప్రక్కలవారందరి పట్ల ప్రేమాభిమానము లతో వ్యవహరించాలి. కుటుంబసభ్యులందరికి ప్రేమతత్త్వమును తెలియపరచి ఒకరికోసం ఒకరు త్యాగము చెయ్యటము నేర్పించాలి.** రామాయణము మొత్తములో 'ఒక గృహస్థు ఆదర్శ పురుషుడుగా ఎలా తయారుకాగలడు?' అన్న అంశము గురించే వివరించబడింది.

రాముడు భరతుని కోసము రాజ్యమును త్యాగము చేశాడు. కానీ భరతుడు కూడా అన్నగారిని గౌరవిస్తూ రాజ్యపరిపాలనను తాను చెయ్యకుండా-రాముని పాదుకల నుంచి పాలన సాగించాడు. భర్త మాటలకు విలువను ఇచ్చి కౌసల్యాదేవి తన బిడ్డను వనవాసమునకు పంపింది. భర్త అడవులలో ఉంటే తాను రాజభవనములో ఉండి సుఖభోగములను అనుభవిం చటం ఏమిటని సీతాదేవి కూడా పతిని అనుసరించింది. లక్ష్మణుని భార్యయైన ఊర్మిళ ఒక అడుగు ముందుకేసి రామునికి తోడుగా అరణ్యమునకు బయలుదేరిన లక్ష్మణునికి తన సహకారమునందించి 'వనవాసములో అన్నావదినలను సేవించమని, అతని కర్తవ్యానికి, సేవామార్గమునకు తాను అడ్డుకాబోనని' ప్రకటించి, సీతారాములతో పాటు లక్ష్మణుడిని కూడా అడవులకు పంపింది. అంటే కుటుంబవ్యవస్థలో అందరు ఒకరికోసము ఒకరు ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలని రామాయణము మనకు బోధిస్తున్నది. అసలు రామాయణము యజ్ఞమునకు వ్యాఖ్యానమే అని చెప్పవచ్చు. రాముడు యజ్ఞం ద్వారానే జన్మించాడు. కాబట్టి జీవితమంతా యజ్ఞమయమై, పరోపకారముతో నిండిపోయిన వ్యక్తుల సంతానము కూడా రామలక్ష్మణుల వలె-భరతశత్రుఘ్నుల వలె ధర్మమూర్తులై ఉంటారు.

## భారతీయ సంస్కృతికి యజ్ఞము తండ్రి వంటిది

భగవంతుడైన శ్రీరాముడు విశ్వామిత్రుని యాగసంరక్షణకు బయలుదేరాడు. యజ్ఞమును పరిరక్షించే క్రమములో

**ఆత్మవిశ్వాసంతో అడుగులు వస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి**

రాక్షసులను ఎదుర్కొన్నాడు. యజ్ఞమనేది భారతీయ సంస్కృతికి తండ్రి వంటిది. యజ్ఞమే కాదు; హోమము కూడా! **మనము లోభులుగా ఉండకూడదు. ఒకరితో ఒకరు కలసిమెలసి ఉంటూ సమాజమునకు ఉపయోగపడే విధముగా ప్రవర్తించాలి. ఇదే యజ్ఞము యొక్క అసలైన లక్ష్యము.** యజ్ఞము మన తండ్రి వంటిది. దీనినుండే హిందూధర్మము, హిందూసంస్కృతి ప్రాదుర్భవించాయి.

హిందూసంస్కృతిలోని ప్రజలు ఇతర ప్రజల వలె కేవలము పొట్టనింపుకోవటానికే జీవించరు. వాళ్ళు జీవితమును ఒక నమూనాగా, ఆదర్శముగా, ఉన్నతముగా తయారుచేసుకొని అదేస్థాయిలో జీవనము సాగిస్తారు. జీవితమును ఔన్నత్యపరచు కోవటానికి కావలసిన విద్య మన యజ్ఞ సాంప్రదాయము ద్వారా లభిస్తుంది. ఇందులో మీరు ప్రతి ఒక్క విషయమును దర్శించగలరు.

యజ్ఞము ద్వారా మనకు ఇదే నేర్పించబడుతుంది. మనము స్వయముగా తినగలిగిన నెయ్యిని తినకుండా ప్రపంచము యొక్క సుఖశాంతుల కొరకు, ప్రపంచము ఆరోగ్యముగా ఉండటము కోసము అగ్నిలో సమర్పిస్తున్నాము. నెయ్యితో కూడిన అగ్ని ద్వారా వెలువడే వాయువును సర్వత్రా వ్యాపింప జేస్తున్నాము. స్వచ్ఛమైన వాయువును మనము పీల్చటము మన కర్తవ్యము, అవసరము. 'సమాజము నుండి మనము దేనిని అయితే తీసుకున్నామో తిరిగి దానిని ఇచ్చివేసి వెళ్ళాలి. ఇలాంటి పరోపకార జీవితమును జీవిద్దాము' అనే విషయమును యజ్ఞము మనకు బోధిస్తున్నది. ఈ యావత్ ప్రపంచము, మానవజీవితము యజ్ఞీయభావనల పైనే ఆధారపడి ఉన్నది. ఈ శరీరము ఏవిధముగా ఉత్పన్నమైనది? తల్లి యొక్క త్యాగపరిణామమే శరీరముగా రూపుదిద్దు కుంటున్నది. అమ్మ మనల్ని తొమ్మిది నెలలు తన గర్భములో మోస్తున్నది. అమ్మ ఈ త్యాగము చెయ్యకపోతే బహుశః మనకు ఈ శరీరము వచ్చుండేది కాదేమో! తన రక్తమును పాలగా మార్చి మనకు ఆహారమును అందించింది. అమ్మలోని ఈ త్యాగభావనయే మానవ శరీరమును జీవింప జేస్తున్నది. ఈ త్యాగభావమే యజ్ఞము! యజ్ఞభావనతో కూడిన మనోవృత్తులు ఈ ప్రపంచములో అంతమైపోయిన రోజు కలహములు-కార్పణ్యములు పెరిగిపోయి పాపం విస్తరిస్తుంది. అశాంతి నిండిపోయి ప్రపంచము నరకసదృశమౌతుంది.

## యావత్ ప్రపంచములోను యజ్ఞీయభావన వ్యాపించి ఉంటుంది

మేఘములు సముద్రములోని నీటిని స్వీకరించి భూమిపై వర్షిస్తాయి. మేఘములు ఈ పనిని ఎటువంటి స్వార్థభావము లేకుండా, ఎటువంటి స్వలాభము చూసుకోకుండా నిర్వహిస్తాయి. నేల ఈ నీటిని పొంది గడ్డిని, మొక్కలను మొలకెత్తిస్తుంది. మొక్కలు, వృక్షములు పలురకములైన ధాన్యములను, కాయ గూరలను పండిస్తాయి. పశువులు గడ్డిని మేస్తే, ఇతర జీవ జంతువులు కాయలను పండ్లను తింటాయి. మానవ జీవనము కూడా అత్యధికముగా వీటిపైనే ఆధారపడి ఉంటుంది. మబ్బులు త్యాగము చేసి భూమి పైన నీటిని వర్షించకపోయినా లేక నీటిని స్వీకరించిన నేల మొక్కలను మొలకెత్తించకపోయినా ధాన్యములు, కాయలు, కూరగాయలు, పండ్లు ఎక్కడినుండి వస్తాయి? మానవ జీవితానికి మనుగడ ఎలా సాధ్యము?

త్యాగము, సేవలతో కూడిన ఈ ప్రవృత్తి నేలలో, నీటిలో, మబ్బులో, సముద్రములో, ప్రకృతిలో సర్వేసర్వత్రా నిరంతరము చక్రీయరూపములో పరిభ్రమిస్తూనే ఉంటుంది.

**స్వల్పముగా తీసుకొని అధికముగా తిరిగి ఇద్దాము:** మనము కర్తవ్యాలను విస్మరించి హక్కుల కోసము ఆరాట పడతాము. దానితో ఎల్లెడెలా క్లేశము వ్యాప్తిచెందుతున్నది. సర్వత్రా తగాదాలు పెరిగిపోతున్నాయి. మన సమస్యలకు, కష్టములకు పరిష్కారమొక్కటే... స్వల్పముగా తీసుకొని అధికముగా తిరిగివ్వటము. అలా చేయగలిగితే మనము దేవతలతో సమానము కాగలుగుతాము. దైవీ స్వభావమున్న వారు ప్రపంచములో శాంతిని స్థాపించగలరు. బాగా పరిశీలించి చూస్తే అసలు మన శరీరములో ఒక యజ్ఞము నిరంతరము జరుగుతుంటుంది. ఉదాహరణకు : చేతులు సంపాదిస్తున్నాయి. కానీ చేతులు తింటున్నాయా? లేదు. నోరు తింటున్నది. తాను నమిలిన ఆహారమును నోరు తనలోనే ఉంచుకొనకుండా పొట్టలోకి పంపిస్తున్నది. పొట్ట ఎంతో శ్రమపడి ఆ ఆహారమును జీర్ణము చేసి రక్తముగా మార్చి హృదయములోకి పంపిస్తుంది. గుండెకు చేరిన రక్తము, అన్ని

మనలను మనం నమ్ముకుంటే ఇంకా ఎవరి విశ్వసించనవసరం లేదు

శరీర భాగములకు పంపించబడుతుంది. అలాకాకుండా పొట్ట తనలోకి వచ్చి చేరిన ఆహారమును తానే ఉంచుకుంటే ఏమవుతుంది? పొట్ట ఉబ్బరించి కడుపునొప్పి వచ్చి మనిషి తల్లక్రిందులవుతాడు. ఇక మళ్ళీ ఆహారమును భుజించలేడు.

తాను సంపాదించుకున్న ధనమును కేవలము తన కోసమే ఖర్చుచేసుకునే మనిషిని భగవంతుడు కూడా మెచ్చడు. **దేవతలను ఆహ్వానించే వ్యక్తులు తాము కూడా దైవీ స్వభావాలను పెంపొందించుకోవాలి.** మన శరీరమే ఒక దేవాలయము! అంటే దేవతల నివాసస్థానము!

## ఆధ్యాత్మిక సామ్యవాదమంటే ఏమిటి?

నీవు సమాజమునకు ఏదైనా ఇస్తే -సమాజము నీకు తిరిగి ఇస్తుంది. సమాజమును నీవు ఉన్నతముగా ఉంచగలిగితే సమాజము నీకు ఔన్నత్యమును (గొప్పతనాన్ని) చేకూరుస్తుంది. అలాకాకుండా సమాజాభివృద్ధిని అడ్డుకుంటే నీకు దుఃఖం కలుగుతుంది. ఇదే ఆధ్యాత్మిక సామ్యవాదము. దీనిని మన ప్రాచీన మహర్షులు అర్థము చేసుకున్నారు. ప్రజలు దీనిని అంగీకరించకుండా తిరస్కరించినప్పుడు అది మరోవైపు నుండి తుఫాన్ యొక్క వెల్లువలా వచ్చి ప్రతి ఒక్క మనిషిని 'నీవు నీకోసము మాత్రమే జీవించకూడదు' అని జాగృతము చేస్తుంది. 'ఈ పనిని నీవు ఇష్టపూర్వకముగా చెయ్యకపోతే భగవంతుడు బలవంతముగా నైనా సరే నీచేత చేయిస్తాడు. కాబట్టి దేవుని చేత బలవంతము చేయించుకోకుండా నీ అంతట నీవే చెయ్యటము మంచిది!' యజ్ఞములో జరిగే విజ్ఞానము, యజ్ఞము యొక్క ఆధ్యాత్మిక సైద్ధాంతికత (సిద్ధాంతము) ఇదే!

డబ్బును సంపాదించిన చేతులు వాటంతటవే రక్తమును తయారుచేసుకొనలేవు. కాబట్టి చేతులు తాము సంపాదించిన డబ్బుతో పొందిన ఆహారమును నోటికి తినిపిస్తాయి. నోరు ఆ ఆహారమును పొట్టలోనికి-పొట్ట జీర్ణము చేసి తయారుచేసిన రక్తమును గుండెకు తద్వారా ఇతర అవయవములకు అంటే చేతులకు కూడా పంపిస్తుంది. ఇదొక చక్రీయగమనము. సమాజానిది కూడా చక్రీయక్రమమే. దీనిపైన ప్రపంచములో శాంతి ఆధారపడి ఉంటుంది. శాంతిని తొలగించాలని ఏ మాత్రము ప్రయత్నించినా మీరు కష్టములలో చిక్కుకొనక తప్పదు. వందల, వేల అశాంతులు మిమ్మల్ని చుట్టుముట్టేస్తాయి.

## పిల్లల్ని సంస్కారవంతుల్ని గావించండి

మన మేలుకోసమే పిల్లలను సంస్కారవంతులుగా తీర్చి దిద్దండి. ఇందుకోసము ముందుగా మీరు సంయమమును పాటిస్తూ మంచి వ్యక్తిత్వమును అలవరచుకోవాలి. పిల్లలు చదువుకున్నంత మాత్రాన మంచి పౌరులు కాలేరు. వాళ్ళు ఉన్నతముగా ఎదగాలంటే ముందు మీరు ఔన్నత్యమును (గొప్ప గుణములు) కలిగి ఉండాలి.

పిల్లల చదువుకు ఉపాధ్యాయులు బాధ్యులు కారు. పిల్లల ముందు తాము ఆదర్శముగా నిలబడకుండా, తమ స్థానమును తాము చూసుకునే తల్లిదండ్రులే అందుకు బాధ్యులు. మీరు మీ తల్లిదండ్రులకు సేవ చేస్తే రేపు మీ పిల్లలు మీకు సేవ చేస్తారు. ఈనాడు మీరు మీ తల్లిదండ్రులకు చేస్తున్న సేవను చూసి భవిష్యత్తులో వారు మిమ్మల్ని ఎలా సేవించుకోవాలో తెలుసుకుంటారు, నేర్చుకుంటారు. కాబట్టి సేవాదృక్పథము, సంయమనములతో కూడిన ఆదర్శపూరిత జీవనమును గడపటమే లాభదాయకము.

**మన సంపాదనలో నుండి కొంత ధనము, మన సమయమును సమాజమునకు కేటాయించడము వల్ల సమాజములో శాంతి నెలకొంటుంది. మన చుట్టూ ఉన్న ప్రపంచములో ఎన్ని కష్టాలున్నాయో, ఎంతటి అశాంతి నెలకొని ఉన్నదో గమనించి వాటిని తొలగించటము కోసము మన వంతు కృషి చెయ్యాలి. ఇది దేవతల లక్షణము! లోకహితమే దేవతల ప్రవృత్తి! ఉన్నతమైన ఆలోచనలు, ఆదర్శవంతమైన కార్యాచరణ, స్వచ్ఛమైన స్వభావము కలిగి ఉండే వ్యక్తుల పట్ల దేవతలు ప్రసన్నులవుతారు.**

'మీరు భగవన్నామము జపించకపోయినా, భగవంతుడిని పూజించి భజనలు చేయకపోయినా పర్వాలేదు. కానీ ప్రపంచమును మంచిమార్గములో నడిపించటానికి, ఇతరుల కష్టములను తొలగించటానికి, మీ జీవితమును స్వచ్ఛముగా-శ్రేష్ఠముగా తయారుచేసుకొనటానికి జీవితాంతము శ్రమించాలి. అట్టి వారిని భగవంతుడు ప్రేమిస్తాడు. యజ్ఞము ద్వారా మనకు అందించబడుతున్న జ్ఞానము కూడా ఇదే! *(సశేషం)*

*- అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

మన మీద మనకు అపారమైన నమ్మకాన్ని పెంచుకోవాలి

నావారితో నా మాట

# మహాక్రాంతి ప్రారంభమయింది-ఆధ్యాత్మిక సామ్యవాదం వచ్చి తీరుతుంది



## క్రాంతి కనిపించబోతున్న విధానం

కొత్త సంవత్సరం వచ్చేసింది. అంతా కొత్త కొత్తగా ఉంది. గొప్ప గొప్ప మార్పులు వచ్చినప్పుడల్లా దానికి తగ్గ నేపథ్యం ఏర్పడుతూ ఉంటుంది, కానీ సామాన్యులు అర్థం చేసుకోలేరు. గంభీరమైన మార్పు వచ్చినప్పుడు, అవన్నీ ఎందుకు అలా జరిగాయో అర్థం అవుతుంది. విప్లవాలు రైలు పెట్టెలలాగా వస్తాయి అన్నారు పరమపూజ్య గురువుగారు. మీరు ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి ఉన్నారు. ఉన్నట్టుండి 'యాత్రికులకు విజ్ఞప్తి' అంటూ వినిపిస్తుంది. ముందు ఇంజను కూత వినిపిస్తుంది, తరువాత ఇంజను కనిపిస్తుంది. ఆ తరువాత ఒకొక్కటిగా రైలు పెట్టెలు వస్తుంటాయి. మీరు నిర్దేశించిన చోట సరిగ్గా నిలబడితే మీ కంపార్టుమెంట్ మీ ముందు ఆగుతుంది. ఎంత తొందరగా ఈ కరెంటు రైలు వస్తుందో, మీరు కూర్చోగానే అంత తొందరగా వెళ్ళిపోతుంది కూడా. విప్లవాలు కూడా ఇలాగే వస్తాయి అంటారు గురువుగారు. ఒకదాని తరువాత ఒకటి వస్తూనే ఉంటుంది, ఆ తరువాత యుగం మారిపోతుంది. వాతావరణం అంతా దానితో పాటే మారిపోతూ ఉంటుంది. 1857లో దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని ఎవరు ఊహించను కూడా లేదు. రాణిలక్ష్మీబాయి, ఝలకారి, సుందర్-ముందర్, తాత్యా తోపే, మంగల్‌పాండే. వీరంతా తమను తాము ఆహుతిగా సమర్పించి స్వాతంత్ర్యానికి నేపథ్యాన్ని ఏర్పాటు చేశారు. వెంటనే 15 సంవత్సరాలలోపే స్వామివివేకానంద, స్వామి అరవిందో, మహాత్మాగాంధీగార్లు జన్మించారు.

శ్రీరామకృష్ణ పరమహంస, ఆయన శిష్యగణం, బంకిం చంద్ర చటర్జీ (వందేమాతరం రచయిత), రాస్‌బిహారీబోస్ వంటి గొప్పవారంతా తమ దైవీ ప్రయోజనం నెరవేర్చడంలో నిమగ్నమయ్యారు. 20వ శతాబ్దంలో భగత్‌సింగ్, ఆయన తోటివారు రంగంలోకి వచ్చారు. తరువాత దక్షిణాఫ్రికా నుండి గాంధీగారు వచ్చి గోఖలే, తిలక్ వంటి వారితో కలిసి తమ పాత్రను పోషించారు. మహాపరివర్తనకు ముందు ఏర్పడ్డ నేపథ్యం ఇదంతా. అదే భారతదేశ స్వాతంత్ర్యం. శ్రీ అరవిందో, రమణమహర్షి, పండిట్ శ్రీరామశర్మ ఆచార్య ఆధ్యాత్మికస్థాయిలో వారి బాధ్యత నిర్వహించారు. 1950లో పటేల్ మరియు శ్రీ అరవిందోల మహా ప్రయాణంతో ఒక యుగం అంతరించిపోయినా, పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మఆచార్యగారు ఆలోచనా క్రాంతిని తమ చేతిలోకి తీసుకున్నారు. దాని పరిణామం గానే విరాట్ గాయత్రీ పరివార్ ఏర్పడింది.

అఖండజ్యోతి, మార్చి 1968, పేజి 34లో గురువుగారు ఇలా వ్రాశారు – "రాబోయే రోజులలో పెట్టుబడి అనేది ఏ ఒక్కరి చేతిలోనో ఉండదు. డబ్బు, సంపద అనేవి ప్రభుత్వం మరియు సమాజం చేతిలోనే ఖచ్చితంగా ఉంటాయి. ప్రతి మనిషి కష్టపడి జీవనోపాధిని సంపాదించుకుంటాడు. ఎవరైనా దీనిని భవిష్య వాణిగా నోట్ చేసుకోండి. రాబోయే రోజులలో ఇది అక్షరాల జరిగితీరుతుంది. కాబట్టి నేటి ఆలోచనాపరులతో నేను విన్నవించుకునేది ఏంటంటే అవసరానికి మించి డబ్బు కూడ బెట్టి, మనవలు, మునిమనవల కోసం కూడా ఆస్తులు పోగు చేసే పిచ్చి పనిలో ఉండకండి. రాజులు, జమిందారులు మన కళ్ళ ముందే నామరూపాలు లేకుండా పోవడం చూశాం. ఇప్పుడు ఈ కళ్ళ ముందే వ్యక్తిగత పెట్టుబడిని సార్వజనిక మైనదని ప్రకటించబడడం చూడడానికి సిద్ధంగా ఉండాలి."

## క్రాంతిదర్శకుని భవిష్యవాణి

"ఈశ్వరేచ్ఛ యుగపరివర్తన కోసం ఏర్పాట్లు చేస్తోంది. జీవించి ఉన్న తెలివైన ఆత్మలు ఈ ప్రయోజనానికి సహకరించడం సమంజసమైనది." ఇదొక విప్లవాత్మక భవిష్యవాణి. ఆ రోజులలో గురువుగారిచ్చిన ఒక ప్రవచనం – "మిమ్మల్ని బాధలలో ఉండనివ్వం. కష్టాలలో కూరుకుపోనివ్వం. మిమ్మల్ని ఉద్ధరిస్తాం. డబ్బు పరంగానా? డబ్బంటావా నాయనా. రాబోయే రోజులలో ఎవరు బంగారపు కడ్డీలు, నోట్ల కట్టలు

**అనుకున్నది సాధించాలంటే మీ మీద మీకు నమ్మకం ఉండాలి**

కూడబెట్టరు. ఇప్పుడే ఆదాయపు పన్ను వాళ్ళు దాడులు చేస్తున్నారు. ఇక భవిష్యత్తులో ఎవరైనా భూమి కింద పాతిపెట్టినా ఆ డబ్బును వెతికి తీస్తారు. మిమ్మల్ని మేం సంపన్నులుగా చేయం. మిమ్మల్ని మేం భావనాశీలురుగా తయారుచేస్తాం, ఆలోచనా పరులుగా, మహామానవులుగా, దేవతలుగా తయారుచేస్తాం."

1970-71లో అప్పటి మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి శ్రీమతి విజయరాజేసింధ్యాగారి సమక్షంలో గోరఖీ మైదానంలో నిర్వహించిన 108 కుండాల మహాయజ్ఞంలో ఒక విలక్షణమైన ప్రకటన చేశారు. "నేను! శ్రీరామశర్మ ఆచార్య అందరి సమక్షంలో ప్రకటిస్తున్నాను, నేటి నుండి యాభై సంవత్సరాల తరువాత డబ్బుకి ఎలాంటి విలువ ఉండదు. డబ్బును పంచేస్తారు. ఆధ్యాత్మిక సామ్యవాదం వచ్చి తీరుతుంది." ఈ పంక్తుల రచయిత, ఈ పత్రిక సంపాదకుడు అప్పుడు ఆ కార్యక్రమంలో ప్రత్యక్షంగా ఉన్నాడు. ఆయన తండ్రి గ్వాలియర్‌లో న్యాయాధిపతి.

### మహామానవుని భావం అర్థం చేసుకోండి

ఆ రోజులలోనే పరమపూజ్య గురుదేవులు ఒక సద్వాక్యాన్ని ప్రచారం చేయించారు - "రాబోయే రోజులలో ఏ ఒక్కరు అతి ధనవంతులుగా ఉండలేరు. డబ్బు పంచబడుతుంది. పెట్టుబడి మీద సమాజానికి మాత్రమే అధికారం ఉంటుంది. అందరు కేవలం సామాన్య నిర్వహణకు తగినంత ద్రవ్యాన్ని మాత్రమే అందుబాటులో ఉంచుకోగలరు." (మహాకాలుని భావాన్ని తెలుసుకోండి అనే వ్యాసంలో రాశారు). ఈమధ్య భారతదేశంలో పుట్టిన ఆర్థిక మహాక్రాంతి సందర్భంగా ఇవన్నీ చెప్పుకుంటున్నాం. మన ప్రధానమంత్రి-ఆర్థిక మంత్రి దేశాన్ని సంబోధిస్తూ 8 నవంబరున సాయంత్రం ఉన్నట్టుండి పెద్ద నోట్లను రద్దు చేశారు. 500, 1000 నోట్లు పెద్ద సంఖ్యలో చెలామణిలో ఉన్నాయి. ఉగ్రవాదులు, స్మగ్లింగ్ మాఫియా వంటి వాటిని పోషిస్తున్నాయి. ఆరోజు నాలుగు గంటల సమయం ఇస్తూ ప్రధానమంత్రి ఆ పెద్ద నోట్లన్నింటినీ బ్యాంకుల్లో జమ చేసేయమని ప్రకటించారు. చిల్లర్లు మాత్రమే ఉంచుకో మన్నారు. కొత్త నోట్లు త్వరలో వస్తాయి, కానీ అవి నిజాయితీగా సంపాదించినవారి చేతిలోనే ఉంటాయి. పన్ను ఎగ్గొట్టడం, భవన నిర్మాణాలు, ఉద్యోగాలు, అపరాధాలతో వక్రమార్గంలో కూడబెట్టిన వందల కోట్ల రొక్కం మట్టిలో కలిసిపోయింది. రాత్రి ప్రకటన ఇచ్చిన మూడు గంటలలో వాటి విలువ శూన్యమైపోయింది. తరువాత అవధి పెంచారు. కాని ఇప్పుడు ఆదాయపు పన్ను వారి దృష్టి ఉంటుంది. గురుదేవుల ప్రకటన అక్షరాల సత్యమైనట్టు మీకు కనిపించటంలేదా. నిజానికి రాబోయే బృహత్ విప్లవానికి ఇది ఆరంభం మాత్రమే.

నలుదిక్కులా కోలాహలంగా ఉంది. కానీ నల్లధనం, అవినీతి, ఓటుకి నోటు, లంచాలు మొదలైనవాటి వలన సమాజానికి తుప్పు పట్టింది. ఎక్కడా ప్రగతి కనిపించటం లేదు. ఎందుకంటే ఎంత ముందుకు సాగితే అంతగా వెనక్కి లాగుతున్నారు. ఇప్పుడు తీసుకున్న చర్యలతో నిజంగానే దేశంలో మార్పు వచ్చిందని అందరూ నమ్ముతున్నారు. ఏ మార్పు కోసం ఎందరో విప్లవకారులు బలిదానాలు ఇచ్చారో, సరిహద్దుల్లో ఇప్పటికీ సైనికులు ప్రాణాలు అర్పిస్తున్నారో, అదే ఇది. ఆంతరంగికంగా మార్పు రాకపోతే ఏదీ సాధ్యం కాదు. కాబట్టి ఈ ఆర్థిక మహాక్రాంతి అవసరం అని మేము అనుకుంటున్నాం.

### ఈ అయోమయం కొద్ది రోజులకే

అన్ని వైపులా అల్లకల్లోలంగా ఉంది. కొన్ని రోజులైనా గడువు ఇవ్వాల్సింది అని కొందరు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. ముందు చెప్పుంటే మా ఏర్పాట్లు చేసుకునేవాళ్ళం అంటున్నారు. దొంగతనానికి ముందు దొంగ వచ్చి చెప్పుంటే మా సామాన్లన్నీ జాగ్రత్త చేసుకునేవాళ్ళం కదా అన్నట్టుంది. ఉన్నట్టుండి చేసిన ప్రకటన వల్ల జరిగిన సర్జికల్ స్ట్రైక్ వల్ల జనాలకు ఎటు తోచకుండా పోయింది. ఇదంతా కొన్నాళ్ళ సంబరమే అనుకుని ఇందులో లోటుపాట్లను వెతికేవారు కొందరు. తరువాత మళ్ళీ మా నల్ల రాజ్యం స్థాపించుకోగలం అని ఎత్తులు వేస్తున్నారు. ఒకప్పుడు వెయ్యి నోట్లకట్టలు, ఇప్పుడు రెండు వేల నోట్ల కట్టలు కూడగడతాం. కానీ ఇప్పటి ప్రభుత్వం అమ్ముల పొద నిండుగా ఉందని వారు గ్రహించలేకపోతున్నారు. పూర్తిగా సిద్ధంగా ఉంది యంత్రాంగం. బ్యాంకులు, లాకర్లు, ఎ.టి.ఎమ్ అన్నింటి ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయి, ఎక్కడా రూపాయి స్థిరంగా ఉండదు. ఫ్లోటింగ్ మనీ ఉంటుంది, పారుతున్న ధనం. ఒక చోట నిలవదు. వేరే దారి లేదు.

రావణాసురుడు కూడా బంగారులంకను నిర్మించాడు. స్వర్గానికి నిచ్చెన వేద్దామనుకున్నాడు. కానీ కలలు నిజమయి

**ఆత్మవిశ్వాసంతో అడ్డంకులను అధిగమించండి**

నాయా? ఇప్పుడు కూడా మనదేశంలో పెద్ద పెద్ద ఫార్మ్ హౌజులు, పెద్ద పెద్ద భవంతులు ఏకఛత్ర రాజ్యం చేస్తున్నాయి. అవినీతి పునాదులతో నిలిచినవి ఇవన్నీ. కాష్‌లెస్ (నోట్లు లేని) ఆర్థికవ్యవస్థ ఏర్పడబోతోంది. దొంగతనాలు, కూడ బెట్టడాలు ఆగిపోతాయి, మనుషులు నిర్భయంగా ఉంటారు. ఎవరు ఎంత సంపాదించినా, యంత్రాంగం దృష్టిలో ఉంటుంది. కాబట్టి తప్పించుకోలేరు. ఆధ్యాత్మిక సామ్యవాదానికి ఇది ఆరంభం.

### మన కుటుంబం

పరమపూజ్య గురుదేవులు మొదట్లో పది పది పైసలు, తరువాత ఇరవై పైసలు, రూపాయి, ఆ తరువాత ఒక రోజు జీతం సేకరించి మిషన్‌ను నిలబెట్టారు. ఇప్పటికీ అదే వ్యవస్థ ఉంది. ఈ ఆధారంగానే దేశంలో, ప్రపంచంలో కోట్ల మంది కష్టార్జితంతో, నిజాయితీగా సంపాదించిన సొమ్ముతోనే ఇది వెలిసింది. మన ప్రధానమంత్రి 'జన్‌ధన్‌యోజన' ప్రవేశ పెట్టారు. అందరికీ బాంకుల్లో ఖాతాలు తెరిపించారు. సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ (మైక్రో ఎకానమి)కి ప్రాధాన్యత ఇచ్చారు. కాబట్టి ఈ సర్జికల్ స్ట్రైకుల ప్రభావం కొద్దిమంది జమాఖోరుల మీదనే పడింది. దీనివల్ల నల్లధనం మొత్తం బైటపడుతుందా? పడక పోవచ్చు. కానీ నల్లధనం పునాదులు కదిలాయి. ఇప్పుడు మెల్లిమెల్లిగా ఎన్నో క్రాంతులు వచ్చి మహాపరివర్తనకు జన్మ నిస్తాయి. పదేళ్ళు పట్టచ్చు. కానీ దేశం సురక్షితంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ దృఢపడుతుంది. చూస్తూ చూస్తూ దేశం మళ్ళీ రత్నాల రాశిగా మారుతుంది.

### రాబోయే విప్లవాలు

భరతభూమిని కష్టంతో, రక్తంతో తడిపి మహాద్భుత దేశంగా మార్చే క్రాంతులు ఎన్నో రాబోతున్నాయి. అప్పుడు ఖరీదైన పెళ్ళిళ్ళు ఆగుతాయి. ఈ ప్రకటన జరిగిన మూడు రోజులలో ఒక్క ఢిల్లీ నగరంలోనే లక్షకు పైగా పెళ్ళిళ్ళు జరగాల్సి ఉన్నది. వారందరి పరిస్థితి ఏమైందో ఊహించగలం. కానీ ఏమి చేయగలం? ఆదర్శ వివాహాలు జరగాలని మహాకాలుని కోరిక. అనవసరమైన అతివ్యయం ఆగాలి. పేదల డబ్బుతో నిలబడ్డ ధనవంతుల ఆర్థికవ్యవస్థ పోవాలి. మధ్యతరహా కుటుంబాలు, మేము ఏం చేశాము అని బాధపడవచ్చు. వారు తోడు నిలిచారు, సంపదల ఆర్భాటంలో, అనుకరించటంలో, స్తోమతకు మించి ఖర్చుపెట్టడంలో.

తరువాత విప్లవం - గ్రామీణ ఆర్థికవ్యవస్థ, నగరాలను మించుతుంది. కుటీర పరిశ్రమలు మళ్ళీ చిగురిస్తాయి. అందరికీ ఉద్యోగాలు దొరుకుతాయి. ఇందుకే మనం యువక్రాంతి సంవత్సరంలో స్వావలంబ లోకసేవ మండళ్ళు (స్వాలోకం) నిర్మాణం గురించి మాట్లాడం. ప్రజలు పరిశ్రమకు విలువ ఇస్తారు. గుండాగిరి ఆగుతుంది. మహిళలపై అత్యాచారాలు ఆగుతాయి. లక్షల రూపాయల డొనేషన్లతో ఇంద్రభవనాల్లా తయారైన కాలేజీలు అప్పుడు పేదలకు కూడా తలుపులు తెరుస్తాయి. ఇప్పుడు సరైన దృష్టితో విద్య-శిక్షణల సమన్వయంతో జీవనవిద్యను అందిస్తారు. మార్పు చాలా త్వరగా జరుగుతుంది. ఎన్నికల వ్యవస్థలో కూడా మార్పులు వస్తాయి. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే నిజాయితీపరులు పెరుగుతారు. చూస్తూ చూస్తూ యుగపరివర్తనకు పునాదిరాయి స్థాపించబడుతుంది. 2015-2026 లోపల జరిగిపోతుంది. రాబోయే మహాక్రాంతికి శంఖం ఊదుతూ ఇప్పటి ఆర్థిక క్రాంతి వచ్చింది. రండి. మంగళా చరణంతో స్వాగతం చెప్పి, హారతి పడదాం.

*- అఖండజ్యోతి, జనవరి 2017*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

### మహిళల సాహసం

*అవి స్వాతంత్ర్య సమరం జరుగుతున్న రోజులు. లాహోరులో పోలీసు బందోబస్తూ దృఢంగా ఉన్నది. మహాత్మాగాంధీ జన్మదినం జరుపుకోమని కాంగ్రెసు పార్టీ ప్రజలకు చెప్పింది. అంతేకాక తిలక్ ప్రారంభించిన స్వరాజ్య ఉద్యమానికి చందాలు వసూలు చేయమని సూచించింది. పోలీసులకు భయపడి ఎవరికి వారు మెదల కుండా ఊరుకున్నారు. కానీ స్త్రీలంతా ఒకచోట సమావేశ మయ్యారు, ఉపన్యాసాలిచ్చారు. ఖద్దరు వస్త్రాలను అమ్మారు. చందాలు వసూలు చేసి ఇచ్చారు. మహిళల సాహసం చూచిన తరువాత అందరు ధైర్యం పుంజుకున్నారు. గాంధీ జయంతి జరుపుకోవటానికి సంసిద్ధులయ్యారు.*

- *అనువాదం:* పొన్నూరు హైమవతీశాస్త్రి

**అసాధ్యమని వదిలేస్తే ఏ పని జరగదు**

ఆయుర్వేద వైద్యం-23

# ఔషధ గుణాలతో నిండియున్న వెల్లుల్లి

వెల్లుల్లి ఎలిన్ డై సల్ఫాయిడ్‌ను కలిగి ఉండుట వలన ఘాటైన వాసన కలిగి ఉంటుంది. ఈ కారణంగా ఆధ్యాత్మిక సాధకులు దీనిని సేవించుటను నిషేధించారు. కానీ వైద్య పరంగా వెల్లుల్లి అందించే లాభాలను దృష్టియందుంచుకొని ఆయుర్వేద ఆచార్య చరకుడు, ఆచార్య శుశ్రుతుడు వెల్లుల్లికి తగిన సముచిత స్థానాన్ని ఇచ్చారు. దీనిలోగల యాంటిబయోటిక్ గుణాలు, రోగ నిరోధక, రోగ నివారణ శక్తిని పెంపొందించి సేవించిన వారికి లబ్ధిని చేకూర్చుతాయి.

వెల్లుల్లి మనిషి శరీర రక్తంలోని హానికారక కొలెస్ట్రాల్‌ను పోగొట్టి, ప్రయోజనకారకమైన కొలెస్ట్రాల్‌ను అభివృద్ధి పరుస్తుంది. రక్తపోటును సరియైన స్థితిలో నుంచి, హృదయ రోగాలను నియంత్రించి, ప్రాణాంతకారకాలైన కేన్సర్ వంటి రోగాలను కూడా నియంత్రించుటలో పచ్చివెల్లుల్లి సేవనం అత్యంత లాభకారిగా గుర్తించబడింది. 70 శాతం రోగాలను ఇది నియంత్రించగలదు.

వెల్లుల్లి లక్షణం శరీరంలో వేడిని పెంపొందించే గుణాన్ని కలిగి ఉన్నందున సర్వులకు దీని సేవనం అనుకూలం కాదు. పొట్టలో నీరు చేరుట, కుష్టువ్యాధి, సంధివాతం, సయ్యాటికా, పక్షవాతం, ఎముకల టి.బి., ఉబ్బసము, హృద్రోగాలు, మలబద్ధకం, పొట్టలో నొప్పి, నులిపురుగులు, హృదయ సంబంధిత రోగం, కేన్సర్ మున్నగువాని నివారణకై ఔషధంలా ఆశ్చర్యం గొల్పే రీతిలో పనిచేస్తుంది. శరీర బాధల నివారణలో ఔషధంలా పటిష్టమైన పాత్రను పోషిస్తుంది.

**హెచ్చరిక:** గర్భవతులైన స్త్రీలు దీనిని సేవించుట నిషేధం. గృహ ఔషధంగా వాడవచ్చును.

**సంధివాతము, సయ్యాటికా / కీళ్ళవాతముల నివారణ:**

వెల్లుల్లి స్వచ్ఛమైన నూనెను మాలీషు చేయుట ద్వారా వాతం నుండి పుట్టిన బాధలు నివారింపబడతాయి. వెల్లుల్లిని నూరి తీసికోండి. మొదట కొబ్బరినూనె లేక దేశవాళి ఆవునెయ్యిని నొప్పి / బాధ ఉన్నచోట రాయాలి. తదుపరి ఆ స్థానంలో నూరి ఉంచిన వెల్లుల్లిని తాపడంగా రాయాలి. అప్పుడు వెంటనే బాధ నివారణ అవుతుంది.

**విశేష ప్రయోగం:** ఒక కిలో వెల్లుల్లిని రెబ్బలుగా చీల్చి నూరాలి. లీటర్‌పాలలో దీనిని చేర్చి ఉడికించి ముద్దలా చెయ్యాలి. అప్పుడు కిలో పటిక బెల్లం పలుకులను (మిస్రీ) లేక కలకండను కలిపి హల్వాలా తయారుచెయ్యాలి. రుచికొరకై ఈ మిశ్రమంలో కొద్దిగా యాలుకలు, బాదంపప్పు, అక్రోట్ మున్నగువానిని కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ప్రతిరోజు 20 గ్రాముల చొప్పున సేవించిన కీళ్ళనొప్పులు, సంధివాతం, సయ్యాటికాల నుండి ఉపశమనం కలుగుతుంది.

**తలనొప్పి నివారణ:** తలనొప్పిని వెంటనే తగ్గించే గుణం దీనికి ఉంది. నొప్పి ఉన్న స్థానంలో మొదట నెయ్యిని రాసి తదుపరి దానిపై 4-5 వెల్లుల్లి రెబ్బలను నూరి లేపనంగా అద్దాలి. ఆశ్చర్యాన్ని గొల్పెడిరీతిలో బాధ ఉపశమనం కలుగుతుంది. కొంతసేపటి తర్వాత లేపనాన్ని తీసివేయాలి. నెయ్యి కాని నూనె కాని రాయకుండా ఈ వెల్లుల్లి లేపనాన్ని వినియోగించుట ప్రమాదకారకం.

**దంతాలు, చిగుళ్ళు బాధ నివారణకై:** వెల్లుల్లి నూనెలో దూదిని ముంచి చిగుళ్ళు వాచినచోట, దంతాలలో క్రిములు చేరిన చోట, ఆ దూదిని పెట్టినచో బాధా నివారణ జరుగుతుంది.

**చెవిపోటు నివారణకై:** వెల్లుల్లి నూనె 50 గ్రాములు, ఆవనూనె 50 గ్రాములు కలిపి మరిగించాలి. దీనిని చల్లార్చి గాజు సీసాలో భద్రపరచాలి. వాడే సమయంలో గోరువెచ్చగా చేసి దూదిని ముంచి, 1-2 చుక్కలను నొప్పి ఉన్న చెవిలో వేయాలి. అట్లే దురద ఉన్న స్థానంలో శరీరంపై దీనితో మర్దించిన ఉపశమనం కలుగుతుంది.

**పొడిదగ్గు నివారణకై:** కోరింతదగ్గు నివారణకై వెల్లుల్లి రెబ్బలను మాలగా తయారుచేసి పిల్లల మెడలో వేయాలి. 20 వెల్లుల్లి రెబ్బల రసాన్ని షర్బత్‌లో కలిపి 4 చుక్కలు ప్రతి 4 గంటల కొకసారి త్రాగినచో శీఘ్రంగా లాభం చేకూరుతుంది.

**తపన ఉంటే ఏదైనా సాధించగలరు**

**మూత్రం నిలిచిపోయినచో నివారణకై:** వెల్లుల్లికి గొప్ప గుణం ఉన్నది. వెల్లుల్లి 4 చుక్కల రసాన్ని ఒక కప్పు తేనేటిలో కలుపుకొని త్రాగినచో నిలిచిపోయిన మూత్రం వెలికి వస్తుంది.

**వాసన పీల్చెడి శక్తి తగ్గినచో నివారణకై:** వాసన పీల్చెడి శక్తి సన్నగిల్లినచో వెల్లుల్లి రసం వాసనను పీల్చుచున్నచో, ఘ్రాణశక్తి తిరిగి చేకూరుతుంది.

**గాయాలపై చేరిన క్రిముల నివారణకై:** గాయాలపై చేరిన క్రిముల నివారణకై వెల్లుల్లి నూనెను రాసినచో, గాయాలు మానతాయి.

**ఎముకల టి.బి. నివారణకై:** ప్రతిరోజు వెల్లుల్లిని 2-3 పచ్చి రెబ్బలను నమిలి నీటిని త్రాగాలి. దీనితో బ్యాక్టీరియా నశించి టి.బి. నివారణ జరుగుతుంది.

**పక్షవాతం నివారణకై:** ఉదయం మరియు సాయంత్రం తేనీటిలో 3 గ్రాముల వెల్లుల్లి రసాన్ని కలిపి ఖండసార బెల్లంతో కలిపి సేవించిన లాభకారి.

**వివిధ పక్షవాతాల నివారణ:** ముఖము, నోటి పక్షవాతం నివారణకై 250 గ్రాముల వెల్లుల్లి రెబ్బలు, 500 గ్రాముల పాలలో సన్నని సెగపై కాచి, బాగా కలియబెట్టి, తిరిగి రెండు సార్లు కాచిన గట్టిపడుతుంది. చిన్నసైజు గోలీలుగా చేసి, రోజూ ఉదయాన్నే రోగికి తినిపించాలి. ఇది చాలా లాభదాయకం - సగం శరీరం పక్షవాతం వచ్చినా స్వస్థత చేకూరగలదు.

**కఫంతో కూడిన పార్శ్వ నొప్పి:** 10 గ్రాముల వెల్లుల్లి రసంలో 5 మోతాదుల ఇంగువను బాగా కలిపి ఉంచాలి. పార్శ్వ నొప్పి ఉన్న వైపు ముక్కులో అవసరమైనప్పుడు వేసిన కొంతసేపటికి తగ్గుతుంది.

**జీర్ణశక్తి తగ్గినప్పుడు రక్తపోటు నివారణకై:** 200 గ్రాముల వెల్లుల్లిని తీసికొని చీల్చి కట్ చేసి పావుకిలో ఆవు నెయ్యిలో కలిపి సన్నని సెగపై కాచి గట్టిపడనివ్వాలి. దీనికి సమానమైన పంచదారను కలిపి ఉడికించి కోవాలాగా తయారుచేసిపెట్టు కోవాలి. గాజుపాత్రలో నిల్వచేసుకొని బిళ్ళల్లా తయారు చేసికోవాలి. ఉదయానే ఒకటి లేక రెండు బిళ్ళను తిన్నచో రక్తపోటు నియంత్రించబడుతుంది. హృదయస్పందన సమస్థితిలో ఉంటుంది. జీర్ణశక్తి సమస్థితికి వస్తుంది.

**వెల్లుల్లి నూనె ఉపయోగించెడి విధానము-ఉపయోగాలు:** చెవిపోటు బాధితులు తక్కువ వినికిడిగలవారు ఈ నూనెను రెండు చుక్కల చొప్పున చెవిలో వేసుకొనిన ఉపశమనం కలుగుతుంది.

**వెల్లుల్లి నూనె తయారీ విధానము:** లీటరు నువ్వుల నూనె (నల్లనివి) ఇనుప కడాయిలో పోసి, దీనిలో 20 గ్రాముల అక్రోట్ గింజలను, 250 గ్రాముల వెల్లుల్లి రెబ్బలను వేసి సన్నని సెగపై బాగా కాచాలి. దానిలోని నీరు ఆవిరైపోగానే పొయ్యి నుండి దింపి మిశ్రమాన్ని చల్లార్చి తదుపరి గాజుసీసాలో భద్రపరచుకోవాలి.

**ఖిటూటి దకారే ఆనా:** పాలు, పంచదార లేని తేనేటిని తయారు చేసుకోవాలి. దీనిలో కొంచెం బెల్లం కలిపి, ఒక నిమ్మకాయ బద్ద రసాన్ని 5 చుక్కల వెల్లుల్లి రసాన్ని కలిపి త్రాగాలి. ఇది వాత, పిత్త మరియు కఫాన్ని హరించి వేస్తుంది.

**సాధారణ దగ్గు నివారణకై:** వెల్లుల్లి కాల్చి దాని భస్మాన్ని తయారు చెయ్యాలి. 4 ఎత్తుల భస్మాన్ని మాత్రలుగా చేసికొని తేనెతో రోజుకు 3-4 సార్లు సేవించిన దగ్గు నివారణ అవుతుంది.

## గోడలకి చెవులు

*సాధారణంగా వ్యక్తి అన్నింటి పట్ల ఆపేక్ష చూపిస్తాడు కాని మంచి ఆలోచనలు, మంచి పనులు పట్టించుకోడు. చైనాకు చెందిన హుయిలేంగ్ అనే ధర్మోపదేశకుడు గోడవైపు ముఖాన్ని, శ్రోతలవైపు వీపును ఉంచి ప్రవచనం ఇస్తూ ఉండేవాడు. ఇదేమి వింతని ప్రజలు ప్రశ్నించగా అతను ఇలా అన్నాడు. "ఈనాటి మనుషులు గోడల్లాగే ఉంటున్నారు. కనీసం ఒక కిటికి వంటిది కూడా మానవులకు ఉండటం లేదు. వారు వింటారనిగాని, అర్థం చేసుకుంటారని గాని, విన్నది ఇతరులకు చెప్తారని గాని ఆశలేని నేను ఈ విధంగా గోడలకి చెప్పటం అలవాటు చేసుకున్నాను. నేను చేస్తున్న ఈ పని వలన ఎప్పుడో అప్పుడు గోడలకి చెవులు వస్తే ప్రజలు కూడా ఎప్పుడో అప్పుడు వింటారులే, గోడలకే చెవులు వచ్చాయి కదా! అనే ధైర్యం కలిగి నాలో క్రొత్త ఉత్సాహం కలుగుతుంది."*

- ప్రజ్ఞా పురాణం నుండి

**"మనం చెయ్యలేము" అనుకుంటే అడుగు ముందుకు పడదు**

# అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018 (కౌంట్‌డౌన్-11)

**సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది**

## తెలుగు నారీలోకానికి మహాకాలుని పిలుపు

19 సెప్టెంబర్, 1975లో శాంతికుంజ్‌లో పూజ్యగురుదేవుల చేసిన ప్రసంగ సారము

గాయత్రీ మంత్రము మాతోపాటు ఉచ్చరించండి:

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం ।**
**భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ॥**

దేవీ స్వరూపులారా! సోదరులారా! భగవాన్ బుద్ధుడు ధర్మచక్రం ద్వారా తమ ఆందోళన నిర్వహించారు. దీనితో నిలిచిపోయి స్తబ్ధతతో నిండిన ధర్మ ప్రవాహాన్ని భగవాన్ బుద్ధుడు తిరిగి ప్రవహింపజేశాడు. జాగృతం చేసి పునరుద్ధరించాడు. నిల్వ ఉంచిన చెరువులోని నీరు చెడుతుంది. ప్రవాహమున్న నదిలోని నీరు ప్రాణవంతమై ఉంటుంది. ఇదే రీతిలో బుద్ధ భగవానుడు స్తబ్దతతో కూడిన భారతీయ ధర్మ ప్రవాహానికి ప్రాణశక్తిని జోడించి జాగృతం గావించాడు. ఇదే రీతిలో మానవుడు నిరంతరం ప్రగతిమార్గాన పయనించాలి. అనుక్షణం తనలోని లోపాలను పదే పదే సవరించుకొంటూ ఉండాలి.

మీరు అర్ధనారీశ్వరుని చిత్రాన్ని చూసే ఉంటారు. సగం శరీరం శంకరుడు (పురుషుడు) మిగిలిన సగం శరీరం పార్వతి (స్త్రీ). అట్లే రాధాకృష్ణులు, సీతారాములు. దీని అర్థము స్త్రీ-పురుషులు సమానమని - ప్రాచీనకాలపు ఇతిహాసాన్ని పరిశీలించిన ఈ క్రింది సత్యాలను మనకు బోధపడతాయి.

ఒక పర్యాయం దేవతలు దశరథుని, దేవాసుర యుద్ధంలో తమకు సహాయమందించమని కోరగా, ఆయన వెంట మూడవ భార్య కైకేయి కూడా వెళ్ళింది. ఈమె ధనుర్బాణాల ప్రయోగించుటలో, అశ్వచాలనంలో అత్యంత నిపుణురాలు. యుద్ధం తీవ్రంగా జరుగుచున్న సమయంలో దశరథుని రథ చక్రం యొక్క మేకు ఊడిపోయి రథం ఊగిపోతూ ఉంది. సునిశిత దృష్టికలిగిన కైకేయి పరిస్థితిని గ్రహించి, రథం చక్ర మేకు స్థానంలో తన చేతి వ్రేలును ఉంచి, యుద్ధం ముగిసేంతవరకు రథాన్ని కాపాడి భర్తకు చేయూతనిచ్చి భర్తకు గౌరవాన్ని అందించి నిజమైన అర్ధాంగిగా వన్నెకెక్కింది.

శ్రీ కృష్ణ-నరకాసుర సంగ్రామంలో శ్రీకృష్ణుని ప్రియసఖి సత్యభామ యుద్ధంలో మూర్ఛిల్లిన కృష్ణుడు తేరుకొనేంత వరకు, నరకాసురునితో యుద్ధం చేసి, నరకాసుర వధకు తన తోడ్పాటును అందించింది. ఇట్లే కలియుగంలో మనదేశ చరిత్రలో రాణీ లక్ష్మీబాయి, రాణీ దుర్గాబాయి పేరుగాంచిన యోధు రాండ్రుగా మనకు తెలుసు. వీరి వీరగాథలను మనం మరచిపో జాలం.

అట్లే అన్ని రంగాలలో స్త్రీలు రాణించారు. జనకమహారాజు సభలో గార్గి-యాజ్ఞవల్క్యుల మధ్య జరిగిన సంవాదం మరపు రానిది. మహాతపస్వి, జ్ఞానవంతుడైన యజ్ఞావల్క్యుని, తన ప్రశ్నలతో ముంచెత్తిగా, కోపం చెందిన మహర్షిగార్గిని శపించె దనని, ఆమె తల నేలరాలుతుంది అన్నాడు. తపోజ్ఞాన నిధియైన గార్గి, కించిత్తు కూడా వెరువక, 'అయిపోయిందా? మీ జ్ఞానము శిరస్సు ఖండించే వరకే పరిమితమైపోయిందా?" అని యాజ్ఞవల్క్యుని ఎత్తి పొడిచింది.

మిత్రులారా! మన ప్రాచీన ఇతిహాసాలను పరిశీలించిన మనకు బోధపడునది, సప్త ఋషులలో మహిళయైన అనసూయ, సప్తఋషులకు నేతృత్వం వహించిన సందర్భాలు కనిపిస్తాయి.

మనకు గౌరవప్రదమైన మన భూతకాల సంస్కృతిని పరిశీలించినప్పుడు భారతీయ స్త్రీ ఎల్లవేళలా శక్తి స్వరూపిణి, భగవతిగా విరాజిల్లి మన జాతిని ప్రగతిపథంలో నడిపించి, జాతి గౌరవమన్ననలను అందుకొంది.

**యాదేవి సర్వభూతేషు మాతృరూపేణా సంస్థితా ।**
**నమస్తస్యై నమస్తస్యై నమోనమః ॥**

స్త్రీ మన తల్లి మరియు ధర్మపత్ని కూడా - "ఆమె" తయారు చేసింది. మన ధర్మపత్ని మనకు ఒక గూడు తయారు చేసింది, అలసిన మనకు విశ్రాంతి అచ్చట లభిస్తుంది.

మిత్రులారా! స్త్రీలు-పురుషులతో సమానంగా సమాజంలో గౌరవింపబడ్డారు. కాని మధ్యకాలంలో స్త్రీల పట్ల అనేక రకాల నిర్బంధాలు విధించారు. దీనికి ముందు ప్రాచీన కాలపు సమయం స్త్రీల ప్రగతి సమయం. అప్పుడు స్త్రీలకు సంపూర్ణ

**అసాధ్యమని వదిలివేయబడ్డ ఎన్నో లక్ష్యాలు సాధించబడ్డాయి**

గౌరవం లభించింది. వారు లక్ష్మీనారాయణులుగా, సీతారాము లుగా, రాధాశ్యాములుగా వినుతికెక్కారు. శివునికి ముందు శక్తిని పూజించేవారు. సరస్వతీదేవి పండుగ వసంత పంచమిగా, లక్ష్మీదేవి పండుగను దీపావళిగా, దుర్గాదేవి పండుగ దశహరాగా జరుపుకుంటున్నాం. మేము (గురుదేవులు) వీరిని భగవత్ శక్తి స్వరూపంగా భావిస్తున్నాం. నవరాత్రులందు నవవిధ దేవీ పూజ చేస్తారు.

మిత్రులారా! స్త్రీ-పురుషులు పరస్పర పూరకాలు. ఒక బండికున్న రెండు చక్రాల వంటివారు. నాయనలారా! బ్రహ్మ బలం, క్షత్రియ బలం రెండూ మా వద్ద (గురువు) ఉన్నాయి. అవసరాన్ని బట్టి మేము శాపము ఇవ్వగలం, అస్త్రశస్త్రాలు ప్రయోగించగలం. భగవంతుని అవతరణ ఉద్దేశ్యం కేవలం ధర్మస్థాపన మరియు పాపులను శిక్షించుట, సజ్జనులను రక్షించుట. అందుకే మహాభారత యుద్ధం లంకా దహనం జరిగాయి. ఆనాడు పాపులు (రాక్షసులు) కంటికి కనిపించే వారు. వారిని సంహరించుట సులువుగా ఉండేది. నేడు పాపులు మలేరియా, డెంగ్యూ మున్నగువాని రూపంలో, మూఢ విశ్వాసాలు, అజ్ఞానము, దుష్టసాంప్రదాయాల ఆచారాల రూపంలో ఉన్నారు. వీరిని తొలగించుట అంత సులువు కాదు.

నాయనలారా! మీరంతా క్షేత్రాలకు వెళ్ళి అచ్చటి ప్రజలకు పూజాపాఠం, అనుష్ఠానం బోధించి వారిని మనిషిగా తయారు చేయాలి. వారిలోని దైవీశక్తుల మేల్కొల్పాలి. భగవన్నామ సంకీర్తన కుంభకర్ణుడిలాంటి వారిని కూడా నిద్రలేపుతుంది. గాయత్రీమాతను మంత్రాన్ని జపించుటకర్థము వివేకాన్ని జాగృతం చేయుటయే. మీరంతా ప్రజలలోనున్న అంధకారాన్ని దూరం చేసి ప్రకాశాన్ని నింపాల్సి ఉంది. ధర్మవ్యాప్తి కొరకు అధర్మాన్ని సమాప్తి గావించాలి.

మిత్రులారా! మన గాయత్రీ పరివార్ సంస్థ తిరిగి నూతన మార్గంలో మానవీయ అధికారాలను రక్షించే విధానాన్ని చేపట్టాలి. సమాజానికి తగిన ప్రేరణనివ్వాలి. మానవత్వంతో కూడిన కర్తవ్య ప్రేరణ లభింపజేసేదే ధర్మము.

మిత్రులారా! మీకు తెలియదు - ఏ పనికోసం నేను ఇచ్చటికి పంపించబడ్డానో నా జీవితంలోని చివరి భాగాన్ని దీనికై అట్టి పెట్టాను. నా జీవితమంతా భారతీయ సంస్కృతి, ధర్మాల గురించి వాని విశిష్టతల గురించి ప్రచారం చేశాను.

ప్రజల మేల్కొల్పుతాను. స్త్రీలు ముఖ్యంగా మేల్కొనాలి. వీరంతా మానవత్వాన్ని పెంచుకొని, అవినీతికి విరుద్ధంగా సంఘర్షించాలి. నిజాయితీతో కర్తవ్యాన్ని ప్రేమించాలి. మీరంతా భారతీయ కుటుంబ వ్యవస్థను జీవింపజేయాలి. నేడు ప్రజలు వ్యక్తి యొక్క సమాజం యొక్క వికాసం గురించి యోచిస్తున్నారు. కానీ వ్యక్తికి, సమాజానికి మధ్యనున్న కుటుంబాన్ని గురించి మరచారు. వాస్తవంగా కుటుంబమే పై రెండింటికి మధ్య వారధిలా పనిచేస్తుంది. వినోబా తల్లి, తన పిల్లలను బ్రహ్మ జ్ఞానులుగా, సాధువులుగా చేసి గాంధీగారి పనిని కొనసాగిం చారు. వీరంతా కుటుంబమనెడి గురుకులంలో చదివారు. కావున మనమంతా కుటుంబాలను జాగృతం చేయనిచో సరియైన వ్యక్తులు రూపొందరు. సమాజం నిర్మింపబడదు. ప్రతి ఇంటిని ఆశ్రమంగా తయారుచేయాలి. గృహలక్ష్మి దానికి ప్రాచుర్యరాలు మరియు ప్రధానోపాధ్యాయిని - ఉపకులాధి పతి.

స్త్రీ యోగ్యురాలైన భర్తకు సంతానానికే కాక, ఆమె సమాజానికి దేశానికి కూడా లాభాన్ని చేకూర్చుతుంది.

కావున యోగ్యులైన కన్యలు, మహిళలు, అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ ప్రయాజ కార్యక్రమాల్లో ప్రధాన పాత్ర పోషించాలి. వీరంతా ప్రాణవంతులుగా, దావానలంలా ఈ ప్రయాజ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. వీరంతా మాలోని (గురు దేవులలోని) అగ్నిని, ఈ నిప్పు కణికను తెనుగు నాట అంతటా వ్యాపింపచేయాలి, దానిని విస్ఫోటనం చెయ్యాలి.

సమాజంలోని స్త్రీలు అంతగా విద్యావంతులు కాదు, అందువలన వీరు గురుదేవుల సాహిత్యం ద్వారా వీరు సమాజాన్ని, ప్రజలను అంతగా జాగృతిపరచజాలరు. కావున వీరంతా గీతాలు, ప్రవచనం, కథలు, సామూహిక సత్సంగం, హవనం, గోష్ఠి సంస్కారాలు మున్నగువాని ద్వారా సమాజాన్ని జాగృతం చెయ్యాలి.

కావున తెనుగు స్త్రీ మూర్తులంతా పరమ పూజ్యగురుదేవుల కన్నుల్లా మెదలాలి. గురుదేవుల అడుగులో అడుగువేస్తూ కదలాలి.

అప్పుడే మహాకాలుని ప్రణాళిక సఫలమై తీరుతుంది. రానున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం సఫలీకృతమవుతుంది.

తెనుగు నాటనున్న స్త్రీ మూర్తులందరికీ సాదర స్వాగతం అశ్వమేధ యజ్ఞానికి - జపానికి.

*మూలం: పూజ్యగురుదేవుల ప్రసంగం నుండి*
*సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**"జయమ్ము నిశ్చయంబురా" అనుకుంటూ ముందుకు సాగాలి**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## కడప, కర్నూలు జిల్లాలలో

14 నవంబరు 2016న బ్రహ్మంగారి మఠం గ్రామం, కడపజిల్లాలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞము, శ్రీ చంద్రమౌళీశ్వర రెడ్డిగారి గృహమునందు నిర్వహించిరి. దీనిలో సుమారు 60 మంది వరకు పాల్గొన్నారు. గాయత్రీ పరివార్, యుగ నిర్మాణ్, అశ్వమేధాన్ని గురించి వివరించుట జరిగింది.

28 నవంబరు 2016వ తేదిన ఎనకండ్ల గ్రామం, గోనెగండ్ల మండలం, కర్నూలు జిల్లాలో ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణమందు నవకుండి గాయత్రీ యజ్ఞము నిర్వహించారు. గ్రామంలో 60 సంవత్సరముల నిండిన వృద్ధులను గ్రామస్తులు సత్కరించారు.

పై రెండు కార్యక్రమాలను గాయత్రీ పరివార్ సభ్యులు శ్రీయుతులు శ్రీ మార్తల సత్యన్నారాయణరెడ్డి మరియు శ్రీ ఇ.రామకేశవులు గార్లు నిర్వహించారు. గ్రామపెద్దలైన శ్రీ సీతారామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి మున్నగువారు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో

27 నవంబర్ 2016 ఆదివారము శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం, శివసాయినగర్ కాలనీ, మీర్‌పేట, హైదరాబాద్ నగరములో నవకుండీ గాయత్రీ యజ్ఞము నిర్వహించారు. దీనిని గాయత్రీ పరివార్, బేగంబజార్‌శాఖ శ్రీ గోకుల్‌చంద్ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

దీనిలో ప్రాంత ప్రముఖులైన ఎం.ఎల్.ఎ., శ్రీ తీగల కృష్ణారెడ్డి, శ్రీ తీగల సుభాష్ రెడ్డి, శ్రీ రంజిత్‌రెడ్డి, శ్రీ గూడ విజయకుమార్, శ్రీ కృష్ణారావు, శ్రీ సంతోష్ ప్రభృతులు పాల్గొన్నారు.

## 24 కుండముల గాయత్రీ యజ్ఞము, పద్మానగర్, భివాండీ, థానే జిల్లా, మహారాష్ట్ర

24 కుండముల గాయత్రీ పద్మానగర్, భివాండీ తహశీల్, థానేజిల్లా, మహారాష్ట్రలోని, పద్మజవిఠల్ సిరిమళ్ళ హాలులో 10 జనవరి నుండి 12 జనవరి వరకు నిర్వహింపబడింది. 10వ తేది మొదటిరోజున 108 కలశములతో గాయత్రీ ప్రజ్ఞా పీఠము, సాయినగర్, కామత్‌ఘర్, భివాండీ పట్టణము, థానే జిల్లా నుండి ప్రారంభమై 3.5 కి.మీ. దూరము ప్రయాణించి, సాయంత్రం 6.30 గం॥లకు పద్మానగర్ హాలు వద్దకు చేరుకున్నది. దీనిలో అత్యంత ఉత్సాహంగా స్త్రీలు పాల్గొన్నారు.

సాయంత్రము దీపయజ్ఞము నిర్వహించారు. మరునాడు 11వ తేదిన దేవపూజనం చేసి, సర్వదేవతల కలశాలతోపాటు, సర్వభద్ర కలశానికి దేవమంచ్‌పై ఏర్పాటు చేసిన కలశము, దీపాలకు పూజ చేశారు. అటుపిమ్మట యధావిధిగా యజ్ఞాన్ని నిర్వహించారు. చివరిరోజైన 12వ తేదిన 24 కుండముల యజ్ఞ పూర్ణాహుతితో యజ్ఞాన్ని పూర్తి చేయుట జరిగింది. దీనిలో పుంసవన సంస్కారాలు, అక్షరాభ్యాస సంస్కారాలు, జన్మదిన సంస్కారాలు ఉచితంగా నిర్వహించారు.

సాయంత్రము 6 గం॥లకు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని "అశ్వత్థామ" (మహాభారత యుద్ధకాండ) ఏకపాత్రాభినయ నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని శాంతికుంజ్ హరిద్వార్ దేవసంస్కృతి విశ్వవిద్యాలయ విద్యార్థులు నిర్వహించారు. ఏకపాత్రాభినయం నాటిక అందరిని ఆకట్టుకుంది.

అటు పిమ్మట తిరిగి దీపయజ్ఞం నిర్వహించారు. పై కార్యక్రమాన్ని శాంతికుంజ్, గాయత్రీ పరివార్ బృంద సారధ్యంలో నిర్వహించారు. పద్మానగర్ భివాండీ మరియు పరిసర ప్రాంతాలలో నివసించుచున్న తెలుగు ప్రజలు వందల సంఖ్యలో పాల్గొన్నారు. గాయత్రీ చేతనా కేంద్రానికి ఈ సందర్భంగా రూ.5241/- అంశదానాన్ని అందించారు. దీనిలో శ్రీ సిరిమెళ్ళ రాజారాం ప్రముఖ పాత్రను పోషించారు. శ్రీ జోషిగారు యజ్ఞాన్ని నిర్వహించుటలో అవిరళ కృషి సల్పారు.

## గాయత్రీ జ్ఞానవిస్తార మండలి ప్రారంభము

24 కుండముల గాయత్రీ యజ్ఞం పూర్తి చేసిన తదుపరి భివండీ పట్టణము, థానే జిల్లాలోని పద్మానగర్‌లో నివసించుచున్న ప్రవాసాంధ్రులలో ఔత్సాహికులైన 24 మంది యువకులతో

ప్రతికూల పరిస్థితులు మనలను వెనుకకు నెట్టకుండా చూసుకోవాలి

"గాయత్రీ జ్ఞానవిస్తార మండలి" నామముతో ఒక ప్రజ్ఞాపీఠాన్ని ఏర్పాటు చేయుట జరిగింది.

ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఒక్కొక్క మండలి సభ్యుడు ఐదుగురిని యుగశక్తి గాయత్రీమాసపత్రికకు చందా దారులను చేర్పించుటకు సంకల్పాన్ని గైకొన్నారు. అట్లే అధ్యక్షుడుగా ఎన్నుకొనబడిన శ్రీ సిరిమెళ్ళ రాజారాంగారు తొమ్మిది మందిని పాఠకులుగా చేర్పించుటకై సంకల్పం తీసుకొన్నారు. దీనితో జనవరి 2017 నుండి నెలనెలా 124 పత్రికలు హైదరాబాద్ నుండి తెప్పించుకొనుటకై ఏర్పాటు చేశారు. ఒక్కొక్క సభ్యుడు నిత్యం రూ.5/- అంశదానం చెల్లించుటకు అంగీకారం కుదిరింది. వారానికి ఒకరోజు దీపయజ్ఞం చేయుటకు నిర్ణయించారు.

## వర్లి, డి.డి.చాల్, ముంబయి

డిసెంబర్ 18 మరియు 19 తేదీలు 2016లో 24 కుండముల గాయత్రీ యజ్ఞము వర్లి, డి.డి.చాల్, ముంబయి మహానగరంలో వలస వెళ్ళిన ముంబయి తెలుగు గాయత్రీ పరివార్ నిర్వహించారు.

18వ తేది కలశయాత్ర 150 మంది మహిళలతో, 19వ తేది పూర్ణాహుతి నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమంలో వర్లి, డి.డి.చాల్ ముంబయి ప్రాంతంలో నివసించుచున్న తెలుగువారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీనిని శాంతికుంజ్, హరిద్వార్, గాయత్రీ పరివార్‌లో మరియు గాయత్రీ చేతనా కేంద్రము ముంబయి వార్ల సారథ్యంలో జరిగింది.

దీనిలో శ్రీ రేగుంట శ్రీధర్, భూమానందం, రాజా, ధర్మపురి రాజయ్య, మారుతి మున్నగు వారు తమ తమ కుటుంబాలతో పాల్గొన్నారు.

## కామారెడ్డిలో

పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య, వందనీయ మాతా భగవతీదేవిశర్మల సూక్ష్మ సంరక్షణలో అఖిల విశ్వగాయత్రీ పరివార్, శాంతికుంజ్, హరిద్వార్ కార్యకర్తలతో ఓల్డ్‌బోయినపల్లి, స్వర్ణధామనగర్ గాయత్రీ జ్ఞానమందిర్ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యుల సహకారంతో శ్రీ గబ్బుల బాలయ్యగారి రైస్‌మిల్ ఆవరణలో జనవరి 7, 8 తేదీలలో జరిగిన 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం నభూతో నభవిష్యతి అనే రీతిలో జరిగింది. ముందురోజు జనవరి 7వ తారీఖు శనివారం మధ్యాహ్నం 4 గం॥లకు కామారెడ్డిలోని ధర్మశాల నుండి గంజ్ రామాలయం వరకు వందలాది మంది మహిళా మాతృ మూర్తులతో జరిగిన భవ్యకలశయాత్ర మరియు సహస్ర మహా దీపయజ్ఞం ఆ దేవతారూపాలే సూక్ష్మశరీరాలతో దిగివచ్చాయా అన్నంతో దేదీప్యమానంగా సాగింది. నారీశక్తికి జై అనే నినాదాలతో కామారెడ్డి పట్టణం మారుమ్రోగిపోయింది. గత సంవత్సరం కాలం నుంచి కామారెడ్డి జిల్లాలోనే అన్ని గ్రామాల్లో గాయత్రీ జ్ఞానమందిర్ ఆధ్వర్యంలో జరిగిన దాదాపు నలభై 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞాల ప్రాణశక్తి జనవరి 8వ తారీఖు ఉదయం 8 గం॥లకు శ్రీ గబ్బుల బాలయ్యగారి రైస్‌మిల్ ప్రాంగణంలో జరిగిన 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞంలో పరిపూర్ణమై గురుదేవుల యుగనిర్మాణ ఆలోచనా ప్రవాహానికి కామారెడ్డి జిల్లాలో శాశ్వతమైన బీజాన్ని నాటింది.

ఈ మహాయజ్ఞంలో సామూహిక గాయత్రీమంత్ర దీక్షలు ఇవ్వబడ్డాయి. గురుదక్షిణగా భక్తులు, సమయ, అంశదానాలను సమర్పించారు. గురుదక్షిణగా 31000 రూ॥ అంశదానం, సమయదానంగా రోజులో ఒక గంట సాహిత్య స్వాధ్యాయానికి, సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగిస్తామని సంకల్పం చేయడం జరిగింది. గురుదేవుల సాహిత్యం రూ.60,000/- వరకు అమ్ముడు అయ్యింది. అలాగే గురుదేవుల ఆత్మ అయిన యుగ శక్తి గాయత్రీ మాసపత్రికకు 525 మంది చందాదారులను చేర్పించుటకు సంకల్పం జరిగింది. ముఖ్య అతిథులుగా తెలంగాణ వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డిగారు మరియు ప్రభుత్వ విప్ ఎమ్.ఎల్.ఎ. శ్రీ గంప గోవర్ధన్‌గారు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో మొదలైన ఈ కార్యక్రమంలో శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధులు శ్రీ ఉమేష్ కుమార్‌శర్మ, ప్రశాంతిశర్మ, డి.వి.ఆర్.మూర్తిల ఆధ్యాత్మిక ప్రవచనాలు మరియు శ్రీ పూల్‌సింగ్ టోలి అద్భుత గానామృతం ఈ మహాయజ్ఞానికి విచ్చేసిన వేలాదిమంది భక్తులను ఆనంద జ్ఞానసాగరంలో ముంచెత్తాయి. భక్తులు తమ ఈర్ష్యాద్వేషాలు, అహంకారం, అవినీతి, దురలవాట్లను యజ్ఞపూర్ణాహుతిగా సమర్పించారు. ఈ మహాయజ్ఞానికి శ్రీ నర్సయ్యగారు, శ్రీ శ్రీశైలం, సావిత్రి, శ్రీ విజయ్, శ్రీ విక్రమ్, కామారెడ్డి గాయత్రీ పరివార్ సభ్యులు తమ సహకారాన్ని అందించారు.

**ఎన్ని అడ్డంకులు ఉన్నా చివరి వరకు కొనసాగేవాడే ఉత్తముడు**